# కథామంజరి

## పది కథల సమాహారం



జూన్ 2025

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

**జూన్ 2025**

సంపుటి : 6 ♦ సంచిక : 6

# కథామంజరి

## జన్మదిన సంచిక కథల పోటీ

## 'నేటి యువత'

కథామంజరి ఐదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఎప్పటిలాగే కథలపోటీని నిర్వహిస్తున్నాం. ఈ పోటీకి మీ నుండి కథలను ఆహ్వానిస్తున్నాం.

**ప్రథమ బహుమతి ₹ 5000/-**
**ద్వితీయ బహుమతి ₹ 3000/-**
**తృతీయ బహుమతి ₹ 2000/-**

**10 ప్రత్యేక బహుమతులు ₹ 1000 /- చొప్పున**

### ....... నిబంధనలు .......

◈ ఇతివృత్తం '**నేటి యువత**' చుట్టూనే ఉండాలి. ఈ రోజుల్లో వారి ఆలోచనలు, సమస్యలు, బంధాలు.. ఇలా ఏ విషయం తీసుకున్నా అది యువత దృష్టిలోనే నడవాలి. వారి చుట్టూనే ఉండాలి. కథ 1200 పదాల కంటే మించరాదు.

◈ కథను వర్డ్ ఫార్మాట్ లో యూనికోడ్ లో టైపు చేసి పంపాలి. పిడియఫ్ ఫార్మాట్ లో పంపే కథలు అనుమతించబడవు.

◈ కథతో పాటు హామీపత్రం జతచెయ్యాలి. ఆ పత్రంలో ... కథ తమ స్వీయరచన అని, మరే ఇతర పత్రికలకు పంపలేదని, సాంఘికమాధ్యమాలలో గాని, బ్లాగులలో గాని ప్రచురణ/ప్రసరణ జరగలేదని, సుస్పష్టంగా పొందుపరచాలి.

◈ పోటీకి వచ్చిన కథలలో సాధారణ ప్రచురణకు కూడా కొన్ని కథలు ఎంపిక చేసుకుని, వీలు వెంబడి ప్రచురణ చేస్తాము. అలా ప్రచురణకు తీసుకునే కథలను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి పంపడం జరగదు. దయచేసి రచయితలు "పోటీలో బహుమతులు పొందకపోతే మా కథని తిప్పి పంపమని" మాకు అభ్యర్థనలు పంపవలదు. ఈ విషయం ప్రత్యేకంగా గమనించవలసిందిగా కోరుతున్నాం.

◈ కథ హామీపత్రంలో '**నేటి యువత కథల పోటీకి**' అని వ్రాసి పంపాలి.

◈ కథలు ***submit@kathamanjari.in*** కు మెయిల్ ద్వారా **05 జూన్ 2025** లోగా మాకు చేరాలి.

కథకులందరూ తమ రచనలతో ఉత్సాహంగా పాల్గొని, ఈ పోటీని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాం.



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు

కృపాకర్ పోతుల

నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు

కొచ్చెర్ల వి.ఆర్.

సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | ... | i |
| విశిష్ట అతిథి | ... | ii |
| కథా మార్గదర్శి | ... | iv |
| కథా పరిచయం | ... | vi |
| వినదగునెవ్వరు చెప్పిన.. | ... | ix |
| కథాపుస్తక పరిచయం | ... | x |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| స్పర్శాకాలం | వి. రాజారామమోహన రావు | 1 |
| తెరిచిన కిటికి | బి. నర్సన్ | 4 |
| వేటు | ఘండికోట విశ్వనాథం | 9 |
| కళ్ళెం | పొత్తూరి సీతారామరాజు | 16 |
| బొమ్మ పెట్టెలో పట్టుచీర | డా. తాడేపల్లి రామలక్ష్మి | 22 |
| ఎన్నాళ్ళిలా? | డా. మజ్జి భారతి | 29 |
| తగిన శాస్తి | సంగనభట్ల చిన్న రామకిష్టయ్య | 34 |
| ధర్మయుద్ధం | అద్వైత్ షణ్ముఖ్ ఊటుకూరు | 37 |
| వెన్నెల కురిసిన రాత్రి | అక్కనాపల్లి సుబ్బారావు | 41 |
| ఏమి అదృష్టం! | ఆచంట శారదాదేవి | 45 |


Cover Page Credits : Shri PSN Murty, Visakhapatnam

# కథాకీయం



పురాణకాలం నుంచి దేశాల మధ్య చిచ్చులు, యుద్ధాలు కొత్త కాదు. చక్రవర్తులు, రాజుల చరిత్ర చూసినా అదే ధోరణి! అప్పుడు అవి తప్పలేదు. వర్తమానంలో కూడా తప్పడం లేదు. ప్రపంచంలో ఎప్పుడు చూసినా, ఓ రెండు దేశాల మధ్య యుద్ధాలు జరుగుతూనే ఉంటాయి.

అది సరే.. ఆ యుద్ధాలు, ఆ విషయాలు మన కథల ప్రపంచంలో పిడకల వేటలా ఉన్నాయని అనుకోనక్కర్లేదు. ఇతిహాస కాలంలో నుంచి యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి... ఆ యుద్ధాలలో నుంచి మనకి కథలు పుట్టుకొస్తునే ఉన్నాయి. రామాయణ, భారతాలు వంటి ఇతిహాస గ్రంథాలను పూర్తిగా ఔపాసన పట్టినవారు కూడా ఆశ్చర్యపోయేలా.. వారికి తెలియని పిట్టకథలు ఉన్నాయి. కొత్తవి వస్తున్నాయి. ఇక మన దేశచరిత్ర చూస్తే .. ప్రధానమైన యుద్ధాల వెనుకా, ముందూ .. మనకి ఎన్నో పిట్టకథలు వినబడతాయి. వీటన్నిటి సృష్టికర్త రచయిత! రవిగాంచని చోట .. రచయిత తాను కని, ఎన్నో కథలు సృష్టించాడు. అలా ఏ యుద్ధం చూసినా.. ప్రధానఘట్టం ముందు వెనుకల కథల సృష్టికి రచయిత నడుంకట్టి ఉండకపోతే.. మనం ఎంతో పరిజ్ఞానాన్ని కోల్పోయేవాళ్లం! ఉత్తేజపరిచే సంఘటనలు తెలిసుండేవి కావు! దేశ భద్రతా విషయాల దగ్గర్నుంచి సాంకేతిక విశేషాల వరకు.. ఎన్నో విషయాలు ప్రజలకు తెలిసేదే కాదు!! అంతే కాదు.. యుద్ధ సమయంలో.. ఎన్నో దీనమైన సంఘటనలు ఉంటాయి, హృదయం చలించిపోయే విషయాలు ఉంటాయి, గుండె గుబేలుమనే విషయాలు, ఆహ్లాదపరిచేవి, వ్యూహాలకి ఉపయేగపడేవి.. ఇలా ఎన్నో యుద్ధ సంబంధ విషయాలు మరుగునపడేవి. అవన్నీ కథలు కథలుగా తెలుగునాట వచ్చాయి. పాఠకులు వాటికి బ్రహ్మరథం పట్టారు.

ఈ ప్రస్తావన ఎందుకు చేసానో.. మీ ఊహకి అందే ఉంటుంది. నిజమే.. ఓ నెల క్రిందట మన పొరుగుదేశంతో యుద్ధం జరిగింది. రెండు మూడు రోజులే జరిగుండచ్చు.. కాని యుద్ధం యుద్ధమే కదా! పైన చెప్పిన అన్ని విషయాలు ఈ యుద్ధ సమయంలో మనం చూసాం! సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగి, యుద్ధంలో కొన్ని ఘట్టాలను ప్రత్యక్షంగా చూశాం. మనమే కాదు, 'రవి' కూడా చూడని.. మరెన్నో విషయాలను మన 'కవులు'చూసుంటారు! ఇక.. వారిదే ఆలస్యం! నవరసభరితమైన యుద్ధ కథలు, త్వరలో తెలుగునాట వెదజల్లుతాయనే నమ్మకం గట్టిగా ఉంది. ఇప్పటికే కవితలు, పద్యాలు తెలుగునాట సంచరిస్తున్నాయి! కథలే.. ఆలస్యం!

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

## శ్రీ అక్కినపల్లి సుబ్బారావు గారు

ఆరడుగుల పొడుగు, స్ఫురద్రూపి, కోటు బూటులతో ఎనభై ఐదు సంవత్సరాల వయసులో కూడా అమెరికాకి ఎక్కే విమానం, దిగే విమానం.. ఆయనని చూస్తే ఓ ఉత్తర భారతీయుడనుకుంటారు! అయితే... ఆ పేరు చూస్తే ప్రపంచంలో ఏ దేశంలో ఉన్నా సరే.. 'మన తెలుగాయనే' అని ఇట్టే పోల్చుకోగలరు. విదేశాల్లో ఉన్నతస్థాయిలో ఉద్యోగం చేసి, అక్కడే స్థిరనివాసం ఉన్నారనే నమ్మకం ఎవరికైనా వచ్చేస్తుంది. అయితే.. ఏ దేశమేగినా, ఏ స్థాయిలో ఉన్నా.. తన ఉనికిని మర్చిపోకుండా, తెలుగుతనాన్ని వెంట తిప్పుకుంటూ.. నలభై ఆరో ఏట రచనారంగంలోకి అరంగేట్రం చేసి, అనతికాలంలోనే ప్రవాసభారతీయుల్లోనే కాకుండా, తెలుగు సాహితీలోకంలో కూడా గుర్తింపు సాధించారు... ప్రముఖ కథా, నవలా రచయిత శ్రీ అక్కినపల్లి సుబ్బారావు గారు!

సుబ్బారావుగారు నిజానికి కథలు రాయడం మొదలెట్టింది అమెరికాలో జీవితం ప్రారంభించిన.. ఆరేడు ఏళ్ల తర్వాతనే! అయితేనేం.. కథాశైలి, శిల్పం, కథావస్తువులను ఒడిసిపట్టుకుని, హృదయానికి హత్తుకునేలా రచనలు చేసారు, చేస్తున్నారు కూడా! గడిచిన నాలుగుదశాబ్దాల కాలంలో.. గంగిగోవు పాలలా.. అరవై డెబ్బై కథలు, పది నవలలు వ్రాసారు. తను చూసిన సంఘటనలు, తన చూట్టూ ఉన్న ప్రపంచం.. అవే కథావస్తువులు!

సుబ్బారావుగారు 1980 ప్రాంతంలో అమెరికా వెళ్ళిన కొత్తలో.. అక్కడి వాతావరణం, జీవనం, కష్టసుఖాలు వగైరా చూసి, చలించి.. ఏదో చేయాలనే తపనపడేవారు. అవి అలా గుండెలో గూడులు కట్టుకుని, చివరికి వాటిని ఉత్తరాల ద్వారా మిత్రులకు చేరవేసేవారు. ఆ ఉత్తరాలు చదివి, ఆ మిత్రులు 'కథలు వ్రాయమని' ప్రోత్సహించారు. ఆ సమయంలోనే.. ఓ మిత్రుల కలయిక సందర్భంలో, ఒకాయన "పాఠాలు చెప్పుకునే మీరు .. కథలు వ్రాయలేరు. మీ వల్ల కాదు" అంటూ వ్యంగ్యంగా మాట్లాడటంతో సుబ్బారావుగారిలో.. కథలు వ్రాయాలనే పట్టుదల ప్రారంభమైంది. 1986లో మొదటి కథ "పెద్దముల్లు, చిన్నముల్లు" వ్రాయడం, అది ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురణకు నోచుకోవడం జరిగాయి. ఆ తర్వాత ఆయన విచ్చలవిడిగా కథలు వ్రాయలేదు. ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పరిశోధించి.. కథావస్తువు మీద పెద్దవాళ్ళతో చర్చించి, అప్పుడు కథ వ్రాసేవారు. నవలల విషయంలో కూడా అంతే! అమెరికాలో అధ్యాపకుడుగా స్థిరపడి అక్కడ జీవనంలో గడించిన అనుభవం, ఇతర దేశాలలో కూడా బాగా పర్యటించిన అనుభవాలతో ఎక్కువ కథలు వ్రాసారు. భిన్న సంస్కృతుల మధ్య ఉన్న అంతరాలను అనుసంధానం చేసి, రచనలు చేయడంలో ఆయనకి ఆయనే సాటి అని చెప్పాలి! ఓ విధంగా ఆయన రచనలలో ప్రత్యేకత అదే! ఆ రోజుల్లో రావూరి భరద్వాజ గారితోనూ, చలసాని ప్రసాదరావు గారితోనూ పరిచయాలు ఏర్పడ్డాయి. వారి ప్రభావం, ప్రోత్సాహం.. తన రచనలలో చాలా ఉంటాయని సుబ్బారావుగారు అంటారు.

వారి రచనలతో పాటు చలం, ముళ్ళపూడి రచనలంటే చాలా ఇష్టపడే సుబ్బారావుగారు.. రచనల గురించి మాట్లాడుతూ.. "కథ, నవల, కవిత చదివిన తరువాత, ఒక్క క్షణం అందులో అంతర్లీనంగా ఉన్న సందేశం గురించి ఆలోచనల్లో ఒక్క పాఠకుడైనా పడ్డాడంటే.. అది ఆ రచనకి సార్థకత వచ్చినట్టే! ఆ రచయిత ఆ కథాసృష్టిలో పడ్డ ప్రసవవేదనకి ఫలితం దక్కినట్టే!" అని అంటారు. కథలు చదివి 'ఇలాంటి ఆలోచనలు ఎలా వస్తాయిరా?' అంటూ సుబ్బారావుగారి తల్లే మంచి కితాబులు ఇచ్చేవారుట! భీటలు, స్వేచ్ఛకి కళ్ళెం, చేయి జారితే, ముసుగు, నిప్పుతో చెలగాటం, సత్తు బిళ్ళలు, పొగరు పువ్వు, వెన్నెల కురిసిన రాత్రి.. వంటి కథలతో పాటు... సంజవెలుగు వంటి నవలలు చాలా ప్రజాధరణ పొందాయి. సుబ్బరావుగారు వ్రాసిన కథలన్నీ సంకలనాలుగా వచ్చాయి.

ఉపాధ్యాయ వృత్తి అంటే చాలా ఇష్టపడే సుబ్బారావుగారు.. బాల్యమంతా విజయనగరంలో తాతా అమ్మమ్మల దగ్గరే గడిపారు. అక్కడే బి.యస్సీ. చదివి, తర్వాత కాకినాడలో ఇంజనీరింగ్ చదివారు. 1961లో మద్రాసులో ఇంజనీరింగ్ కాలేజీలో అధ్యాపకుడుగా చేరి, మరోవైపు ఎం.టెక్., తర్వాత పి.హెచ్ డి. చేశారు. 1980 వరకు వరంగల్, ఢిల్లీలలో అధ్యాపకుడుగా పనిచేసి, తర్వాత 1981 అమెరికా వెళ్ళి.. అక్కడ కూడా యూనివర్శిటీ ప్రొఫెసర్‌గా పనిచేసి 2000వ సంవత్సరంలో రిటైర్మెంట్ తీసుకుని, అక్కడే స్థిరపడ్డారు.

సుబ్బారావుగారు.. ప్రస్తుతం హైదరాబాదులో నివాసం ఏర్పరుచుకున్నా.. తరుచు అమెరికా వెళ్ళి వస్తుంటారు. సూడోకు, బ్రిడ్జ్ ఆటలాడే సుబ్బారావుగారు.. "అలుపు లేకుండా కథలు వ్రాయడం అంటే అక్షరాలు దిద్దడమే" అని ఆనందంగా చెపుతారు. ఈ వయసులో కూడా చాలా బిజీగా ఉండే అక్కినపల్లి సుబ్బారావుగారిని కలుసుకోడానికి, దాదాపు మూడు నెలలు పట్టింది. విశిష్ట అతిథిగా ఆహ్వానించగానే.. ఎంతో ఆప్యాయంగా.. ఎన్నో విషయాలను పంచుకున్నారు. వారికి మా కృతజ్ఞతలు తెలుపుకుంటూ.. వయసులోనూ, కథా రచనలో కూడా సెంచరీలు కొట్టగలరనీ ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

**కీ.శే. ఆచంట శారదాదేవి**

"ఏ ఉత్తమ రచనకైనా అనుభవం అతి ముఖ్యం. ఈ అనుభవం వలననే నిజాయితీ కలుగుతుంది. అతి ప్రధానమైన ఈ నిజాయితీకి అందం, అలంకరణ కోసం ఊహా, కల్పనా సాయపడతాయి. నిజమైన అనుభవం.. ఈ ఊహా, కల్పనలతో ఎంతో ఆకర్షవంతంగా అమరుతుంది. అది సాధించినవారు.. మనకు సన్నిహితులు అవుతారు. అట్లాంటి రచయిత్రి శారదాదేవి!" అంటూ ప్రఖ్యాత రచయిత బుచ్చిబాబుగారు కితాబు ఇచ్చారంటే.. ఆచంట శారదాదేవిగారి సాహితీ ప్రతిభ గురించి వేరే చెప్పక్కర్లేదు. నిజానికి.. ఓ శతాబ్దం క్రిందట తెలుగు కథాసాహిత్యంలో అడుగుపెట్టిన రచయిత్రిలందరూ అభ్యుదయ భావాలతోనే కలం పట్టారు. కథలో, నవలలో రాసి పేరు ప్రఖ్యాతులు గాని, డబ్బు గాని సంపాదించాలనే ఆలోచన ఏ కోశాన ఉండేది కాదు. సమాజానికి ఏదో ఒక మేలు చేయాలి, ప్రజలను జాగృతం చేయలనే తపన ఒకటే అందరిలో ఉండేది. ఆ కోవలో ఆలోచించి.. కుటుంబ పరమైన ఆంక్షలు, వ్యతిరేకతలు ఉన్నా సరే, వాటిని పక్కనపెట్టి, సాహిత్యలోకంలోకి అడుగుపెట్టిన వారిలో అగ్రగణ్యులు కీ. శే. ఆచంట శారదాదేవిగారు.

శారదాదేవిగారు తనకు తెలియని జీవితాలని గాని, విషయాలను గాని అస్సలు ముట్టుకోలేదు. సహజంగా, స్వచ్ఛంగా, నిరాడంబరంగా, సరళంగా, అందంగా, మనసులో నుంచి అలవోకగా పుట్టినట్లు, వీరి రచనలు ఉంటాయి! శారదాదేవిగారి కథల్లో పాత్రలన్నీ మనకు తెలిసినవారిలా, రోజూ మనింటికి వచ్చి పోతున్న ఇరుగుపొరుగు వారిలా అనిపిస్తాయి. సంభాషణలు, పాత్రల నడవడిక, ఆలోచనలు.. అంతా అయినవారిలాగే కనిపిస్తాయి! స్త్రీలకి ఇంకా పురుషలతో సమానంగా భావస్వేచ్ఛ లేదనే రోజుల్లో.. స్త్రీవాద ఉద్యమాలు మొదలుకాక మునుపే, శారదాదేవిగారి కథల్లో ఆ స్పృహ కలగచేసే కథావస్తువు కనబడేది. వీరి కథల్లో రవీంద్రనాథ్ టాగూర్, దేవులపల్లి వారల ప్రభావం కనబడుతుంది. చిన్నచిన్న వాక్యాలతో సరళమైన భాషలో, సూటిగా చెప్పే తీరు, నిజాయితీగా తన అనుభవాలనీ మాత్రమే ఆవిష్కరించే కథనం.. శారదాదేవిగారి కథల్లో కనబడతాయి. ఆ రోజుల్లో శారదాదేవిగారి వంటి రచయిత్రిలు తెలుగు కథాసాహిత్యంలో ప్రత్యేకస్థానం సంపాదించారు. అది చూసి, పాఠకుల ఆదరణ కోసం, మగవారు స్త్రీల పేర్లతో రచనలు చేసేవారని అంటారు!

1922లో విజయవాడలో జన్మించిన శారదాదేవిగారు.. తెలుగు, ఇంగ్లీషులలో యం.ఏ. చేసారు. హిందీ, సంస్కృత భాషల్లో కూడా పట్టు సంపాదించారు. సంగీతం కూడా నేర్చుకున్నారు. ఇరవై సంవత్సరాలు తిరుపతి పద్మావతి కాలేజీలో తెలుగు అధ్యాపకులుగా పని చేసారు. 23వ ఏట తన మొదటి కథ వ్రాసిన శారదేవిగారు.. మొత్తం మీద వందలోపు కథలే

వ్రాసారు. కవిత, కోరికలు, పారిపోయిన చిలుక, మారిన మనిషి, స్మృతి, వింత స్వభావం వంటి కథలు ఎంతో ప్రజాదరణ పొందాయి.

ఆ రోజుల్లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన శారదాదేవిగారు 1999 లో కనుమూసారు! అభ్యుదయభావాలతో పాటు, వాటిని కథల ద్వారా ఆవిష్కరించగలిగే గొప్ప రచయిత్రి శ్రీమతి ఆచంట శారదాదేవి గారికి నివాళులు తెలియచేసుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

## డా. ఎం. సుగుణరావుగారి కథ "ఫ్యునరల్ పార్లర్"

కొంచెం విచిత్రమే! ఎందుకంటే, డా. ఎం.సుగుణరావుగారు రాసిన ఎన్నో కథలు చాలా పోటీల్లో బహుమతులందుకున్నవంటే అతిశయోక్తి కాదు. ఎన్నో ఏళ్ళబట్టి, మంచి కథలు రాస్తున్నా, ఎన్నో బహుమతులు గెల్చుకున్నా, ఆయన పేరు ఎందుకో ఎక్కువగా వినిపించకపోవడం వల్ల తెలుగు పాఠకులు కొంచెం నష్టపోయారనే చెప్పాలి. "అర్థమయ్యే శైలి వారిది. మానవత్వపు విలువలకు పెద్ద పీట వేస్తారు. వీరి రచనల్లో ఆశావహ దృక్పథం కనిపిస్తుంది." అంటారు శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారు ఆయన కథల గురించి చెబుతూ! తన కథల్లో ధర్మాగ్రహం ఉంటుందంటారు రచయిత. ఆయన 'జాబిలి మీద సంతకం', 'నేలకు దిగిన నక్షత్రం', 'ఆకాశంలో ఒక నక్షత్రం' అనే కథాసంపుటాలు వెలువరించారు.

వైవిధ్యం, కొత్తదనం ఉన్నకథలను అందించిన సుగుణరావుగారి కథల్లో ఒకటి 'ఫ్యునరల్ పార్లర్'.. 'నేలకు దిగిన నక్షత్రం' సంపుటం లోనిది. ఈ కథ స్వాతి వీక్లీ 9-3-2012లో ప్రచురణ సూక్తి కథల పోటీలో బహుమతి పొందింది.

రామానుజానికి తండ్రి తద్దినపు బ్రాహ్మణార్థంగా చేసే కర్మకాండలు ఇష్టం ఉండేవి కాదు. ఆయన్ని మానుకోమని చెప్పినప్పుడు ఆయన పట్టించుకునేవాడు కాదు. అగ్రహారంలో మిగతా వారంతా శుభకార్యాలు చేసి డబ్బులు గడిస్తూంటే, తండ్రి మాత్రం తన పద్ధతి మార్చుకోడు. 'అందరూ శుభకార్యాలే చేస్తే, రోజు కర్మలు చేయడానికి ఎవరైనా ఉండాలి గదా' అని నవ్వేసేవాడు. అంతే కాదు... రామానుజం కొడుకు తాతతో ఎక్కువ సమయం గడుపుతూ తాతలాగే పంచె కట్టుకుని, భుజం మీద తువ్వాలేసుకుని, చిన్న రాగి చెంబుతో కూడా కూడా తిరగడం కూడా రామానుజానికి ఇష్టం లేకపోయింది. తను మాత్రం, భాషాప్రవీణ చేసి, తెలుగు పండితుడిగా కాలేజీ లెక్చరరుగా పని చేశాడు.

కొడుకు (శంకరం) ఇంటర్ తప్పడం, తరవాత పుట్టిన కూతురు ముందే డిగ్రీ పూర్తి చెయ్యడం జరిగిపోయాయి. రామానుజానికి కొడుకుని తల్చుచుంటే బాధ. ఎలాగో డిగ్రీ అయిందనిపించిన తరువాత ఎంబీయే చేస్తానన్నాడు. సీటెవడిస్తాడని రామానుజం ఆవైపు పోనీయలేదు. ఎలాగోలా ఒక స్వచ్ఛంద సంస్థలో గిరిజన వికాస కేంద్రంలో శిక్షణ ఇచ్చేలా ఉద్యోగంలో చేరాడు. కాస్తో కూస్తో ఇంటికి పంపించేవాడు. అయినా రామానుజానికి తృప్తిగా లేదు.

రెండేళ్ల అనుభవంతో దక్షిణాఫ్రికాలో ఒక ఉద్యోగం వస్తుంది కొడుక్కి. తనకిష్టమైన ఉద్యోగం అన్నాడు. అయిష్టంగానే ఒప్పుకున్నాడు రామానుజం. వెళ్ళిన దగ్గర నుంచి, నెలకు పాతిక వేలకు తక్కువ కాకుండా పంపుతున్నాడు. అప్పుడు కొడుకు మంచి ఉద్యోగంలోనే స్థిరపడ్డాడని తృప్తిపడ్డాడు.

మూడేళ్ల తరువాత కొడుకు నుండి పిలుపొచ్చింది. తను పనిచేస్తున్న సంస్థ తనకు ఒక అవార్డు ఇవ్వబోతున్నారని, తల్లి తండ్రి రావాలని... అతనే టిక్కెట్లు అవి పంపించాడు సౌత్ ఆఫ్రికాలో జోహాన్నెస్బర్గ్ కి. ప్రయాణానికి అన్ని సౌకర్యాలు కొడుకే చూసుకున్నాడు. ఏ కష్టం లేకుండానే విమానంలో ఊరు చేరుకున్నారు. కొడుకు తల్లితండ్రులిద్దర్నీ కారులో తన

ఇంటికి తీసుకెళ్ళాడు. కొడుకుని చూస్తే గర్వంగా ఉంది రామానుజానికి. ఈ కొడుకునేనా ఎందుకూ పనికిరానివాడని అనుకున్నది? గాంధీగారు ఒకప్పుడు ఉద్యమం మొదలు పెట్టిన ఊరది. కొడుకు ఊరు గురించి చెప్పుకోస్తూంటే.. తండ్రి ఆనందానికి అవధులు లేవు. ఓ సమయంలో రోడ్డు పక్కన ఓ బోర్డు చూసి కొంచెం గగుర్పాటు కలిగిగింది రామానుజానికి. అయిస్క్రీం పార్లర్లు, బ్యూటీ పార్లర్లు చూశాడు కానీ, ఈ పేరెందుకో కొంచెం ఆశ్చర్యంగా అనిపించింది.

రాత్రి నిద్రపట్టలేదు. ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా, ఎప్పుడు తన కొడుకు అవార్డు అందుకునే క్షణం వస్తుందా అని ఎదురు చూడ్డంతోనే సరిపోయింది. మర్నాడు కొడుకు ఇచ్చిన కోటు ధరించి తండ్రి, పట్టుచీర కట్టుకుని తల్లి, రెడీ అయ్యారు. కారు ఓ పెద్ద గేటున్న ఆవరణలో ఆగింది. ఆ సంస్థ పేరు 'ఫ్యూనరల్ పార్లర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్''. రామానుజంలో మళ్ళీ దుఃఖం, మనసులో మూగ రోదన.

చిన్నారుల స్వాగతంతో బిల్డింగులోకి అడుగుపెట్టారు. గాంధీ మహాత్ముడు పుట్టిన భూమి నుంచి వచ్చిన కుటుంబానికి స్వాగతం పలికారు. తండ్రి ఎందుకింత ఖేద పడుతున్నాడో అర్థం కాలేదు శంకరానికి!

కొద్దిసేపటిలో శంకరాన్ని గౌరవంగా తీసుకెళ్ళి వేదిక మీద కూర్చోబెట్టారు. అతని పక్కనే ఉన్న శ్వేత జాతీయుడు మాట్లాడాడు. 'ఇలాంటి సంస్థ మరెక్కడా లేదని, ఇతర దేశాలలో కూడా బ్రాంచ్‌లు ఉన్నాయని, మరణాల సంఖ్య ఎక్కువగా ఉన్న ఈ దేశంలో, తమ సంస్థ అవసరం ఎంతో వుందని' చెప్పాడు. అయితే ఈ సంస్థకు మానవత్వపు పరిమళం అద్దింది శంకరం అని చెప్పాడు.

తరవాత కంపెనీ జనరల్ మేనేజర్ మార్కోస్ మాట్లాడాడు. 'గాంధీకి మల్లే శంకరం కూడా కరుణ, ప్రేమ మూర్తీభవించిన మనిషి అని, ఎయిడ్స్ బారిన పడి మరణించి అనాథ ప్రేతల్లా వదిలేయబడ్డ వారికి అంతిమ సంస్కారం శంకరం స్వయంగా నిర్వహించాడని, అందుకే అందరికీ ఆరాధ్య దైవంగా ఉన్నాడని, ఈ సన్మానం అందుకేనని' చెప్పాడు. భారతీయ సాంప్రదాయం ప్రకారం శాలువా కప్పి సన్మానించారు శంకరాన్ని! శంకరం స్పందిస్తూ, ప్రపంచంలో అందరూ చావుకు తప్ప మిగతా అన్నింటికీ ప్రణాళికలు వేస్తారని, అర్థరహిత మృత్యుభయాన్ని జయించాలంటే మనమే మన అంతిమయాత్ర గురించి ఆలోచించాలని, ఆ యాత్రను గురించి గొప్పగా ఊహించుకుంటే జీవితం పూర్తయే వరకు ప్రశాంతంగా జీవిస్తామని చెప్పి తన ప్రసంగాన్ని ముగిస్తాడు.

రామానుజానికి, భార్యకు కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. అంతలో విష్ణుమూర్తి అని ఒక ప్రొఫెసర్ వచ్చి, శంకరం చెప్పిన మాటల వల్ల తానొక జీవిత సత్యం తెలుసుకున్నానని, ఇక తను ఆనందంగా గడుపుతానని చెప్తాడు. అలాగే ఒక నల్ల జాతి యువకుడొచ్చి తన కథ చెప్పి కృతజ్ఞతలు వ్యక్తం చేస్తాడు. ఇంతమందికి స్ఫూర్తినిచ్చిన కొడుకు ఒకప్పుడు ఎంబీయే చేస్తానంటే సహకరించలేదు. చదువు సంధ్యలు రాలేదని తిట్టబడ్డ శంకరం ఈరోజు ఎంత పైకొచ్చాడో, ఎంత ఎదిగిపోయాడో! కన్నీటితో పరుగున వెళ్ళి కొడుకును హత్తుకున్నాడు. ఆ క్షణంలో అతనికి అపరకర్మలు నిర్వహించి అందరిచేతా కీర్తించబడ్డ తన తండ్రి గుర్తుకొచ్చాడు.

అదీ కథ.

రచయిత ఎంచుకున్న వస్తువు నా ఉద్దేశ్యంలో అతి ముఖ్యమయినది. కథలో చెప్పించినట్లుగా చావును గురించి తల్చుకోడానికే చాలా మందికి భయం, అదెక్కడొచ్చేస్తుందేమోనని! ఎక్కడైనా ఎవరికైనా చావు తప్పదుగా! అయితే

అంతిమయాత్ర ఎంత గొప్పగా ఉంటుందో అని ఊహించుకుంటే ప్రస్తుత జీవితం ప్రశాంతంగా ఉంటుందా? ఏమో? అనాథ ప్రేతలకు ఒక గుర్తింపు, గౌరవం, కలిగించి అంతిమ సంస్కారాలు చేయడంలో పరిణితి చెందిన మానవత్వం, ఎలాంటి మనుష్యులకైనా మనం ఇవ్వగలిగే గౌరవం శంకరం పాత్రలో కనబడతాయి. మదర్ తెరెసా గుర్తొచ్చింది ఈ కథ చదివిన తరువాత.

కథలో రామానుజం తన తండ్రి అపరకర్మలు చేయడాన్ని నిరసించాడు. శుభకార్యాలు, అంతిమ సంస్కారాలు, నిజానికి ఒకే కోవలోకి చెందుతాయి. రెండూ ముఖ్యమైనవే. ఒక వ్యక్తి మరణించినప్పుడు చేసే కర్మలు (అది, హిందూమతమే అవాక్కరలేదు, ప్రతీ సమాజంలోనూ, అన్ని మతాలలోనూ ఉంటాయి ఈ రిచువల్స్) తక్కువనీ, అదే పుట్టినప్పుడు చేసే కర్మలు ఎక్కువనీ అనుకోవడంలో అర్థం లేదు. ఒక వ్యక్తి మరణించిన తరువాత, బ్రతికున్న వ్యక్తులు చేసే ఈ కర్మల వలన కొంచెం ఉపశమనం కలుగుతుంది. పోయిన వారికి ఎవరు ఏమి చేసినా చేయకపోయినా ఒకటే.

అయితే ఈ అపరకర్మలు చేసిన మన ముందు తరానికి చెందిన వారికి, అదే పరదేశంలో పాశ్చ్యాత్య దేశాలలో జరిగితే ఏమైనా తేడా ఉందా అంటే రచయిత కథలో చెప్పించిన విధంగా తేడా ఏమీ లేదని చెప్పిన భావన బాగుంది.

ఎంచుకున్న కథావస్తువు కొత్తదే, ఒక రకంగా. చెప్పిన విధం బాగుంది. సులభ శైలిలో రాసిన కథ. 'నేలకు దిగిన నక్షత్రం' కథా సంపుటిలోనిది ప్రస్తుత కథ. సంపుటిలోని అన్ని కథలూ బాగున్నాయి.

*పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్*



# వినదగునెవ్వరు చెప్పిన..


మే నెల 'కథామంజరి'లో గండ్రకోట సూర్యగారు వ్రాసిన 'దశమ గ్రహం' కథ చాలా బాగుంది. మనిషిలోని మానవతాకోణాన్ని రచయిత చాలా శక్తివంతంగా ఆవిష్కరించారు. భాగవతుల సత్యనారాయణమూర్తిగారు వ్రాసిన 'మానవత్వం ఖరీదు' కూడా ఒక చక్కటి ముగింపుతో అలరించింది. ఎస్.వి.ఎం. నాగగాయత్రి గారు రాసిన 'కిటికీ' కథ ఆద్యంతమూ ఆసక్తికరంగా సాగింది. కథలోని అంశాన్ని రచయిత్రి చాలా ప్రతిభావంతంగా చూపగలిగారు. ఈ నెల కథలలో ఈ కథకు ప్రథమస్థానం ఇవ్వవచ్చు! కూచిమంచి నాగేంద్రగారి 'కుందేలు విందు' బాగుంది. నారంశెట్టి ఉమామహేశ్వరరావుగారి 'బుద్ధి వచ్చిన నక్క' కూడా బాగుంది. ఈ రెండు కథలు మాత్రమే కాలమ్ పద్ధతిలో DTP చేశారు. ఎందుకో తెలియలేదు. చదవడానికి మాత్రం స్వల్పంగా ఇబ్బంది కలిగింది. నవులూరు వెంకటేశ్వరరావుగారి 'ఇల్లు చూసి వెళ్ళవోయ్' లోని విషాదకోణం గుండెను సూటిగా తాకుతుంది. అడవి బాపిరాజుగారి 'గుడ్డిపిల్ల' లోని ఆశావహదృక్పథం జీవితంలో ప్రతివారికీ అవసరం.

**పి. రాజేంద్రప్రసాద్**

"వృద్ధం శరణం గచ్ఛామి" కథ బావుంది. 'తల్లి తండ్రుల ఆస్తులపై పిల్లలకు హక్కున్నట్టు పిల్లల సంపాదనపై తలి తండ్రులకు కూడా హక్కు ఉంటే బావుణ్ణు' అన్న వాక్యం గొప్పగా ఉంది.

**కె. ప్రసాద్**

# కథాపుస్తక పరిచయం




## సింగమనేని నారాయణ కథలు

ప్రముఖులైన రచయితల చిరస్మరణీయమైన కథలను ఏరి, అందంగా తక్కువ ధరకే లభ్యమయేలా, ఈతరం పాఠకుల కోసం ప్రచురించి అందిస్తున్నారు అభ్యుదయ రచయితల సంఘం, గుంటూర్ శాఖవారు. 11 కథలతో అలరించిన ఈ పుస్తకం వెల రు.50/-

ప్రతులు


విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచిలన్నిటిలోనూ లభ్యమవుతాయి.

## వాసిరెడ్డి నారాయణరావు కథలు

ప్రముఖులైన రచయితల చిరస్మరణీయమైన కథలను ఏరి, అందంగా తక్కువ ధరకే లభ్యమయేలా, ఈతరం పాఠకుల కోసం ప్రచురించి అందిస్తున్నారు అభ్యుదయ రచయితల సంఘం, గుంటూర్ శాఖవారు. 11 కథలతో అలరించిన ఈ పుస్తకం వెల రు.70/-.

ప్రతులు

విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచిలన్నిటిలోనూ లభ్యమవుతాయి.




## తాళ్ళూరు నాగేశ్వరరావు కథలు

ప్రముఖులైన రచయితల చిరస్మరణీయమైన కథలను ఏరి, అందంగా తక్కువ ధరకే లభ్యమయేలా, ఈతరం పాఠకుల కోసం ప్రచురించి అందిస్తున్నారు అభ్యుదయ రచయితల సంఘం, గుంటూర్ శాఖవారు. 14 కథలతో అలరించిన ఈ పుస్తకం వెల రు.70/-.

ప్రతులు

విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచిలన్నిటిలోనూ లభ్యమవుతాయి.




## శారద కథలు

ప్రముఖులైన రచయితల చిరస్మరణీయమైన కథలను ఏరి, అందంగా తక్కువ ధరకే లభ్యమయేలా, ఈతరం పాఠకుల కోసం ప్రచురించి అందిస్తున్నారు అభ్యుదయ రచయితల సంఘం, గుంటూర్ శాఖవారు. శారదా నటరాజన్‌గారి 16 కథలతో అలరించిన ఈ పుస్తకం వెల రు.70/-.

ప్రతులు

విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచిలన్నిటిలోనూ లభ్యమవుతాయి.

# స్వర్గకాలం

వి. రాజారామమోహన రావు
✆ 9394738805

***తాతయ్య వచ్చాడు, వెళ్ళిపోయాడు. ఆయన పాత్ర అయిపోయింది. అలా అని మన పాత్ర, జీవితం మనం వదులుకోకూడదు. నీకు ఇప్పుడున్న దిగులు, ఇదివరకు ఎవరికీ రాంది కాదు. దానికి ఉపశమనంగానే జయంతి, వర్ధంతులు, సంవత్సరీకాలు, ఆబ్దికాలు.***

***దురదృష్టం ఏమిటుంటే మనలో వాటికిచ్చే విలువ రోజురోజుకీ తగ్గిపోతోంది. వాటికనే కాదు, మమతానురాగాలకి, వాటి వెల్లడికి మనవాళ్ళతో కలిసి గడపటానికి సమయం లేకుండా చేసుకుంటున్నాం.***

ఆ ఇంటి ఆవరణలోకి ప్రవేశించేటప్పటికి తనలో తను లేదు అపూర్వ. 'తాతయ్య లేని ఇల్లు...' అనుకునేటప్పటికి కడుపులో బాధ లుంగలు చుట్టుకున్నట్లైంది. తల్లి, తండ్రి తన వెనుకే వున్నారు. తనని రిసీవ్ చేసుకోటానికి ఎయిర్‌పోర్ట్‌కి వచ్చారు. ఒంటరితనం కాదు. కానీ పెద్ద ఏకాంత శూన్యంతో దిక్కు తోచనట్టుంది.

ఎయిర్‌పోర్ట్‌లోనే తండ్రిని నిలదీసింది అపూర్వ... "నాకెందుకు వెంటనే చెప్పలేదు? తాతయ్య ఆఖరి చూపు దక్కకుండా చేశారు" అని.

"నీకు పరీక్షలు. పైగా నువ్వొచ్చేవరకూ ఆపే అవకాశం లేకపోయింది" అన్నాడాయన. తండ్రి పోయిన దిగులు ఆయనలో పదిహేను రోజులైనా, ఇంకా అలాగే ఉంది.

అపూర్వ మరీ చిన్నదేం కాదు. లండన్‌లో ఎమ్. ఎస్. పరీక్షలు పూర్తైన రోజే బయలుదేరి వచ్చింది.

అదుటు, అదటుగానే ఇంట్లోకి కాలు పెట్టింది. వెంటనే తాతయ్య గదికి వెళ్ళాలనిపించింది. హాలులో ఆయన ఎప్పుడూ కూచునే సోఫా దాటుకునే ఆయన గదికి వెళ్ళింది.

ఆయన పడుకున్న మంచం. రాసుకున్న టేబుల్. దాని మీద కళ్ళజోడు, రైటింగ్ పేడ్, పెన్... బట్టలు స్టాండ్ మీద తెల్లటి పంచె, లాల్చీ మంచం పక్కన పుస్తకాల బీరువా, స్లిప్పర్స్, వాకింగ్ స్టిక్, పక్కనే స్టూల్ మీద మంచినీళ్ళ సీసా, గ్లాసు... అవన్నీ తను ఎన్నిసార్లు ముట్టుకుందో? ఎన్నిసార్లు ఆయనకి అందించిందో? జ్ఞాపకాల బరువుకి, ఒక్కసారిగా భోరుమంది అపూర్వ. బాగా గట్టిగానే ఏడ్చేసింది. తల్లి, తండ్రి పరిగెత్తుకొచ్చారు.

అపూర్వ ఆ ఏడుపు దరిదాపు గంట. శోషొచ్చినట్టు అయిపోతే బలవంతంగా పాలు తాగించారు. పడుకోబెట్టారు. తాతయ్య మంచం మీదే పడుకుంటానంది.

★★★

మూడు రోజులు గడిచాయి. అపూర్వ ఎక్కువగా తాతగారి గదిలోనే వుంటోంది. ఆయన వాడిన వస్తువులు, ఆప్యాయంగా ఎన్నోసార్లు ఆయన తన తల నిమిరిన అనురాగ జ్ఞాపకాలు. ఆయనతో ఉన్నట్టే భ్రమ... కొంతవరకేనా ఉపశమనంగా ఉన్నట్టున్నాయి.

పుట్టుక ఎంత సహజమో, మరణం అంతేనని తెలుసు. అయినా ఒక్కోసారి తట్టుకోలేని సందర్భాలు ఎదురవుతాయి. అటువంటి స్థితిలో ఉంది అపూర్వ. చిన్న మనసు, తిప్పుకోలేనంత బెంగ. ఎటూ తేలని ఆలోచన. చావు మీద కసిగా, తాతయ్య లేకపోటం మీద ఉక్రోషంగా ఉంది.

తాతయ్య రాడని తెలుసు. ఇంకలేడని తెలుసు. మరి మిగిలినవి జ్ఞాపకాలే! రోజురోజుకి వాటి బలం, బలహీన పడుతోందని తెలుస్తోంది. బలవంతంగా, ప్రయత్నపూర్వకంగా వాటిని వెనక్కి లాక్కొస్తోంది. అది అసహజం అనీ తెలుస్తోంది.



నెల గడిచింది. అపూర్వ కొంచెం... కొంచెం మామాలు జీవితంలో పడింది. ఆ మార్పూ గిల్టీగా ఉంది. 'తాతయ్యని మరపులోకి తోసేస్తున్నానా' అన్న అపరాధ భావన. ఎవరితో చెప్పుకోవాలి? ఏది సరైన దారి?

తను కోలుకున్నంతేనా అపూర్వ కోలుకోలేదని గమనించి, తండ్రి ఒకరోజు అడిగాడు, "ఏమిటమ్మా అలా ఉంటున్నావు?" అని.

వెంటనే ఏం చెప్పలేకపోయింది. ఆలోచనలు, మాటలూ పోగేసుకున్నట్టు కాస్సేపటికి, "ఏమో నాన్నా... ఏమిటో స్పష్టంగాతెలియటంలేదు.చిన్నతనంనుంచి

తాతయ్య నన్నెంత ప్రేమగా చూశాడు! ఎంత గారం, ఎంత ముద్దుచేశాడు. ఎన్ని విషయాలు చెప్పాడు, ఎన్ని నేర్పాడు, ఎన్ని ఎక్స్‌పీరియెన్సెస్. అలాంటి జ్ఞాపకాలన్నీ రోజురోజుకీ నానుంచి దూరంగా జరిగిపోతున్నాయన్న ఫీలింగ్. అంతా చేస్తే జీవితం ఇంతేనా? అన్న ఓరకం దిగులు. చాలా బాధగా ఉంటోంది నాన్నా! అంతటి తాతయ్యని పూర్తిగా మరిచిపోతానేమోనని భయం వేస్తోంది. ఓ మనిషి చచ్చిపోతే అంతేనా? అన్నీ అంతం అయిపోవటమేనా?"

కూతురి మనస్థితి అర్థం చేసుకున్నాడు. "అమ్మా! కాలం చాలా బలమైంది. దానికున్న ఆయుధం మరపించటం. అది అసహజ విషయం కాదు. ఏదీ పూర్తిగా నశించిపోదు. తాతయ్య దూరమవచ్చు. శాశ్వతంగా చెరిగిపోడు. జ్ఞాపకాలు లోపలి పొరల్లోకి వెడతాయి. అది జీవితతత్వం. దానికి దిగులు పడటం సరైంది కాదు."

"నువ్వు చెప్పేది నిజమే కావచ్చు. ఇదంతా సహజ పరిణామమే అయుండొచ్చు. కానీ తట్టుకోటం నావల్ల కావటం లేదు. చచ్చిపోవాలనిపిస్తోంది" అంది. అలా అనగానే అపూర్వ కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి.

కూతురి కన్నీళ్ళు తుడిచాడు. తుడిచి... "తప్పమ్మా అలా అనుకోకూడదు. మనమందరం బతికేస్తున్నాం. బతుకు నడిచిపోతూ ఉంటుంది. కానీ దాని మూలాల్ని సాధారణంగా గుర్తుతెచ్చుకోం! ఈ సృష్టికి, కాలగతికి ఓ ధర్మం ఉంది. అది జీవితాన్ని సాగేలా, కొనసాగేలా చూట్టం! ఆ చక్రాన్ని నడిపే ఓ స్పర్శ, జీవనస్పర్శ ఉంది. రక్తసర్శ అను, పరస్పర ఆత్మీయ సంబంధం అను... అది అదే! తల్లీ తండ్రీ, కొడుకు కూతురు, అన్నా చెల్లి, నేను... నావాళ్ళూ అన్న అనుబంధమే ఈ జీవితాన్ని నడుపుతున్నాయి. వ్యవసాయం చేసినా, వ్యాపారం, ఉద్యోగం, కూలీ కష్టం చేసినా, అన్నీ ఈ స్పర్శ కోసమే! తాతయ్య వచ్చాడు, వెళ్ళిపోయాడు. ఆయన పాత్ర అయిపోయింది. అలా అని మన పాత్ర, జీవితం మనం వదులుకోకూడదు. నీకు ఇప్పుడున్న దిగులు, ఇదివరకు ఎవరికీ రాంది కాదు. దానికి ఉపశమనంగానే జయంతి, వర్ధంతులు, సంవత్సరీకాలు, ఆబ్దికాలు.

దురదృష్టం ఏమిటంటే మనలో వాటికిచ్చే విలువ రోజురోజుకీ తగ్గిపోతోంది. వాటికనే కాదు, మమతానురాగాలకి, వాటి వెల్లడికి మనవాళ్ళతో కలిసి గడపటానికి సమయం లేకుండా చేసుకుంటున్నాం. ఆ విలువని గుర్తుంచుకోకపోతే, గుర్తించకపోతే జీవితం పూర్తిగా నిస్సారమైపోతుంది. నీ మనసులో సారం ఉన్నంత వరకూ తాతయ్య నీతోనే ఉంటాడు. నిజానికి తాతయ్య కొనసాగింపే నువ్వు" అన్నాడాయన.

ఆ మాటల్తో అపూర్వ మనసు తేటపడింది. 'నిజమే... తాతయ్య కొనసాగింపే నేను' అనుకుంది.

నాన్న ఎంతటి నిజం, ఎంత బాగా చెప్పాడు. స్పర్శ – కాలం ఆ స్పర్శ తాలూకు కాలంలోనే మనమందరం భాగం అనుకుంది. జీవితాన్ని నడిపే సూత్రాన్ని అర్థం చేసుకోటం అంత తేలిక్కాదు. అర్థం చేసుకుని ఉపశమనం పొందటమూ తేలిక్కాదు.

# తెరచిన కిటికీ

బి. నర్సన్
✆ 9440128169

> ***"ఎందుకు నాన్నా మనకీ చిక్కులు? మీరు ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు రాసిన కథలతో పడ్డ తిప్పలు చాలవా? అప్పుడు ఆర్ ఎమ్ పేరుతో చాటుగా రాసి ఇప్పుడు రాముగా అవతారమెత్తారా! పక్కాయన అడ్రస్ పట్టుకొని కోర్టుకెళ్తాడట!" అన్నాడు ప్రకాష్ మంచంపై ఓ పక్కన కూచొని.***
>
> ***"నేను అడ్వొకేటునే. నేనే రాశానని చెప్పి వాదిస్తాను" అన్నాడు తల ఎత్తి.***

ఆదివారం రోజు బ్రేక్‌ఫాస్ట్ అయ్యాక వినోద్ తీరిగ్గా డైలీ పేపర్ సండే బుక్ తిరిగేస్తూ కథ దగ్గర ఆగాడు. కథ పేరు 'తొలగిన మబ్బులు'. ఆసక్తిగా ఆయన కళ్ళు కిందికి వెళ్లాయి.

కథ సంభాషణతో మొదలైంది ఇలా...

'మనం అమ్మాయి మాటలు నమ్మి ఊర్లో ఉన్న ఇల్లు అమ్మేసి డబ్బులీయడం తప్పయిపోయింది సుశీలా!' అన్నాడు పడక కుర్చీలో కూర్చుంటూ భీమారావు.

'నేను ఎంత చెప్పినా మీరే వినలేదు. ఉన్న ఒక్క అమ్మాయికి కాకపోతే మన ఆస్తి ఇంకెవరికి అన్నారు కదా!' అంది సుశీల.

'మేము హైదరాబాద్‌లో ఉండగా మీరు అంత దూరాన ఊర్లో ఉండడమెందుకు. ఇక్కడికి వచ్చేస్తే అందరం కలిసి ఉండొచ్చని అంటే భ్రమసిపోయాను, కానీ ఇలా జరుగుతుందని అనుకోలేదు' అన్నాడు భీమారావు తల నిమురుకుంటూ! 'ఇల్లు అమ్మిన డబ్బును వెనుక ముందు చూడకుండా మొత్తం ముప్పై లక్షలు తీసికెళ్ళి, అల్లుడి చేతిలో పోసి, నా అంత గొప్ప మామే లేడన్నట్లు పోజు పెట్టారు. ఆర్నెల్లకే అసలు రంగు బయటపడింది' అంటూ పాత మాటే మళ్లీ అంది.

'కోటి రూపాయల ఫ్లాట్ తక్కువకు దొరుకుతోంది. ఇప్పుడే బుక్ చేసుకుంటే ఇరవై లక్షలు తగ్గిస్తారట! మూడు బెడ్‌రూముల పోర్షన్. ఒకదాన్లో మీరు హాయిగా జీవితం గడపొచ్చు. మాకు యాభై లక్షలు బ్యాంక్ లోన్ దొరుకుతోంది. అయితే అర్జెంటుగా ఇరవై లక్షలు డౌన్ పేమెంట్ చేయాలి... అని అమ్మాయి అనగానే ఇంటి కాగితాలు కుదువబెట్టి డబ్బు సర్దక తప్పలేదు మరి' అని చేతులు నులుముకున్నాడు.

'అంతటితో ఊర్కుంటే ఎలాగోలా ఇల్లు కాపాడుకునేవాళ్ళం కదా!' అంది పెదవి విరుస్తూ.

'ఫ్లాట్ రెడీగా ఉంది కానీ, ఇంటీరియర్ వర్క్ ఆగిపోయింది. అందులోకి పోలేక అనవసరంగా నెలకు పాతికవేలు కిరాయి కట్టవలసి వస్తోంది అని అమ్మాయి నాల్రోజులకోసారి గొణిగే సరికి వింటూ ఉండలేక మరో పది లక్షలు తెచ్చి ఇవ్వక ఏంచేయాలి మరి! ఆరు నెలల్లో మీరు హైదరాబాద్‌కి వచ్చేస్తారు పర్మనెంట్‌గా ఇక్కడే ఉంటారు అన్న అమ్మాయి అంది కానీ, వెళ్ళాక రెణ్ణెల్లయినా గడవక ముందే గడప బయటికి వస్తామని అప్పుడే ఎలా తెలుస్తుంది?' అని విచారంగా భార్య ముఖంలోకి చూశాడు.




'మీకు ఇంత పింఛను వస్తుంది కాబట్టి ఒడ్డెక్కినాం కానీ...' అని కొంగుతో కళ్లు అద్దుకుంది.

... పుస్తకంలో ఈ సంభాషణ చదువుతున్న వినోద్ కొద్దిసేపు ఆగి, కథ ఇలా ఉందేమి అనుకుని మిగతాది గబగబా చదువసాగాడు.

ఇల్లు అమ్మేసి వచ్చిన భీమారావు, సుశీలలను నాలుగు రోజులు బాగానే చూసుకున్న కూతురు శ్రుతి, అల్లుడు వినోద్ ఇంటి పనంతా వారి మీదేసి, 'అది శుభ్రంగా లేదు, ఇది రుచిగా వండలేదు' అంటూ చిరాకుపడడం మొదలెట్టారు. భీమారావుకు జ్వరమొస్తే, 'హాస్పిటల్‌కు ఎందుకు? ఆన్‌లైన్‌లో డాక్టర్లు కావలసినంత మంది దొరుకుతారు!' అని ఓ డాక్టర్‌తో వీడియో కాల్‌లో మాట్లాడించి ట్రీట్‌మెంట్ ఇప్పించారు. డాక్టర్ దగ్గరికి తీసికెళ్తే టెస్టులు చేసి రెండ్రోజుల్లో తగ్గే జ్వరం... ఫోను చికిత్సతో వారంరోజులు వాంతులు, విరేచనాలై భీమారావును సగం చేసింది. భర్త బాధ చూడలేక సుశీల, 'ఇదేం పద్ధతి?' అని కాస్త గట్టిగానే అడగడంతో అల్లుడు విసుక్కోవడం, అమ్మాయి మాట్లాడడం మానేయడం మొదలై, ఆ ముసురు గాలివానై ముసలాళ్ళని రోడ్డు మీదికి తెచ్చింది. తిరిగి తమ ఊరికి వెళ్లేందుకు ముఖం చెల్లక దగ్గర్లోని పట్టణంలో కిరాయి ఇంట్లో కాలం గడుపుతున్నారు.

... చదవడం ఆపి "శ్రుతీ!" అని గట్టిగా పిలిచాడు వినోద్. కిచెన్‌లోంచి హడావుడిగా వచ్చిన శ్రుతి "ఏంటండీ! నాకు చెవులు వినబడనట్లు అంత గట్టిగా పిలిచారు" అంది.

"ఈ పత్రికలో కథ చదువు. అచ్చం మన కథలాగే ఉంది. మీ నాన్నే మారుపేరుతో ఈ కథ రాసుంటాడు" అన్నాడు ఊగిపోతూ.

"మా నాన్న కథ రాస్తే పత్రికవాళ్ళు వేసుకుంటారా!" అని కథలోకి వెళ్ళింది. సగందాకా చదివిన శ్రుతి "ఈ రోజుల్లో పిల్లల చేతుల్లో మోసపోతున్న తల్లిదండ్రుల గురించి ఎన్నో కథలు వస్తున్నాయి. అందులో ఇదోటి! అంతే... మీరేదో అనవసరంగా ఊహించుకొని బీపీ పెంచుకుంటున్నారు!" అంటూ చదివింది చాలన్నట్లు పుస్తకం పక్కన పెట్టింది.

"భీమారావు, సుశీల మీ అమ్మానాన్నల పేర్లే కదా... వినోద్, శ్రుతి మన పేర్లే కదా... అదంతా మన ఇంట్లో జరిగిందే కదా! పోయేది పోకుండా మీ అమ్మానాన్నలు మన పరువు తీయాలనుకున్నారు!" అన్నాడు కోపంగా! పత్రికను మళ్ళీ తిరిగేసిన శ్రుతి "ఔను కదా... కథలో మన పేర్లు ఉన్నాయేంటి?" అంటూ కథ పూర్తిగా చదివింది. అక్షరాలా నిజం అక్షరాల్లో కనబడుతోంది. అమ్మానాన్నలు కథ రాసే అవకాశమే లేదు. 'కల్పనలో ఇంత వాస్తవం కూడా ఉంటుందా?' అనుకుంటూ పుస్తకంలో పేజీలు తిప్పి రచయిత పేరు చూసింది. రాము అని ఉంది.

"మనకు ఈ రాము ఎవరో తెలిస్తే, ఇది ఎవరి కథ అని, ఇదంతా తనకెలా తెలుసనీ అడగొచ్చు!" అంది వినోద్‌తో. "కథ రాసిన వారి ఫోటో, ఫోన్ నెంబర్ ఇస్తూ ఉంటారు కదా!"

"కొన్ని పత్రికలు ఇస్తుంటాయి కానీ ఇందులో పేరు తప్ప ఏమీలేదు" ఈ రచయిత ఎవరై ఉంటారు? అనే పరిపరివిధాల ఆలోచనలతోనే వారి ఆదివారం గడిచింది.

మర్నాడు డ్యూటీకి వెళ్లి వస్తూ వినోద్ ఆ పత్రిక ఆఫీసుకు వెళ్ళాడు. "సండే స్టోరీ సెక్షన్ వారిని కలవాలి" అన్నాడు. వినోద్ చెప్పింది విని రిసెప్షనిస్టు ఆయనతో ఇంటర్‌కమ్‌లో సెక్షన్ వారితో మాట్లాడించింది. కొద్దిసేపటికి ఒకాయన కథ టైప్ చేసి ఉన్న కాగితాలను తెచ్చి వినోద్‌కు చూయించాడు.

"రచయిత ఫోన్ నెంబర్ కానీ, అడ్రస్ కానీ కావాలి!" అన్నాడు కాగితాలు తిరగేస్తూ.

"ఫోన్ నంబర్ ఇవ్వలేదు కానీ, అడ్రస్ రాయాలి కాబట్టి చివరన రాశాడు!" అంటూ వేలు పెట్టి చూయించాడు.

అడ్రస్ చూడగానే వినోద్ 'ఇది నిజమా?' అని నమ్మనట్లు మళ్ళీ మళ్ళీ చూశాడు. అందులో ఉన్నది తమ పక్క ఫ్లాట్ అడ్రసే. ఆ అడ్రస్‌ను ఫోన్లో ఫొటో తీసుకుని థాంక్స్ చెప్పి బయటికొచ్చాడు.

తన ఇంటికి వెళ్లకుండా ముందుగా అడ్రస్‌లో ఉన్న పక్క ఫ్లాట్ కాలింగ్‌బెల్ కొట్టాడు. తలుపు తీసిన ప్రకాష్ "మీరు పక్క ఫ్లాట్ వారు కదా... లోపలికి రండి!" అన్నాడు వినోద్‌ను చూడగానే.

"లోపలికి వచ్చే మాట తర్వాత కానీ ముందు రామును పిలవండి!"

"మా ఇంట్లో రాము అనేవారు ఎవరు లేరు. నా పేరు ప్రకాష్. మా నాన్న పేరు ముకుందం!"

వినోద్ తాను ఫోన్లో తీసిన చిరునామా ఫొటో చూయించి "మీ అడ్రస్ నుండే పత్రికకు ఈ కథ వెళ్ళింది" అంటూ లంచ్ బ్యాగ్ లోంచి పత్రికను తీసి కథను చూయించాడు.

"ఆ కథను నేను కూడా నిన్న చదివాను. బాగుంది. దీంతో మీకేమి ప్రాబ్లమ్?" అన్నాడు ప్రకాష్. "కథ ఎలా ఉంది అని అడగడానికి రాలేదు. కథ ఈ అడ్రస్ నుండే వెళ్ళింది కాబట్టి రాము అనే ఆయన మీ ఇంట్లో ఉండాలి. కథలో మా పేర్లు వాడినందుకు ఆయనపై స్టేషన్లో పిటీషన్ ఇచ్చి, లీగల్ నోటీస్ ఇప్పిస్తాం!" అన్నాడు తీక్షణంగా చూస్తూ.

"ఇచ్చుకోండి! ఆ పేర్లు మీ ఒక్కరికే ఉంటాయా? ఎవరో మా అడ్రస్ వాడినంత మాత్రాన మేము దొంగలమై పోతామా?" అన్నాడు ప్రకాష్ విసుగ్గా.

"అదేదో కోర్టులో చెప్పుకోండి!" అంటూ సరసరా వెళ్ళిపోయాడు వినోద్.

తలుపేసి సోఫాలో కూచున్న ప్రకాష్ తల వెనక్కి వాల్చి నిన్న చదివిన కథంతా ఓసారి మననం చేసుకున్నాడు. 'పేర్లకే ఇంత ఎగురుతారా ఎవరైనా? కథ కూడా వీరిదే అయి ఉండొచ్చు. నాన్న కూడా ఈ కథ చదివాడు. సండే బుక్ కనబట్టం లేదంటే తన లా బుక్స్ మధ్యలోంచి తీసిచ్చాడు' అని తట్టగానే ప్రకాష్ లేచి తండ్రి గదిలోకి వెళ్ళాడు.

ముకుందం మంచం పైన ముసుగు తన్ని ముడుచుకు పడుకున్నాడు. పక్కన చదువుతున్న పుస్తకం బోర్లేసి ఉంది.

"నాన్నా! పడుకున్నారా?" అన్నాడు ప్రకాష్ మెల్లగా.

ముసుగు తీయకుండానే "ఊ..." అన్నాడు.

"ఒకసారి మీ పూర్తిపేరు చెప్తారా!"

"రాచకొండ ముకుందం"

"రాము అనేది మీ పొట్టి పేరా? ముందు ఆ ముసుగు తీయండి!" అన్నాడు కోపంగా ప్రకాష్.

ముసుగు తీసి బెడ్ మధ్యలో తల దించుకొని కూచున్నాడు.

"ఎందుకు నాన్నా మనకీ చిక్కులు? మీరు ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు రాసిన కథలతో పడ్డ తిప్పలు చాలవా? అప్పుడు ఆర్ ఎమ్ పేరుతో చాటుగా రాసి ఇప్పుడు రాముగా అవతారమెత్తారా! పక్కాయన అడ్రస్ పట్టుకొని కోర్టుకెళ్తాడట!" అన్నాడు ప్రకాష్ మంచంపై ఓ పక్కన కూచొని.

"నేను అడ్వొకేటునే. నేనే రాశానని చెప్పి వాదిస్తాను!" అన్నాడు తల ఎత్తి.

ప్రకాష్ భార్య భారతి కూడా ఆ కథ చదివింది. వినోద్ వచ్చిన విషయాన్నీ గమనించింది. తండ్రి కొడుకుల వాదన వినగానే అటువైపు వచ్చింది.

ఆమెను చూసిన ప్రకాష్ "చూశావా భారతీ! నిన్న కథ చదివి లోకంలో జరుగుతున్నదే రాశారు అని మనం అనుకున్నామా? ఆ కథ రచయిత మనింట్లోనే ఉన్నాడు!" అన్నాడు తండ్రి వైపు చేయి చూపిస్తూ.

కోడలి మొహం చూడలేక ఎత్తిన తల మళ్ళీ దించుకున్నాడు ముకుందం ఉరఫ్ రాము.

“మామగారి బాత్‌రూమ్‌లోకి పక్కింటి ముచ్చట్లన్నీ వినిపిస్తాయి. ఆ ముసలాళ్ళ బెడ్‌రూమ్ కిటికీ వీరి బాత్‌రూమ్ వెంటిలేటర్‌కు ఎదురుగా ఉంటుంది. వాళ్లు కిటికీ తెరిస్తే అక్కడి మాటలన్నీ ఫుల్ వాల్యూమ్‌లో వినొచ్చు. అలా కిటికీ చెప్పిన కథను మామగారు లోకానికి చెప్పారన్నమాట!” అంది భారతి.

“ఎల్బీ నగర్‌లో పక్కింటి గొడవలో తలదూర్చి ఇతగాడు తెచ్చిన చిక్కులకే కొండాపూర్‌కు వచ్చాం. కోర్టు నోటీసు రాకముందే ఇంకో వైపు ఇల్లు మారక తప్పదు భారతీ!” అంటూ హాల్లోకి వెళ్ళాడు ప్రకాష్.

# వేటు

**ఘండికోట విశ్వనాథం**
✆ 8464935739

***'కార్ఖానా మూతపడబోతుం'దనే వార్త బయటకు రావడంతో కార్ఖానా ముఖ్యద్వారానికి దగ్గరలో ఒక గుడారం వెలిసింది. కార్ఖాన మూసివేసే ప్రస్తావనకి వ్యతిరేకంగా అన్ని కార్మిక సంఘాలు కలిసి 'ఉమ్మడి కార్యాచరణ సమితి'గా ఏర్పడి మూకుమ్మడి నిరహారదీక్షలకి పూనుకున్నాయి. వీ.ఆర్.ఎస్.కి దరఖాస్తులు జమ చేయవద్దని, ఈ స్కీము ఎలాగైనా వెనుకకు తీసుకోవడానికి, కార్ఖానా నడిచేలా చేయడానికి తాము ఢిల్లీలోని రాజకీయ నాయకులను కలిసి వత్తిడి తెస్తామని అధికార పార్టీకి చెందిన కార్మిక సంఘం ప్రకటించింది.***

'ఆఫీసర్స్ క్లబ్' ముందు కారాగింది.

కారు వెనకసీటు అద్దం దించాను. చల్లటిగాలి చెంపలని తాకింది. పుష్యమాసపు తొలిరోజుల్లో ఆ ప్రాంతాల్లో చలి ఎక్కువగానే వుంటుంది. ఉదయం పదిగంటలయినా ఎండలో వెచ్చదనం లేదు. చెవుల మీదికి టోపీ లాక్కున్నాను.

క్లబ్బు వరండాలో అమలేందు నిల్చున్నాడు. రైల్వేస్టేషనులో బండి దిగిన వెంటనే అమలేందుకి ఫోను చేసేను. స్టేషనుకి కారు పంపేడు.

'అమలేందు' అని పిలవబడే అమలేందు కిశోర్ చౌధురి నాకు సహాయ అధికారిగా ఉండేవాడు. ప్రాంతాలు వేరైనా, మామధ్య స్నేహం నెలకొంది. ఛార్జిమేన్‌గా ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా అధికారి హోదా పొందేడు అమలేందు. నేను పదవీవిరమణ చేసిన తర్వాత కూడా మా స్నేహానికి భంగం కలగలేదు. వారానికొకసారైనా అతను ఫోను చేస్తాడు. ప్రస్తుతం కుటుంబాన్ని కలకత్తాలో వుంచి తను 'ఆఫీసర్స్ క్లబ్'లో మేనేజరుగా పనిచేస్తున్నాడు.

“రావ్ దాదా! నమస్కార్” అంటూ దిగమన్నట్లు కారు తలుపు తెరిచి పట్టుకున్నాడు అమలేందు.

“నువ్వూ లోపలికిరా. అలా కార్ఖానా వేపు తిరిగి వద్దాం” అంటూ నాపక్కకు రమ్మని సైగ చేసేను.

సంభాషణ హిందీలో జరుగుతోంది. అమలేందు డ్రైవరుకి సూచనలిచ్చి నా పక్కన కూచున్నాడు.

కారు నెమ్మదిగా కదిలింది. కంపెనీవారి రెసిడెన్షియల్ కాలనీ దాటి కార్ఖానా మెయిన్‌గేటు చేరుకోడానికి రమారమి అరగంట పట్టింది. కాలనీలోని ఇళ్ళన్నీ ఖాళీగా వున్నాయి. ఇళ్ళముందు తుప్పలు బాగా పెరిగిపోయాయి. రోడ్లన్నీ




గుంటలుపడి వున్నాయి. కాలనీలోని బజారులు, పార్కులు అన్నీ మూసివేయబడి వున్నాయి. మెయిన్ రోడ్డు నుండి కార్ఖానాను కలిపే రోడ్డుకిరువైపులా దుకాణాలుండేవి. వాటిలో చాలా మూతబడిపోయాయి.

అమలేందు కారుదిగి సెక్యూరిటీ అఫీసులోకి వెళ్ళి మాట్లాడి వచ్చేడు.

పదవీవిరమణ తర్వాత నేను పనిచేసిన కార్ఖానాలో మళ్ళా కాలుపెడతానని అనుకోలేదు!

కార్ఖానాలోపల అంతా నిర్మానుష్యంగా వుంది. విశాలమైన 'షాపు'ల మధ్య ఖాళీ జాగాలలో పెరిగిన తుప్పలు, పొదలు ఎండిపోయి వున్నాయి.

కారు 'మెషిన్ ఎండ్ అసెంబ్లీ' షాపు ముందు ఆగింది.

"దాదా జాగ్రత్త. పాములు విచ్చలవిడిగా తిరుగుతూంటాయి."

పక్కనే పడివున్న కర్ర చేత్తో పట్టుకుని 'షాపు'లో ప్రవేశించాం. నేను ఆ కార్ఖానాలో చేరిన మొదటిరోజు గుర్తుకు వచ్చింది. యంత్రాల చప్పుళ్ళతో, కార్మికుల కోలాహలంతో, కార్ఖానా ఎంత సందడిగా వుండేది! కార్ఖానా, పరిసరాలు చూస్తూంటే ఒకప్పుడు వైభవంతో వెలిగి, శిథిలమైన రాజుల కోటలు, భవంతులు గుర్తుకు వచ్చేయి. వందేళ్ళకి పైగా చరిత్ర వున్న కార్ఖానా నిర్జనారణ్యంలా మారుతుందని ఎప్పుడూ అనుకోలేదు. కార్ఖానా అంతా తిరిగి భారమైన మనసులతో తిరిగి క్లబ్బు చేరుకున్నాం.

నన్ను క్లబ్బు 'లౌంజ్'లో కూర్చోబెట్టి బేరరుకి ఏదో చెప్పి, మధ్యాహ్నభోజనం ఏర్పాటు చేయడానికి వెళ్ళేడు అమలేందు. లౌంజులో నేను, బేరరు తప్ప ఎవరూ లేరు. కొంచెం సేపటికి బేరరు ఒక ప్లేటులో స్నాక్సు, గాజుగ్లాసులో నిమ్మసోడా ఎదురుగా టీపాయ్ మీద ఉంచేడు.

ఏణ్ణర్ధం క్రితం జరిగిన సంఘటనలు నా అలోచనల్ని చుట్టుముట్టాయి.

★★★

క్లబ్బు ఆడిటోరియంలో పాత హిందీ సినిమా చూస్తున్నాను. నా వెనుక ఎవరో నిలుచుని లోగొంతుకలో విషయం చెప్పేరు. 'ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు గారి ఆఫీసునుండి ఫోను వచ్చింది. అత్యవసర సమావేశం. వెంటనే కాన్ఫరెన్సు హాలుకు రమ్మని ఆదేశం!'

టైము చూసుకున్నాను. రేడియం డయల్ పదిగంటలు చూపిస్తోంది. భోజనం చేసి సావకాశంగా రాత్రి ఆట సినిమా చూద్దామని క్లబ్బుకి వచ్చేను. సినిమా చూడడానికి కూడా ఆటంకాలే!

విభాగాధ్యక్షులు, వరిష్ఠ అధికారులతో హాలు క్రిక్కిరిసి ఉంది. 'మెషిన్ ఎండ్ అసెంబ్లీ' షాపు విభాగాధ్యక్షునిగా నాకు పిలుపు వచ్చింది. అందరూ బిగ్గరగా మాట్లాడుకుంటున్నారు. చేపల మార్కెట్టులా తయారయింది హాలు.

ఈ.డీ. గారు హాలులోకి ప్రవేశించిన వెంటనే హాలులో నిశ్శబ్దం నెలకొంది.

"ఫ్రెండ్స్! ఇంత రాత్రివేళ ఈ అత్యవసర సమావేశానికి పిల్చి మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం నాకూ నచ్చడంలేదు. కానీ...' ఆగారు ఈ.డీ. గారు.

"ముఖ్యమైన కారణం లేకపోతే మీరు ఎమర్జెన్సీ మీటింగు పెట్టరు కదా సార్!" మాలో వరిష్ఠ అధికారి సక్సేనా అన్నారు.

"నిజమే! మన సంస్థ మనుగడకి సంబంధించిన విషయం! సరే, విషయానికొద్దాం. ఒక గంటక్రితమే హెడ్డాఫీసు నుండి ఫోను వచ్చింది. మన కార్ఖానా మూసేయాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చాయి. ఈరోజు మార్చి పదిహేను. ఏప్రియలు ముప్పయ్యవ తేదీ ఆఖరు పనిదినం. అంటే మనకు రమారమి ఆరువారాల సమయం మాత్రమే వుంది. ఈ విషయమై, వివరంగా నోటిఫికేషను ఈ రాత్రే ఫాక్స్‌లో వచ్చింది!"

అందరిలోనూ ఉత్సుకత పొడసూపింది. ఎవరి ముఖాల్లోనూ కత్తివాటుకి నెత్తురుచుక్క లేదు.

'ఈ కార్ఖానాలో పనిచేసే వారందరికీ స్వేచ్ఛాయుత పదవీవిరమణ పథకం... వీ.ఆర్.ఎస్.ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ పథకంలో ఆఫీసర్ క్యాడర్ ఉద్యోగులను మినహాయించేరు. నయాన్నో, భయాన్నో మిగతా వారందరూ, ఈ పథకం స్వీకరించేలా చూడాలని ఆదేశం...'

ఇంతలో వరిష్ఠ అధికారి దిలీప్ ఛటర్జీ కలుగజేసుకున్నాడు.

"సార్! ఇంత హఠాత్తుగా కార్ఖానా మూసివేస్తే ఎలా? ముందస్తుగా కార్మిక సంఘాలకి నచ్చచెప్పి, ఈ చర్యకి పూనుకోవడం సబబుకాదా!"

"చూడండి మిస్టర్ ఛటర్జీ, కార్మిక సంఘాల విషయం కేంద్ర ప్రభుత్వం చూసుకుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడ ఈ పథకానికి వత్తాసు పలికింది. వీ.ఆర్.ఎస్. వివరాలకి సంబంధించిన ప్రకటన మొదలైనవి పర్సనల్ హెడ్ శ్రీవాస్తవగారికి ఇంత క్రితమే అందజేయడం జరిగింది. ప్రతి విభాగానికీ కావలసిన కాపీలు తయారవుతున్నాయి. రేపు పొద్దుటే మీ ఆఫీసులకి అందజేయబడతాయి. ఎనీ క్వశ్చెన్స్?"

"సార్! ఒకవైపు స్వేచ్ఛాయుత పదవీ విరమణ అంటున్నారు. మరొక పక్క శ్రామికులు, అధికారేతర సిబ్బంది ఈ స్కీము స్వీకరించాలని అంటున్నారు. ఈ రెండూ పరస్పర విరుద్ధాలైన విషయాలు కావా?" ఉండబట్టలేక నేనడిగేను.

"మీరు చెప్పింది నిజమే రావ్‌జీ! కాని మన యూనిట్ గత కొన్ని సంవత్సరాలుగా నష్టాల్లోనే నడుస్తోంది.. ఎన్నాళ్ళని మనల్ని పోషించగలదు ప్రభుత్వం?"

"సార్! ప్రభుత్వరంగంలోని సంస్థ నష్టాలలో కూరుకుపోతున్నదంటే... ఇందులో ప్రభుత్వ ప్రమేయం లేదంటారా! యాజమాన్యం అసమర్థతకి ఉద్యోగులను బలిచేయడం ఎంతవరకు సబవు?" అన్నాడు ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజీవ్ వర్మ.

"చూడండి వర్మా! ఇవన్నీ చెప్పి లాభం లేదు. ప్రభుత్వ నిర్ణయాన్ని కాదనే శక్తి మనకు లేదు. అందుచేత ఈ విషయాలు అనవసరంగా చర్చించుకుంటూ కాలాతీతం చేసుకోవడంలో అర్థం లేదు. ఏనీవే, మనం ఎలాంటి విషమపరిస్థితులెదురైనా సంయమనం పాటించి, మన లక్ష్యసాధనకు కృషి చేయాలి. ఇప్పటికే చాలా రాత్రయింది. సమావేశం ముగిద్దామా మరి..." అంటూ చర్చలకు తావీయకుండా కుర్చీలోంచి లేచారు ఈ.డీ. గారు.

అందరిలోనూ ఎన్నో సందేహాలు! ఎన్నో భయాలు! అందరమూ కలతచెందిన మనసులతో, అలిసిపోయిన శరీరాలతో ఇళ్లకు చేరేసరికి అర్ధరాత్రి దాటింది...

★★★

"దాదా! ఏమిటి అంత దీర్ఘాలోచనలో పడ్డారు. పదండి భోజనం చేద్దాం..."

అమలేందు రాకతో ఆలోచనలకు అంతరాయం కలిగింది.

"దాదా! కార్ఖానా మూసివేయడానికి వారం రోజుల ముందు మీ చాంబరులో జరిగినవి... గుర్తున్నాయా?"

"గుర్తుకొచ్చింది...ఆరోజు వీ.ఆర్.ఎస్. తీసుకొమ్మని అందరికీ ఎలా నచ్చచెప్పాలో, ముందుకు సాగాలో చర్చించుకోడానికి విభాగానికి సంబంధించిన అధికారులందరమూ నా ఆఫీసుగదిలో సమావేశమయ్యాం. ఇంతలో బయట గలాటా అవుతున్నట్లు పెద్ద పెద్దగా కేకలు వినిపించాయి. మా విభాగం కార్మికులు, తదితర సిబ్బంది ఒక్కపెట్టున ఛాంబరులోకి రావడానికి ప్రయత్నిస్తుంటే సెక్యూరిటీ గార్డు అడ్డుకున్నాడు. నేను బయటకు వచ్చి, వాళ్ళని లోపలికి రానిమ్మని చెప్పేను. ఒక్కసారి కట్టలు తెంచుకున్న ప్రవాహంలా అంతా లోనికి వచ్చారు. వాళ్ళ ముఖాల్లో విచారం, నిరాశ, నిస్పృహ... యాజమాన్యాన్ని దూషించినవాళ్ళు, రాజకీయ నాయకులను దూషించినవాళ్ళు, కార్మిక నాయకులను దూషించిన వాళ్ళు.. ఇలా ఆఫీసులోకి దూసుకు వచ్చిన వాళ్ళంతా ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నారు.

వాళ్ళు వేసే ప్రశ్నలకి నాదగ్గర జవాబు లేదు. వాళ్ళందరితోనూ ఇంచుమించు పాతికేళ్లు పనిచేసిన నాకు, వాళ్ళ ఇబ్బందులు, బలహీనతలు, సామర్థ్యాలు తెలుసు. అయినా 'నేనున్నాను, ఈ పథకం అవసరం లేదనుకునే వారికి అండగా నిలుస్తా'నని చెప్పలేకపోయాను. చెప్పినా, నమ్మే స్థితిలో ఎవరూ లేరు. అలా చాలాసేపు కార్మికులు, ఆఫీసు సిబ్బంది తమ కష్టాలు చెప్పుకొని, కోపాలు ప్రదర్శించి ఏమీ చేయలేక నిష్క్రమించారు.

అప్రయత్నంగా నా కళ్ళల్లో నీటిపొర కమ్మింది.

"సారీ దాదా! జరిగిన విషయాలు మీ జ్ఞప్తికి తెచ్చి మనసు బాధపెట్టాను."

"లేదు అమలేందూ! ఆరోజు వాళ్ళంతా చెప్పినదాంట్లో తప్పేమీ లేదు. కార్మికులలో అధికశాతం కష్టించి పనిచేసేవాళ్ళే! కాని ఒక సంస్థను విజయవంతంగా నడపడానికి సమర్థతగల యాజమాన్యం, వనరులు సమకూర్చే ప్రభుత్వ యంత్రాంగం ఎంతైనా అవసరం. ప్రభుత్వ ఆధీనంలోని పారిశ్రామిక సంస్థలు రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చినప్పుడు వాటికి మన కార్ఖానాకి పట్టిన గతే పడుతుంది!"

"దాదా! మీరు చెప్పింది నిజమే! కార్మికులను దూషించి ఏమి లాభం?"

"లేకపోతే, మనకి స్వాతంత్ర్యం రాక పూర్వం నెలకొల్పిన ఈ సంస్థ సజావుగా నడవడానికి... స్వాతంత్రం వచ్చాక, జాతీయీకరణ చేసిన తర్వాత కూడా ప్రభుత్వంవారి అశ్రద్ధ కారణంగా, ఆధునికీకరణకి కావలసిన చర్యలు తీసుకోబడలేదు. కేంద్రంలోను, రాష్ట్రంలోనూ ప్రభుత్వాలు మారేయి. పరిపాలనా పద్ధతులు మారేయి. నష్టాలతో సాగే ప్రభుత్వ సంస్థలని నడపడం ప్రభుత్వానికి సమ్మతం కాలేదు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఏమైనా ఉందా?"

మా మనసులు కలతబారినవి. మరి భోజనం సహించలేదు.

క్లబ్బులోనే విశ్రాంతి తీసుకోడానికి వీలుగా అన్ని ఏర్పాటులతో ఒక గది ఉంది. భోజనం చేసిన తర్వాత నేను, అమలేందు ఆ గదిలోకి వచ్చాం. నేను మంచం మీద వాలాను. అలసటకి నిద్ర పట్టేసింది.

"దాదా! సాయంకాలం అయిదు గంటలు కావస్తోంది. కొంచెం ఫ్రెషప్ అవండి. టీ తాగుదాం" అంటూ అమలేందు నన్ను లేపేడు.

నేను కలకత్తా వెళ్ళవలసిన రైలు సాయంకాలం ఏడు గంటలకి వస్తుంది. రైలు రావడానికి అరగంట ముందుగానే స్టేషను చేరుకున్నాము. స్టేషనులోని ఒక సిమెంటు బెంచీ మీద ఇద్దరం కూర్చున్నాము. అమలేందు ఎన్నో విషయాలు చెబుతున్నాడు.

"దాదా, మీకు గుర్తుందా? మన ఊరికి ఐదు కిలోమీటర్ల దూరంలో మూతపడిన పారిశ్రామిక వాడ నుండి కొంతమంది పాత ఉద్యోగులు ఏదైనా సహాయం చేయమని ప్రతినెలా మొదటివారంలో మన కాలనీకి వచ్చేవారు. మన సంస్థ ఉద్యోగులకీ అదేగతి పడుతుందని నాకు భయంగా ఉంది!"

అవును, గుర్తులేకేం! పాపం ఆ ఉద్యోగులు బలవంతపు పదవీవిరమణ పథకంలో ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. పదవీవిరమణ సమయంలో వచ్చిన డబ్బులన్నీ తొందరలోనే హరించుకుపోగా రోడ్డున పడ్డారు. కొన్నివేల కుటుంబాలు నాశనమయ్యాయి!

రైలు కదిలేవరకు ఎన్నో విషయాలు మాట్లాడుకున్నా ఏదో తీరని వెలితి... నాకు వీడ్కోలు చెబుతున్నప్పుడు అతను కళ్ళు తుడుచుకోడం నా దృష్టిని దాటిపోలేదు.

రైలు ఎక్కి రెండవ తరగతి ఏ.సి.లో నా బెర్తు మీద కూర్చున్నాను. ట్రెయిను ఖాళీగా ఉంది. నా మనస్సు అనేక ఆలోచనలతో నిండివుంది. చదవడానికి పుస్తకం తీసుకున్నాను గాని, కార్ఖానా చివరి రోజుల జ్ఞాపకాలు ముసురుకుంటున్నాయి.

★★★

‘కార్ఖానా మూతపడబోతుం’దనే వార్త బయటకు రావడంతో కార్ఖానా ముఖ్యద్వారానికి దగ్గరలో ఒక గుడారం వెలిసింది. కార్ఖాన మూసివేసే ప్రస్తావనకి వ్యతిరేకంగా అన్ని కార్మిక సంఘాలు కలిసి ‘ఉమ్మడి కార్యాచరణ సమితి’గా ఏర్పడి మూకుమ్మడి నిరహారదీక్షలకి పూనుకున్నాయి. వీ.ఆర్.ఎస్.కి దరఖాస్తులు జమ చేయవద్దని, ఈ స్కీము ఎలాగైనా వెనుకకు తీసుకోవడానికి, కార్ఖానా నడిచేలా చేయడానికి తాము ఢిల్లీలోని రాజకీయ నాయకులను కలిసి ఒత్తిడి తెస్తామని అధికార పార్టీకి చెందిన కార్మిక సంఘం ప్రకటించింది.

రోజులు గడుస్తున్నాయి. కార్మికుల ఉద్యమం ఊపందుకొంది. స్థానిక రాజకీయ నాయకులతోబాటు ఢిల్లీలోని నాయకులు కూడా అక్కడికి వచ్చి, తమ ఉపన్యాసాలలో కార్ఖానా మూయడం అసంభవమనీ, కార్మికుల లక్ష్యసాధనకై దేశవ్యాప్తంగా, నిరసనలు, సమ్మెలు చేపడతామనీ అందరినీ నమ్మబుచ్చారు.

ఇలాంటి అనిశ్చిత పరిస్థితులలో ఇంచుమించుగా పనులన్నీ ఆగిపోయాయి. కార్మికుల దగ్గరకి వెళ్ళి, పనులు మానవద్దని చెప్పే ధైర్యం ఏ అధికార్లకీ లేకపోయింది.

దాదాపు మూడువేలకు పైగా కార్మికులు, అధికారేతర సిబ్బంది, మా అధికార్ల ప్రోద్బలం వలన ఏమీ చేసేదిలేక, స్కీము తీసుకోకపోతే ఈ పాటి డబ్బులు కూడా రావని సందేహించి, మీమాంసలో పడ్డారు.

పరిస్థితులు యాజమాన్యం అనుకున్నట్లు సానుకూలపడటం లేదని కేంద్ర ప్రభుత్వం నుండి ఒత్తిడి హెచ్చయింది. ఆ ఒత్తిడి అధికార్ల మీద పడింది. సిబ్బందినందరికీ నచ్చచెప్పి మా దారిలోకి తీసుకురావడమెలా అని రోజూ ఈ.డీ. గారి ఆఫీసులో చర్చలు!

ఎలాగైనా ఈ పథకం విఫలమవ్వాలనీ, కార్ఖానా యథాతథంగా నడవాలనీ ఎంతోమంది దేవాలయాల్లో పూజలు కూడా జరిపించేరు. చాలామంది అధికార్లు కూడా మనసులో అదే కోరుకున్నారు. ప్రజాశక్తికి తలవంచకుండా ప్రభుత్వం ఉండగలదా? ఏమో! దేశ రాజకీయ పరిస్థితులు కొద్దిరోజుల్లోనే మారిపోవచ్చు.

వీ.ఆర్.ఎస్. గడువు తీరడానికి ఇంక మూడురోజులే సమయముంది. అప్పటికి పది దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఆరోజు సాయంకాలం కార్యాచరణ సమితి కార్ఖానా గేటు ముందు పెద్ద సభ ఏర్పాటు చేసింది. అందరూ ఉత్సాహంగా ఉన్నారు. ఆ రోజు ప్రొద్దున్నే ఢిల్లీ వెళ్లిన కార్మిక నాయకులు తిరిగి వచ్చేరు. అందుకే ఈ సభ.

సాయంకాలం నాలుగుగంటల నుండీ జనం రావడం మొదలెట్టారు. ఐదుగంటలకి సభ ప్రారంభమయింది. దాదాపు పాతికవేలమందికి పైగా జనం గుమికూడేరు. లౌడ్‌స్పీకర్ల ఘోష ఆఫీసులో కూర్చున్న అందరికీ వినిపిస్తున్నది. అందరూ చెవులు రిక్కించుకొని వింటున్నారు.

ముందుగా ‘ఇంక్విలాబ్ జిందాబాద్’ అంటూ నినాదాలు వినిపించాయి. తర్వాత చిరు కార్మికనాయకులు మాట్లాడడం మొదలెట్టారు. ఢిల్లీలో కార్మిక నాయకులు ఎవరెవరినీ కలిసిందీ, కార్ఖానా మూయవద్దని ఎలా ఏకరువు పెట్టినదీ వివరించారు. అంతా బాగానే ఉందని అనుకుంటున్నారు.

అప్పుడు కేంద్రంలోనున్న అధికార పార్టీకి చెందిన కార్మిక నాయకుడు మైకు ముందుకు వచ్చాడు.

'కార్మిక సోదరులారా! మా దగ్గర ఉన్న వనరులన్నీ ఉపయోగించాం. ప్రభుత్వంలో ఉన్న వరిష్ఠ నాయకులను కలిసేము. కేంద్ర కార్మిక మంత్రికి 'మన కార్ఖానా మూసివేయవద్ద'ని మనం అందరం సంతకాలు పెట్టిన అర్జీని సమర్పించేం. ఆయన తప్పకుండా ప్రధాన మంత్రిగారితో మాట్లాడుతానన్నారు. అందుకే ఇన్ని రోజులు ఢిల్లీలో ఆగవలసి వచ్చింది...'

అందరిలోనూ ఉత్కంఠత పెరుగుతున్నది.

'కాని మేము చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ప్రభుత్వం మా మాట వినలేదు. వీ.ఆర్.ఎస్. పథకం స్వీకరించడం తప్ప మనకి వేరే మార్గం లేదు...'

కార్మిక నాయకుడి మాటలు మరిక వినిపించలేదు.

'కేంద్ర ప్రభుత్వం డౌన్! డౌన్! కార్మిక నాయకులూ ముర్దాబాద్..'

ఒక్కపెట్టున సభలో ఉన్న జనమంతా ఘోషిస్తూ, వేదికని చుట్టుముట్టేరు. అంతా గోలగోలగా తయారయింది.

మర్నాటి నుంచి ఉప్పెనలా వీ.ఆర్.ఎస్. దరఖాస్తులు వచ్చిపడ్డాయి.

దరఖాస్తులు ఏవేళలో ఇచ్చినా తీసుకోవాలని మాకు ఆదేశాలు వచ్చేయి. ఆ రెండు రోజులూ ఇంచుమించు అందరం రోజుకి పన్నెండు గంటలకి పైగా పనిచేయవలసి వచ్చింది.

నా నిస్సహాయత నాకే భారంగా తోచింది. నాలాటి అధికారులకి పునరావాసం కల్పిస్తామన్న యాజమాన్య ప్రతిపాదనను నిరాకరించి, చివరిరోజున రాజీనామా పత్రం యాజమాన్యానికి సమర్పించి, ఆ భావన నుండి బయటపడ్డాను.

పచ్చని వృక్షానికి గొడ్డలిపెట్టులా... ప్రభుత్వం ఆలోచితంగానో, అనాలోచితంగానో వేసిన. వీ.ఆర్.ఎస్. 'వేటు' కొన్ని వేల కుటుంబాలు నాశనం కావడానికి కారణభూతమయింది.

★★★

*అంకితం*

*'వేటు' అనే ఈ కథను నా తల్లిదండ్రులు కీ.శే. ఘండికోట సీతారామ, బ్రహ్మాజీరావు గార్ల దివ్యస్మృతికి అంకితం చేస్తున్నాను.*

*– రచయిత*

# కళ్ళెం

పొత్తూరి సీతారామరాజు
✆ 9948849607

***"ఇకపై మీరు సిగరెట్ కాలుస్తారా..."***

***"కాల్చను... నీకు ఇన్ని నీతులు చెప్పి, తప్పు చేసే నా మనసుకు ఈ రోజు నుండి పరివర్తన అనే లేపనాన్ని పూతగా పూస్తాను!"నవ్వింది... నిండుగా నవ్వింది. "ఎందుకంత ఆనందంగా నవ్వుతున్నావు..."***

***"మీ ఆరోగ్యం పాడుచేసే అనుభూతిని ఈరోజుతో మీరు వదిలేశారు. చాలా సంతోషం....ఇతరులతో శరీరం కోరుకునే అనుభూతిని కూడా దూరం పెట్టారు. ఇది మరీ సంతోషం....ఇదే సార్ జీవితం....***

టక్... టక్... టక్... తలుపు తడుతున్న శబ్దం... ఆదివారం సెలవు రోజు కాబట్టి ఆనంద్ ఇంటి దగ్గరే ఉన్నాడు. మధ్యాహ్నం కాస్తంత బడలికతో పడుకుంటే ఇంతలో ఈ శబ్దం... మెల్లగా తలుపు తీశాడు. ఎదురుగా పక్కింటి ఆమని.

ఎందుకొచ్చారన్నట్లు ఆమె ముఖంలోకి చూశాడు.

"మేడమ్ ఇంట్లో ఉన్నారాండీ?" అంది మెల్లగా.

"లేదు... బయటికి వెళ్లుంటుంది." అంటూ పక్కకి తప్పుకున్నాడు.

లోపలికి వచ్చింది చేతిలో ఏదో కవరు బరువుగా ఉంది.

"కూర్చోండి" అన్నాడు, కుర్చీ చూపిస్తూ. "మంచినీళ్లు తాగుతారా?" అన్నాడు.

"వద్దండి" అంది.

"నిన్న మా పెద్దబ్బాయి పుట్టినరోజండీ. రాత్రంతా చుట్టాల హడావుడితో సరిపోయింది. స్వీట్‌బాక్స్ ఇచ్చి పోదామని వచ్చాను!" అంటూ నవ్వింది.

అప్పుడు చూశాడు తేరిపారా... పోటెత్తిన గోదారిలా పొడవుగా ఉంది. సన్నని నడుము మీద చీర జారిపోయేటట్లుంది. వీపున జాకెట్టు తాళ్లు వేలాడుతున్నాయి. తెలుపు గంధంలో కొంచెం నలుపు రంగు కలిపితే ఎలా ఉంటుందో... అలా ఉంది ఆమె రూపం! చూడగానే అతని మది తలుపు తట్టిందేమో... సిగ్గుతో ముఖం పక్కకు తిప్పుకున్నాడు.




ఇంతలో లేచి గుమ్మం దగ్గరకు వెళ్లి చూశాడు. ఇంకా రావట్లేదు... మేడ మీదకు వెళ్లాడు అక్కడ లేదు.

"మీరు బ్యాంకులో చేస్తున్నారా?" అంది.

"అవును, నా పేరు ఆనంద్."

"మీదెక్కడ?" అన్నాడు ఆనంద్.

"మేమూ మూడేళ్లయిందండీ ఇక్కడికొచ్చి... అనకాపల్లి ఇవతల కశింకోట... ఆయన ఎం.ఆర్.ఓ ఆఫీస్‌లో గుమాస్తా... నేనేమో టీచర్నండి. ఇక్కడే ప్రైవేటు స్కూల్లో పనిచేస్తున్నాను. పదివేలు ఇస్తారండి, పొద్దుటే పోవాలి, మళ్ళీ సంధ్య వేళకు వస్తాను. నాకంటే ముందే ఆయన వచ్చేస్తారు. పిల్లలు ఉదయమే స్కూలుకు వెళతారు. మీరు కొత్తగా వచ్చారేమో... ఒకటి రెండుసార్లు... మేడ మీద కూర్చొని ఏదో రాసుకుంటుంటే చూశాను!"

"ఆ... అలాగాండీ..." అంతలోనే ఆనంద్ భార్య చిత్ర రానే వచ్చింది. రావడంతోనే ముఖం అదోలా పెట్టింది ఎందుకు వచ్చారన్నట్లు.

ఆమని లేచి నుంచుని స్వీట్‌బాక్స్ చేతిలో పెట్టి "ఇప్పుడే వచ్చానండీ మా అబ్బాయి పుట్టినరోజు ఫంక్షన్ రాత్రి, మీరు తొందరగా పడుకున్నారని రాలేకపోయాను! మరి వెళ్ళొస్తానండీ" అంటూ కుర్చీలో నుండి లేచి నిలబడింది.

"ఏం అమ్మాయ్.... అప్పుడప్పుడు వచ్చి పోతూ ఉండు. బ్యాంకులో మీకు పనులు ఏమైనా ఉంటే చెప్పండి. సార్ చూస్తారు" అంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది.

"అలాగే మేడం" అంటూ వెనక్కి ఒక్కసారిగా ఓరకంటితో ఆనంద్ వైపు చూస్తూ వెళ్ళిపోయింది.

★★★

ఆనంద్ ఆరోజు ఆఫీసుకు వెళ్లే హడావుడిలో ఉన్నాడు. ఇంతలో "బయట ఎవరో వచ్చారు చూడండి" అంటూ కేకేసింది వంటింట్లో నుండి చిత్ర.

"ఆ వెళుతున్నాను" అంటూ హడావుడిగా డ్రెస్ వేసుకొని హాలులోకి వచ్చాడు.

"ఏమిటి ఇంత పొద్దున్నే..." అంటూ ఆశ్చర్యంగా వాళ్ల వైపు చూశాడు. ఆమని, పక్కన ఈయన 'ఎవరంటూ' కళ్ళతోనే అడిగాడు.

"ఈయన మా ఆయనగారండీ, పేరు బబ్బోజీ... చిన్నప్పుడు బొద్దుగా ఉండేవారని, ఊళ్లో వాళ్లంతా అలా పిలిచేవారట! అదే పేరు ఊరు దాటి, జిల్లా దాటి ఆధారుకార్డు కెక్కింది. మీతో చిన్న పనుండి వచ్చాం, మాట్లాడి పోదామని! అక్కడికీ 'మీరెళ్లండి' అన్నా వినిపించుకోలేదు. ఎక్కడికి వెళ్ళినా నన్ను ముందుకు తోసి, తను వెనకాలుంటారండీ!"

"సర్లే కానీ... ఇంతకీ వచ్చిన పనేంటి?" అన్నాడు.

"మేము మీ బ్యాంక్‌లో హౌస్ లోన్ అప్లయి చేసి ఆరునెలలయిందండీ, ఇప్పటికీ రాలేదు. మీకంటే ముందు వచ్చిన మేనేజర్ రేపు, మాపు అంటూ ఇన్నాళ్లు తిప్పాడు. మీ చెవిలో ఓ మాటేసి పోదామని వచ్చామండి!" అంది ఆమని.

"సార్ ఎలాగైనా మీరు మాకు ఈ పని చేసి పెట్టాలి" అంటూ ప్రాధేయపడ్డాడు బబ్బోజీ.

"ఆనంద్‌గారూ... లోన్ నా పేరే అప్లై చేశాను."

"అది కాదమ్మా... ఆరునెలలు అయిందంటున్నారుగా, మళ్లీ కొత్తగా లోను కోసం అప్లికేషన్ పెట్టుకోండి! నేను చూస్తాను."

"మేము మీ ఋణం ఉంచుకోమండి!" అంది.

"ఓకే... అలాగేనమ్మా!" అన్నాడు.

వాళ్ళిద్దరూ తృప్తిగా వెళ్లిపోయారు.

★★★

సముద్రాన్ని... స్త్రీని ఆసాంతం చూడాలంటే రెండు కళ్లు చాలవు. ఇంకా చూడాలనిపిస్తుంది. కదల్లేం.... అడుగులు బరువుగా పడతాయి, వదిలి వెళ్లాలంటే... అప్పుడే విప్పారిన మల్లెపువ్వులా ఉంది ఆమె అందం. సాయంకాలం కొన్న మల్లెపూలు, రాత్రి ఆరుబయట వెన్నెల్లో వదిలేసి ఉంటుంది. అందుకే జడలో తురిమిన మల్లెదండ గుప్పుమనే వాసనతో మత్తెక్కిస్తోంది. ఆమె ముడిచిన కళ్లతో నా కళ్లను గుచ్చుతుంది. ఒళ్లో కూర్చుని... తన కాలివేళ్ళు నా వేళ్లను సుతారంగా నిమురుతూ పెనవేసుకుంటున్నాయి. నాలో ఏవో ప్రకంపనలు మొదలయ్యాయి. శంఖంలాంటి మెడను తీసుకొచ్చి నా పెదాలకు ఆన్చింది. తర్ఫీదు పొందిన తనువేమో... ఏమీ చేయకుండానే అన్నీ చేసేస్తోంది. మనసు ద్వారాలను మన్మథబాణాలతో తెరుస్తుంది. ఈ సమాగమంలో నా ప్రమేయం ఏమీ లేదు. నాకు భయం ఆవరించింది అన్న సంగతి గ్రహించిందో ఏమో... నుదుట మీద చెమటను చీర చెంగుతో తుడిచి సుతారంగా ముద్దుపెట్టింది.

"మీరు ఏం చేస్తున్నారు, ఏం చెప్పారు? 'మేడమ్ సాయంకాలం నాలుగుగంటల వరకూ రాదు. నువ్వు మధ్యాహ్నం లంచ్‌బ్రేక్‌లో స్కూల్‌కు సెలవు పెట్టి మా ఇంటికి వస్తే... మళ్లీ మూడుగంటలకు వెళ్ళిపోదువు' అన్నారు. మరి ఎందుకు అలా భయపడుతున్నారు!"

"నా భయం ఒకటే"

"అదే ఏమిటి?" అంది పైకి లేచి మోకాళ్ల మీద జారిన చీర సర్దుకుని.

"ఆమె పని పూర్తయితే ముందుగా వచ్చేస్తుందేమోనని..."

"మీ భయం పాడుగాను... ఇంత భయం గుండెల్లో పెట్టుకుంటే ఇంక నరాల్లో నీరసం తప్ప సరసం ఏముంటుంది. చాల్లెండి సంబడం! అయిదు నిమిషాల్లో అయిపోయే పనికి ఆదుర్దా ఎక్కువ ఓపిక తక్కువా అన్నట్టుంది మీ యవ్వారం..." అని బుగ్గలు నొక్కుకుంది.

"మరి నన్ను ఏం చేయమంటారు ఆమని గారు?"

"మీరేం చేయొద్దు గాని ఓ సామెత చెబుతాను వినండి. తిరనాళ్లలో తింగరోడు తప్పిపోతే.... ఊర్లో ఏ కొంపలో ఏ ముగ్గులు పెడుతున్నాడో అని ఊరంతా వెతికారట. తెల్లారాకా ఆడింట్లో ఆడే గుర్రుపెట్టి నిద్రపోతున్నాడట... అలాగుంది చూస్తే మీ చోద్యం!"

"ఇప్పుడు నేనూ మీరు కూర్చున్నా... నిలబడినా ఏం చేయకపోయినా ఒకటే అర్థం!"

"ఏమిటది అన్నాడు" ఆనంద్.

"ఏమిటా... ఈ సమాజం పలవులు లేని చెట్టుకి చిగురులు పూయిస్తుంది."

ఆనంద్ ఇంత భయంలోనూ...."నువ్వు ఏం చదువుకున్నావు" అన్నాడు.

"ఇప్పుడు ఈ టైంలో నా డిగ్రీలతో మీకు పనేంటండీ?"

"అది కాదు..."

"మరేంటి?" అంది.

"తెలుగులో చంపకమాల, వర్ణమాల, మత్తేభం, శార్దూలం సంధులు వాడుతూ పలుకుతున్నావుగా... అందుకే డౌట్ వచ్చి అడిగాను!"

"నేను ఆంధ్రా యూనివర్సిటీలో ఎం. ఎ. తెలుగు చేసాను" అంది.

"అయితే నువ్వు బాగా చదువుకున్నావు"

"అవును జీవితాన్ని చదువుకున్నాను. స్త్రీవాదాన్ని సమర్థించే రచనలు ఎన్నో చదివాను. ఎలాగో మీరు యుద్ధం విరమించారు కాబట్టి, ఆడదాని గురించి ఓ నాలుగు మాటలు చెప్పాలనుంది ఈ సందర్భంలో... ఈ విశ్వంలో నలిగిపోయేవి రెండే రెండు. ఒకటి నీటితో నిత్యం యుద్ధం చేసే సముద్రం. రెండవది నెలకోసారి రక్తస్నానం చేసే అమ్మ.

సముద్రంతో అల యుద్ధం చేసి, అలసి తీరం చేరాలనుకుంటుంది. గాలిమేఘం గుండెల్లో తల దాచి, నీరయి నేల రాలాలనుకుంటుంది. ఆడదంటేనే శతాబ్దాలనాటి కన్నీరు. కనురెప్పల మాటున కోరికలను దాచుకుని, జీవితాంతం చిలకని కన్నీటికుండ అండీ! గాలిలో ఎగిరే పక్షికి ఆహారం దొరకకపోతే, ఎక్కడైనా వాలి కాస్తంత తింటుంది. ఆడది అలా

కాదు. భర్తతోనే జీవితం... అతను మగాడా కాదా... అన్నది సమాజానికి అనవసరం. సంపాదన ఉంటే చాలు, వాడు మగ మహారాజు. అదికాదండీ... మగతనమంటే! ప్రతి వేకువన ఏ ఆడదాని కళ్లు సంతృప్తితో మెరుస్తాయో... అప్పుడు ఎవరూ ఎవరినుండీ ఏదీ కోరుకోరు." అంటూ కొంచెం బాధగా ముఖం పెట్టి లేచి కుర్చీలో కూర్చుంది.

అతను కిటికీలోంచి బయటకు చూస్తూ వింటున్నాడు

"నువ్వేం అనుకోనంటే నేనో మాట చెప్పనా?" అన్నాడు.

"ఫర్వాలేదు చెప్పండి" అంది.

"మనలాంటి వాళ్ల ఆరోగ్యాన్ని పాడుచేసే అనుభూతుల్ని, ఈరోజుతో వదిలేశాను. ఇతరుల శరీరాలతో కోరుకునే సుఖం ఎప్పటికీ శ్రేయస్కరం కాదని తెలుసుకున్నాను. మనసు కళ్లెంలేని గుర్రంలాంటిది. దానిని నియంత్రించడానికి ప్రయత్నించాలి!"

"కళ్లెం లేకపోతేనో?" అంది ఆమని.

"జూలు మన చేతిలోనే ఉంటుంది. అప్పుడు మనసనే గుర్రం ఎటువైపు పరిగెత్తమంటే, అటు పరిగెడుతుంది. ఆకలి, కోరిక మనకంటే ముందే పుట్టాయి. ఆమనీ... నాది కోరిక, నీది దాహం!" అన్నాడు.

"కోరికకు, దాహానికి తేడా ఏంటి?" అంది ఆమని.

"కోరిక అంటే కళ్లతో చూసేది, దాహమంటే శరీరాన్ని కోరుకునేది."

"చల్లని నీటికుండ చెంతకు దాహం తీర్చుకోవడానికి వచ్చాను. గ్లాసు ముంచి వేళ్ళకు నీళ్లు తగిలేసరికి కుండ భళ్లున పగిలింది. దాహం ఆవిరయిపోయింది నాకిప్పుడు!"

"నాకు సిగరెట్ అలవాటు ఉంది విత్ యువర్ పర్మిషన్..." అంటూ ఆమె వైపు చూశాడు.

"నో ప్రాబ్లం సార్... కానివ్వండి."

సిగరెట్ ముట్టించి గాలిలోకి వదిలాడు. గది కిటికీ తలుపులు తెరిచాడు. కిటికీ పక్కనే పెద్ద చెట్టు. దానిమీద జంట పక్షులు ముక్కులు పొడుచుకుంటూ చెలిమితో సరసాలాడుతున్నాయి.

తలవంచుకొని కూర్చున్న ఆమనిని లేపి చూపించాడు. ఆమె చిన్నగా నవ్వి... "నేను ఇందాక మీతో చెప్పానే.. దానికి అర్థం అదే! అది ఉంటే అందరూ కలిసి ఉంటారు. లేనప్పుడు... రోజుల్లోనూ... నెలల్లోనూ... పక్షి అయినా... జంతువు అయినా... మనుషులయినా విడిపోవడం ఖాయం! మనుషుల్లో మనసును వెతుక్కుంటుంది సార్ ఏ ఆడదైనా... అది ఇప్పుడు అందరిలోనూ కరువైంది. యాంత్రిక జీవనంలో పరుగు... ఏ అర్ధరాత్రో అలసటతో ఇంటికి చేరి బెడ్ మీద వాలిపోవడం! తెల్లారాక గుడ్ మార్నింగ్‌లు పలకరింపులు... కృత్రిమ నవ్వుల మధ్య వేడివేడి కాఫీ తాగుతూ... మళ్లీ ఎవరి పనులకు వారు వెళ్లిపోవడం... ఇదే ఇప్పటి వైవాహిక జీవనం సార్! అసంతృప్తి తెరిచిన తలుపులాంటిది. అది అవకాశం కోసం చూస్తుంది.

తప్పు ఎవరిదీ కాదు. రెండు జీవితాలు ఒకటవుదామనుకునేటప్పుడు ఆర్థిక, సామాజిక, శారీరక స్థితిగతులన్నీ సమర్థతతో ఉండాలి... అప్పుడే వివాహవ్యవస్థ రాణిస్తుంది."

"నో... జీవితాన్ని అందంగా నిర్వచించావు..." అంటూ సిగరెట్ ఆఖరి పఫ్ పీల్చుకొని కిటికీలో నుంచి విసిరేశాడు.

"ఆఖరిగా మిమ్మల్ని ఓ మాట అడగనా సార్?"

"అడుగు" అన్నాడు కొంచెం దగ్గుతూ. పొగ గొంతుకు పట్టేసి ఉంటుంది.

"మంచినీళ్లు ఇవ్వనా?" అంది ఆమని.

"వద్దు వద్దు... చెప్పు."

"ఇకపై మీరు సిగరెట్ కాలుస్తారా?"

"కాల్చను... నీకు ఇన్ని నీతులు చెప్పి, తప్పు చేసే నా మనసుకు ఈ రోజు నుండి పరివర్తన అనే లేపనాన్ని పూతగా పూస్తాను!"

నవ్వింది... నిండుగా నవ్వింది. "ఎందుకంత ఆనందంగా నవ్వుతున్నావు?"

"మీ ఆరోగ్యం పాడుచేసే అనుభూతిని ఈరోజుతో మీరు వదిలేశారు. చాలా సంతోషం. ఇతరులతో శరీరం కోరుకునే అనుభూతిని కూడా దూరం పెట్టారు. ఇది మరీ సంతోషం. ఇదే సార్ జీవితం. ఈ రెండూ అనుభవంలోకి రాకపోతే మనకు తెలియని ఊబిలోకి కూరుకుపోతాం. చెడు జ్ఞాపకం ముళ్ళు లాంటిది. అది జీవితాంతం బాధిస్తూనే ఉంటుంది. మీరు మన ఈ పరిచయాన్ని మధురస్మృతిగా మిగిల్చారు సార్! మనిషికి – మనసుకు కళ్ళాలవసరం" అంటూ చిరునవ్వుతో మెట్లు దిగి వెళ్లిపోయింది.

★★★

ఉదయాన్నే అలసటతో లేచిన ఆమని పక్కనే ఉన్న సెల్‌ఫోన్ కేసి చూసింది. 'బ్యాంకు లోన్ శాంక్షన్డ్!' మెసేజ్ చూసుకొని చిన్నగా నవ్వుకుంది. వాట్సాప్‌లో మరో మెసేజ్... 'నిశ్చలమైన సముద్రం, తీరంనుండి ఏమీ ఆశించదు. కాసింత చోటు, సేదతీరి వెళ్లిపోవడం తప్ప...'

'గొప్ప మనిషి!' అనుకుంటూ మళ్లీ మనసారా నవ్వుకుంది ఆమని.

# బామ్మ పెట్టెలో పట్టుచీర

డా. తాడేపల్లి రామలక్ష్మి

***"ఇంట్లో పడి ఉండాల్సిన ఆ ముసలిదానికి ఎందుకే అంత మంచి చీర? తీసి ఈవిడకి పెట్టేద్దాం. ఏం చేస్తుందట బామ్మ?" రెచ్చగొట్టింది సుమిత్ర.***

***"అవును. కానీ, అడిగితే ఇవ్వదు. అన్న, దున్న అనుకుంటూ గోల చేస్తుంది. అందుకే తెలీకుండా, ఆ గదిలోకి వెళ్లి తీసేద్దాం. అక్కడే మంచంకి గోడకు మధ్య పెడుతుంది తన ట్రంకుపెట్టె!"***

"ఇప్పుడు ఈవిడ గారికి ఏమి మునిగిపోయింది అని వీళ్లు ఊడిపడ్డారూ? 'జరుగుబాటు ఉంటే జ్వరమంత సుఖం లేద'ని కొడుకుతో, నాతో హాయిగా సేవలు చేయించుకుంటుంటే... ఏదో నాలుగురోజుల జ్వరానికే చూడటానికి వచ్చేయాలా?" అంటూ తన అత్తగారిని చూడటానికి వచ్చిన ఆవిడ తమ్ముడినీ, ఆయన భార్యనీ తిట్టుకుంటూ బీరువా అంతా కలుగులో పందికొక్కు తవ్వి పోసినట్లు, కెలికేస్తూ వెతికేస్తోంది అమరేశ్వరి.

"కొంచెం సేపట్లో వెళ్ళిపోతారు కదటే అమ్మా, భోజనం కూడా చేసే వచ్చామన్నారుగా, నువ్వెందుకు ఇంత ఖంగారుపడుతున్నావు?" అంటూ అమరేశ్వరిని విసుక్కుంది కూతురు సుమిత్ర.

విసుక్కోదు మరీ... తను పుట్టింటికి వచ్చినప్పుడు, ఎంత మంది చుట్టాలను కలిస్తే అంత ఆనందం సుమిత్రకి.

తరచూ తను కొనుక్కున్న కొత్తచీరలు, నగలు, తను భర్తతో కలిసి తిరిగిన ప్రదేశాలూ, అక్కడ తాము కలిపి నాకిన ఐస్‌ఫ్రూట్లూ, కలిసి పీకిన గడ్డిపోచలూ అన్నీ ఫోటోలు తీసి, అవి అందరికీ చూపించి, అందరికన్నా తను ఎంత గొప్ప జీవితం గడుపుతున్నదో చాటుకోపోతే, గోరుచుట్టు వచ్చినంత సలపరం వచ్చేస్తుంది ఆ అమ్మాయికి!

అప్పటికీ ప్రతీరోజూ కట్టిన చీర కట్టకుండా కట్టి, తను తుమ్మినా, చీదినా ఫోటోలు తీసుకుని, ఆ ఫోటోలు ఫేస్‌బుక్‌లోనూ, ఇన్స్టాగ్రామ్‌లోనూ పెడుతూనే ఉంటుంది. కానీ తమ బంధువుల్లో ముసలీ ముతకా ఎంతసేపటికీ బల్లుల్లా ఆ భక్తి టీవీలు పట్టుకు వేలాడేవాళ్ళే గానీ ఫేస్‌బుక్‌లు, ఇన్స్టాలు చూసేవాళ్ళు తక్కువ.

అందుకే, మూడ్నెల్లకోసారి ఏదో ఒక వంక పెట్టుకుని, వెయ్యి కిలోమీటర్ల పైన ప్రయాణం చేసి మరీ పుట్టింటికి వస్తుంది సుమిత్ర. వచ్చినప్పుడల్లా అందరినీ కలిసి తన గొప్పల ఎగ్జిబిషన్ నిర్వహించి వెళ్తుంది.

పనిలో పనిగా తల్లికి... అటు బామ్మ మీద, ఇటు మరదలి మీద నూరిపోసి, వీలైనన్ని గొడవలు రాజేసి, ఆ ఇంట్లో ఏ ఇద్దరు అత్తాకోడళ్ళ మధ్యా సఖ్యత లేకుండా జాగ్రత్తలు చేసి, అలా అయితేనే పుట్టింట్లో తన స్థానం సుస్థిరం అనుకుని, ఆ విషయాన్ని అలా రూఢి చేసుకుని మరీ పోతుంది సుమిత్ర.

గాడిద సంగీతానికి ఒంటె 'ఓహో...' అంటే, ఒంటె అందానికి గాడిద 'ఆహా' అన్నట్లు,' 'కూతురు తనని మించిన తెలివి'తో శోభిస్తూ, సవ్యసాచిలాగా తను ఒక చేత్తో అత్తగారిని ఇంకో చేత్తో కోడలినీ కంట్రోల్ చేయగలగడానికి, క్రొంగొత్త సలహాలు ఇస్తూ ఉంటే మురిసి ముక్కలయ్యి, బ్యాగుల నిండా చీరలు, పచ్చళ్ళు, పిండివంటలు నింపి పంపిస్తూంటుంది అమరేశ్వరి.




పిల్లలకి ఆన్లైన్ క్లాసులు స్కూళ్ల వాళ్ళు ఇప్పుడు కనిపెట్టారు కానీ, అసలీ ప్రక్రియకి ఆద్యురాలు ఎవరూ అని చరిత్రకారులు వెతికితే మాత్రం సుమిత్ర పేరే బయటకు వస్తుంది. ఎందుకంటే తను మళ్లీ వచ్చేలోపు అత్తాకోడళ్ల మధ్య తను రాజేసిన జ్వాలలు చల్లారిపోకుండా, తల్లికి ప్రతిరోజూ ఫోన్ చేసి ఆన్లైన్లోనే అగ్గి ముట్టించి మరీ పోట్లాటల పాఠాలు చెప్తుంది ఆ నిత్యాగ్నిహోత్రురాలు!

ఆ అమ్మాకూతుళ్ళ రాజకీయాలు ఎదుర్కోవడం కాదు కదా, కనీసం అర్థంచేసుకునే శక్తి కూడా లేక ఉక్కిరిబిక్కిరై, ఆ టెన్షన్తో ఆరోగ్యం చెడగొట్టుకుంటున్న భార్య పద్మజను చూసి జాలేసి, దగ్గరా దాపుల్లో కాకుండా ఉద్యోగం చూసుకుని పారిపోయాడు అమరేశ్వరి కొడుకు భాస్కర్.

తన ప్రతాపానికి తట్టుకోలేక తమ్ముడూ, మరదలు ఊరొదిలి పారిపోయినా ఊరుకోకుండా 'గొడుగు పడితే పిడుగుకి అడ్డమా' అన్నట్లు... ఎప్పుడెప్పుడు వాళ్ళు తల్లిదండ్రుల్ని చూడడానికి వస్తారో తెలుసుకుని, తనూ అదేరోజుకి ఉల్కలా ఊడిపడి, ఉత్పాతాలు సృష్టించడం సుమిత్ర పార్ట్టైమ్ హాబీ.

అలాంటి ఒకానొక సందర్భంలో సుమిత్ర ఊడిపడ్డ టైమ్ లోనే... పాపం సుమిత్రా వాళ్ళ ఎనభై ఏళ్ల బామ్మ ధనలక్ష్మమ్మకి జ్వరం వచ్చి, ఆవిడను చూడడానికి ఆవిడ తమ్ముడు ప్రకాశరావు, ఆయన భార్య భాగ్యమ్మ రావడంతో సుమిత్రకి ఏనుగెక్కినంత సంబరంగా ఉంది.

రాగానే వాళ్ళకి తన టాబ్‌లోవి ఓ వెయ్యి ఫోటోలు చూపించి, వివరించడం మొదలు పెట్టింది సుమిత్ర. కాసేపు తన అక్కయ్యతో మనసారా మాట్లాడుకుందామని వచ్చి, ఖర్మకాలి సుమిత్రకు చిక్కిన ప్రకాశరావు, వాళ్ళావిడా ఎటూ తప్పించుకునే మార్గం లేక, చచ్చినట్లు ఆ ఫొటోలు చూసీ చూసీ... కళ్ళు మండి, నీళ్ళు కారి, చివరికి వాళ్లిద్దరి కళ్లు టమోటా పచ్చడి రంగులోకి మారి... "మిగిలినవి కొంచెం సేపు ఆగి చూస్తాం" అని దణ్ణం పెట్టినంత పని చేయడంతో... ఆ ముసలాళ్ళ మీద విసుగుతో కూడిన జాలితో చిన్న విరామం ఇచ్చి వచ్చింది సుమిత్ర.

ఒక అయిదారు వందల సెకన్ల తర్వాత ఇంకో వెయ్యి ఫోటోలు చూపిద్దాం, ఈలోపు వాళ్ళు బామ్మతో మాట్లాడుకుంటారనుకుంటూ బెడ్‌రూమ్‌లోకి వస్తే, ఇక్కడ తల్లి అమరేశ్వరి చుట్టాలు రావడాన్ని నిరసించడం సుమిత్రకి నచ్చలేదు.

అంతే మరి, తల్లి అయితే మాత్రం... తన సరదాలకి అడ్డు పడితే ఎట్లా? తమ్ముడు తమ్ముడే... పేకాట పేకాటే!

"ఇంతకీ నువ్వేం వెతుకుతున్నావు అంత హడావిడిగా? ఎందుకా ఖంగారూ?" అని తల్లిని గుసగుసగా గద్దించింది సుమిత్ర.

"అదేనే... ఆ వచ్చినావిడకి పెట్టడానికి చీర కోసం వెతుకుతున్నాను. సమయానికి ఒక్క చీరా లేదు."

"ఇప్పుడు ఆవిడకి చీర ఎందుకు పెట్టాలి? ఒక జాకెట్ ముక్క పెడితే సరిపోతుందిగా!"

"అట్లా కాదులే... ఏదో ఒకటి పెట్టాల్సిందే! క్రితంసారి వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఆవిడగారు బడాయిగా నాకు రెండువేల రూపాయల గద్వాల్ చీర పెట్టింది. ఇప్పుడు నేను చీర పెట్టకపోతే మనకే చిన్నతనం!" అన్నది, ఎవరి మంచిలోనించి అయినా చెడును వెతికి మరీ చూడగల అమరేశ్వరి.

"అయితే... నీకు పిన్నీవాళ్ళు, అత్తయ్యవాళ్ళు పెట్టిన కొత్త చీరలు నాకు చూపించావుగా, వాటిల్లోది ఏదైనా పెట్టు!" అంది సుమిత్ర.

"ఆ... అంత ఖరీదైన చీరలు పెట్టడం ఎందుకే ఈవిడ మొహానికి! ఆ చీరలు ఒక్కొక్కటి వెయ్యి, పదిహేనొందల దాకా ఉంటాయి, అందరికీ అంత ఖరీదైన చీరలు కట్టుకునే యోగ్యత ఉంటుందా ఏంటి? పిన్నికి ఈ భాగ్యం... బాబాయికి మంచి ఉద్యోగం వచ్చినప్పటినుంచీ నడమంత్రపు సిరితో మిడిసిపడుతూ ఉంది కానీ, పెళ్ళయినప్పుడు ఆవిడ గారి తాహతు ఏమిటో నాకు తెలీదూ! వెయ్యి రూపాయల చీర పెట్టడానికి అర్హత ఉన్న మొహమేనా అది?" అంది అంతకు ముందు ఆవిడతో రెండువేల రూపాయల చీర పెట్టించుకున్న అమరేశ్వరి.

"అయితే... ఈ చీర పెట్టూ, ఇదేదో కొంచెం తక్కువ ఖరీదు చీరలా ఉంది."

"అదీ... వైభవలక్ష్మీ వ్రతం నోచుకుని, అన్నపూర్ణ ఆంటీ పెట్టిన చీరే! మేమిద్దరం ఎంత మంచి స్నేహితులమో నీకు తెలుసు కదా. అది అంత ప్రేమగా పెట్టిన చీర నేను ఈవిడకి పెట్టలేనే. నేనే కట్టుకుంటా! అసలు ఎప్పుడూ ఇలాంటివాళ్ళ కోసం

మూణ్ణాలుగొందల్లో పెట్టుబడి చీరలు తెచ్చి ఇంట్లో రెడీగా ఉంచుకుంటా. మనం నిన్న షాపింగ్‌కి వెళ్ళినప్పుడు అవి కూడా తీసుకుందాం అనుకున్నాను కానీ, మన ఇద్దరి షాపింగ్ అంతా పట్టుచీరల సెక్షన్‌లోనే అయ్యిందాయె. మనిద్దరికీ చీరలు సెలెక్ట్ చేసేటప్పటికే మన ఓపికలు అయిపోయాయి, ఇంక ఆ పెట్టుబడి చీరల వైపుకే పోకపోతిమి!" నిట్టూరుస్తూ అంది అమరేశ్వరి.

"అమ్మా, ఈ చీర చూడు, ఏదో తక్కువ ఖరీదు చీరలానే ఉంది!" అంటూ బీరువాలోంచి ఒక చీర బయటకి తీసింది సుమిత్ర.

"అదా, అది తక్కువ ఖరీదు చీరే కానీ ఆ రంగు నాకు నచ్చింది, అందుకే నా కోసం ఉంచుకున్నా!"

ఇంతలో... "అమ్మాయ్ మంథరా, వాళ్ళు బయల్దేరతాం అంటున్నారు, మీ అమ్మకు చెప్పు!" అంటూ బెడ్‌రూమ్ గుమ్మం దగ్గరికి వచ్చి, కోడలు గుడ్లురిమినట్లు చూడడంతో గుమ్మం దగ్గరే ఆగిపోయింది బామ్మగారు.

అంతే మరి! ఇష్టం వచ్చినట్టు ఇల్లంతా తిరిగే హక్కు లేదు అమరేశ్వరి హయాంలో ధనలక్ష్మమ్మకి! ఆవిడ మంచం ఏ గదిలో ఏ మూలన ఉందో అక్కడే పడి ఉండాలి ఆవిడ. భోజనం వేళకి పిలిస్తే పెట్టింది తిని, మళ్లీ కుక్కినపేనులా కుక్కి మంచంలో ఉండాలి. ఏదో చుట్టాలు వచ్చినప్పుడే... ఆ కాసేపు అలా హాల్లోకి వచ్చి మాట్లాడే అవకాశం ధనలక్ష్మమ్మకి! ఎప్పుడైనా అమరేశ్వరి బయటకు వెళ్ళినప్పుడు మాత్రం రెక్కలొచ్చిన పక్షిలా ఇల్లంతా స్వేచ్ఛగా తిరుగుతూ, హాయిగా తన కొడుకుతో కబుర్లు చెప్పుకుంటుంది ధనలక్ష్మమ్మ.

పెళ్లయ్యాక అత్తగారింటి సంప్రదాయం పేరుతో తన తల్లి పెట్టిన ఓల్డ్ ఫ్యాషన్డ్ పేరు తీసేసి 'మంధిర' గా తన పేరు మార్చుకుంది సుమిత్ర.

అంతకు ముందే సుమిత్ర బుద్ధులు కనిపెట్టి, 'వాళ్ళమ్మ రామాయణంలో అంత మంచి పాత్ర పేరు దీనికి పెట్టి ఆ పేరుని చెడగొట్టింది కానీ అసలు ఏ మంథర అనో శూర్పణఖ అనో పెడితే, దీని చుప్పనాతితనానికి సరిగ్గా సరిపోయేది' అని తన మనసులో ఎప్పుడూ అనుకునే ధనలక్ష్మమ్మ, మారిన పేరు నోరు తిరగటం లేదనే వంకతో సుమిత్రని మంధిర బదులు మంథర అనే పిలుస్తూ ఉంటుంది.

ఇప్పుడు చుట్టాలున్నారన్న అలుసుతో అత్తగారు హద్దులు మీరి తన బెడ్రూమ్ లోకి ప్రవేశింపజూసిందని అమరేశ్వరికీ, ఎన్నిసార్లు చెప్పినా తనను మంథర అనే పిలుస్తుంది అని సుమిత్రకీ... ధనలక్ష్మమ్మ మీద ఒళ్ళు మండిపోయింది.

"ఈవిడ సంగతి తర్వాత చూద్దాం కానీ, అవతల వాళ్ళు బయలుదేరతాం అంటున్నారు, ఇప్పుడేం చేద్దాం?" అని తల పట్టుకుని కూర్చుంది అమరేశ్వరి.

మొన్నే ఎవరో బంధువుల ఇంటికి వెళ్ళినప్పుడు వాళ్ళు తనకి పెట్టిన పెట్టుడుచీర, ఇప్పుడు అవసరానికి ఇవ్వమని తల్లి అడుగుతుందేమో అని అనుమానం వచ్చి, తన దగ్గర ఉంటే తనే ఎవరికైనా పెట్టడానికి వాడుకోవచ్చు కదా అని, "నా దగ్గరున్న చీర ఇచ్చేదాన్ని కానీ, ఆ చీర నిన్న రాత్రి వీడియో కాల్లో చూసి 'చాలా బాగుంటుంది నీకు, నువ్వే కట్టుకో, ఎవరికి పెట్టకు' అన్నారమ్మా మీ అల్లుడు" అంటూ ముందర కాళ్ళకి బంధం వేసింది, అంతకు ముందురోజే ముప్పయివేలు పెట్టి తల్లితో మూడు పట్టుచీరలు కొనిపించుకున్న కూతురు.

ఇంకా బీరువా వైపు చూస్తూ ఆలోచిస్తున్న తల్లితో, "ఈ బీరువాలో అయితే ఏం లేవుగా, ఆ రెండో బెడ్‌రూమ్‌లో ఇంకో బీరువాలో కూడా నీ చీరలు కొన్ని పెట్టావుగా, అందులో ఏమైనా ఉన్నాయేమో చూద్దాం పదా, ఆ బీరువా కీస్ తీసుకో" అంటూ లేచింది సుమిత్ర.

'రెండో బెడ్రూమ్' అనగానే ఏదో గుర్తు వచ్చి అమరేశ్వరి కళ్లు మెరిసాయి.

అమరేశ్వరికి గుర్తొచ్చింది ఆ గదిలోని తన బీరువాలో పెట్టుడు చీర ఉన్నదని కాదు, ఆ గదిలోని ఓ పెట్టెలో ఏకంగా ఓ పట్టు చీర ఉన్నదని! కానీ ఆ పెట్టె తనది కాదు, తన అత్త గారిది!!

ధనలక్ష్మమ్మకి ఆవిడ అన్నయ్య, తన మనవడి పెళ్ళిలో పెట్టిన కంచిపట్టు చీర అది! ఆ అన్నయ్య ఆ తర్వాత కొన్నిరోజులకే వెళ్లిపోయిన బాధతో ఆ చీర ఇంకా కట్టుకోని బామ్మగారు, ఆ చీరను అన్నయ్య జ్ఞాపకార్థంగా ఉంచుకుని, కడుపుతో ఉన్న పద్మజ ప్రసవించాక, "మునిమనవడి బారసాలలో కట్టుకుంటా" అంటూ పదిలంగా ఉంచుకున్నారు.

ఆ చీర ధనలక్ష్మమ్మ చేతిలో చూసిన మొదటి క్షణం నుండి అమరేశ్వరి మనసు కుతకుతలాడిపోతోంది. తనకి ఎంతో ఇష్టమైన చంద్రకాంతం రంగు చీరా, అందునా కంచిపట్టు చీర, అత్తగారి దగ్గర ఉండటం భరించలేకపోతోంది.

అలా అని అమరేశ్వరి దగ్గర అలాంటివి లేక కాదు, అంతకన్నా ఖరీదైనవి, అలాంటి రంగుల్లో ఎన్నెన్నో ఉన్నాయి.

అయినా సరే... అత్తగారి దగ్గర ఉండకూడదు, అంతే!

'అసలు కోడళ్ళ దగ్గర అత్తగార్లు ఎంత అణిగి మణిగి ఉండాలి? కొంతమంది తెలివైనవాళ్లైతే అరగదని వంక పెట్టి, ఒక్కపూటే అన్నం పెడతారు ముసలి అత్తగార్లకి! అప్పుడే ఓపికలేక కిక్కురుమనకుండా పడి ఉంటారు ఈ అత్తగార్లు! పోనీ తనూ అలా చేద్దామంటే, తన మొగుడు పనీ పాటా లేకుండా రెండుపూట్లా తనే తల్లిగారికి వడ్డించి, దగ్గరుండి తినిపిస్తాడాయె! అందుకే ఈవిడగారు ఇలా పట్టు చీరలు కడదామని చూస్తోంది. తన ముందు ఆవిడ పట్టుచీరలు కడితే, ఇంక తనకీ ఆవిడకి తేడా ఏముంది, తన పెత్తనానికి విలువ ఏముంది?' ఇవీ అమరేశ్వరి ఆలోచనలు.

పైగా అమరేశ్వరి రాజ్యాంగం ప్రకారం... తన బంధువులు తమ ఇంట్లో ఎవరికి ఏ బహుమతులు ఇచ్చినా వాటన్నిటి మీదా సంపూర్ణ హక్కులు అమరేశ్వరివే!

ఈ మధ్యే కొడుకు, కోడలు అదే ఊళ్ళో ఇల్లు కొనుక్కుని గృహ ప్రవేశం చేసుకుంటే... ఆ ఫంక్షన్లో కొడుకు, కోడలుకి తన తరపు బంధువులు బొట్టు పెట్టి ఇచ్చిన గిఫ్ట్లు అన్నీ 'నా బంధువులు ఇచ్చినవి అన్నీ నావే' అంటూ పద్మజ చేతిలో నుంచి లాక్కుని, తీసేసుకుంది.

అదే రూల్ అత్తగారి దగ్గర అమలు చేయలేకపోతోంది అమరేశ్వరి. ఎందుకంటే తన బంధువులు అందరూ తనకంటే ముందు, తన మేనత్తే అయిన తన అత్తగారికి బంధువులు అయ్యారాయె!

అందుకే తన అత్తగారికి అన్న అయిన తన పెదనాన్న, ఆవిడకు ఆ పట్టుచీర పెట్టినప్పటినుండి, ఏమీ చేయలేక రగిలిపోతోంది.

ఇప్పుడు కూతురు 'ఆ రూమ్‌లో చీర' అనగానే చుట్టాలకి పెట్టడానికి అత్త గారి పట్టుచీర వాడేస్తే పీడా పోతుంది అనిపించింది అమరేశ్వరికి!

అందుకే... ఒక్క అంగలో కూతురిని చేరి, బుగ్గలు లాగి ముద్దు పెట్టుకుంది, "మా బంగారు తల్లే... నీ బుర్రే బుర్ర... భలే ఐడియాలు చెప్తావు" అంటూ.

అంత ముద్దులు పెట్టుకునేంత గొప్ప ఐడియా తనేం ఇచ్చిందో తనకే అర్థం కాక, "నేనేం చెప్పానే అమ్మా!" అని ఆశ్చర్యపోయింది సుమిత్ర.

"నువ్వు తెలిసే చెప్పాలటే. ఆ అమ్మవారు నీ నోటితో అలా పలికిస్తుంది. చేతిలో వెన్న పెట్టుకుని నేతికోసం ఊరంతా వెతుకుతున్నా ఇందాకట్నించీ!" అంటూ, తను చేయబోయే పాపిష్టి పని తాలూకు అపరాధ భావం తన మనసులో ఏ మూలా లేకుండా, ఆ పాప భారం అంతా అమ్మవారి మీద ముందుగానే వేసేసింది అమరేశ్వరి.

విషయం తెలుసుకుని, "ఇంట్లో పడి ఉండాల్సిన ఆ ముసలిదానికి ఎందుకే అంత మంచి చీర? తీసి ఈవిడకి పెట్టేద్దాం. ఏం చేస్తుందట బామ్మ?" రెచ్చగొట్టింది సుమిత్ర.

"అవును. కానీ, అడిగితే ఇవ్వదు. అన్న, దున్న అనుకుంటూ గోల చేస్తుంది. అందుకే తెలీకుండా, ఆ గదిలోకి వెళ్లి తీసేద్దాం. అక్కడే మంచంకి గోడకు మధ్య పెడుతుంది తన ట్రంకుపెట్టె!"

"మరి నీ కోడలు లగేజీ ఆ గదిలోనే పెట్టుకుందిగా, మనం చీర తీస్తుంటే అటు వచ్చి చూసేస్తుందేమో?"

"మనం ఆ గదిలోకి వెళ్ళే ముందే టీ పెట్టమని ఆ పిల్లకి చెప్తా, అది వంటింట్లో ఆ పనిలో ఉంటుంది. ఈ లోపు మనం ఆ బెడ్రూమ్‌లోకి వెళ్ళి చీర తెచ్చేద్దాం." అంటూ... అలమరాల నిండా ఖరీదైన పట్టుచీరలు ఉన్న ఇద్దరూ... ఆ ఎనభై ఏళ్ల ముసలావిడ తన అన్న గుర్తుగా దాచుకున్న ఒక్కగానొక్క పట్టుచీరను దొంగిలించడానికి ఉద్యుక్తులయ్యారు.

అనుకున్న ప్లాన్ ప్రకారం, పద్మజను టీ పెట్టమని, బామ్మ హాల్లో చుట్టాలతో మాట్లాడుతుండగా, వంటింటికీ, రెండో బెడ్రూమ్‌కి కలిపి ఉన్న బాల్కనీ ద్వారా ఆ బెడ్రూమ్‌లోకి వెళ్ళి, హాల్లో ఉన్న బామ్మ కన్నుగప్పి, మెల్లిగా ఆ గదికీ, హాల్‌కీ మధ్య ఉన్న తలుపు వేశారు.

సుమిత్ర కబడ్డీ ప్లేయర్ లాగా ఒక్క దూకు మంచం మీదకు దూకి, మంచం సందులోని పెట్టెను తీస్తోంది.

అమరేశ్వరి ఆనందంతో మురిసిపోతోంది.

'చంద్రకాంతం రంగు పట్టుచీర కడతావా అత్తా? పైగా మునిమనవడి బారసాలలో! ఇప్పుడు కట్టు, ఏం కడతావో! నీ చీర పిన్నికి పెట్టేస్తా, పట్టుచీర పెట్టేంత ప్రేమ వాళ్ళ మీద ఉన్నదానిలా బాబాయ్ దగ్గర పేరు తెచ్చుకుంటా. ఇంటికి వచ్చినవారికి పట్టుచీరలు పెట్టగలిగే అంత గొప్పదానిగా నా ఐశ్వర్యం చూపించి, ఆ భాగ్యం పిన్ని కడుపు మండేట్లు చేస్తా. ఒక్క దెబ్బకి రెండు, కాదు మూడు పిట్టలు!' అనుకుని మురిసిపోతూ తనలో తనే నవ్వుకుంటోంది అమరేశ్వరి.

"అమ్మా!" అంటూ దీన స్వరంతో పిలుస్తున్న సుమిత్ర గొంతుతో ఈ లోకంలోకి వచ్చింది అమరేశ్వరి.

"ఆ, తీసావా? కనిపించిందా? చంద్రకాంతం రంగు పట్టుచీరా" అంటూ ఆత్రంగా అడిగింది అమరేశ్వరి.

"ఏంటి తీసేది? ముసలిది ఏం చేసిందో చూడు" అంటూ పెట్టెను చూపించింది సుమిత్ర.

బామ్మ తన పెట్టెకు వేసిన తాళం కప్ప తళతళా మెరుస్తూ తల్లీ కూతుళ్ళను వెక్కిరిస్తోంది.

"ఆ! అయ్యో అయ్యో! చూసావే మీ బామ్మ అఘాయిత్యం, ఇంట్లోనే తాళం వేసుకుంటుందా? ఎంత స్వార్థపరురాలు?"

"అయినా ఈవిడగారి ఆస్తులు దోచుకెళ్ళే దొంగలు ఇక్కడ ఎవరున్నారని ఈవిడ ఉద్దేశ్యం? వయసు వచ్చింది కానీ బుద్ధి జ్ఞానం లేదు" అనుకుంటూ... తమకు తగిలే తిట్లు అన్నీ తామే తిట్టుకుంటూ నీరసంగా మంచం మీద కూలబడ్డారు అమ్మాకూతుళ్ళు.

ఎప్పుడూ టీ తాగని అత్తగారు ఈ రోజు టీ పెట్టమంది, తనకి కూడా టీ పెట్టమందా లేక వేరుగా కాఫీ కలపాలా అని అనుమానం వచ్చి, కనుక్కుందామని అత్తగారిని వెతుక్కుంటూ వచ్చిన పద్మజ బాల్కనీలో నుంచే అంతా విని అర్థం చేసుకుని, 'అక్కడ ఉన్నది నేను అనుకున్నారా, మీ ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తించడానికీ, మీ కుళ్ళు తెలివితేటలతో గెలవడానికీనూ! తాడిని తన్నేవాడుంటే వాడి తలతన్నేవాడూ ఉంటాడంటే ఇదేనేమో!' అనుకుని నవ్వుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళిపోయింది.

సుమిత్ర వేశాననుకుని హడావిడిలో సరిగా వేయని తలుపు సందులోంచి జరిగేదంతా ఓ కంట కనిబెడుతున్న సూక్ష్మగ్రాహి ధనలక్ష్మమ్మ... 'ఓసి దొంగ మొహాల్లారా నా చీరకే ఎసరు పెడదాం అనుకున్నారా? ఒసే అమరీ! నిన్ను పుట్టినప్పటి నుంచీ చూసిన నీ మేనత్తనే నేను! నీ బుద్ధులూ, నీ కూతురి బుద్ధులూ నాకు తెలీవా! అందుకే నా జాగ్రత్తలో నేను ఉన్నా! అయినా నీకు తెలిసి చావదు గానీ... నీకు ఆ చీర నచ్చిందని నాకు తెలుసే. 'కూన అని పెంచితే గండు అయ్యి కరవ వచ్చింది' అన్నట్లు అత్తగారినని నాపై నువ్వు కచ్చ పెట్టుకున్నావు కానీ, చిన్నప్పటి నుండి నిన్ను ఎత్తుకు పెంచినదాన్ని, నీపై నా ప్రేమ పోతుందా! నీకా రంగు అంటే ఇష్టమని నాకు తెలీదా, అందుకే రాబోయే శుక్రవారం నీ పుట్టినరోజున నీకా చీర ఇచ్చేసి కట్టుకోమందాం అనుకున్నా. నీకు నా ప్రేమ అర్థమై ఏడిస్తేగా! ముందే ఇస్తే ఆ మంథర నిన్ను బురిడీ కొట్టించి నీకు లేకుండా ఎత్తుకుపోతుందని, పుట్టినరోజు వరకూ నా దగ్గరే ఉంచుకుని ఇద్దామని ఉంచా! దానికి ఎన్ని ఉన్నా పక్కవాళ్ళ వాటి మీదే కన్నాయె! దాని విషయం వచ్చేసరికి నీకూ ఉచ్చం నీచం తెలియవు. మీ ఇద్దరూ కలసి ఇలాంటి ముదనష్టపు పనేదో చేస్తారనే నా పెట్టెకు తాళం వేసి పెట్టుకున్నా!' అనుకుంటూ నవ్వుకుంది.

అయితే అక్కడ బామ్మ, పద్మజ నవ్వుకున్న దానికన్నా ఇంకా ఎక్కువ నవ్వుతున్న వాళ్ళు ఇంకొకళ్ళు ఉన్నారు.

ఎవరంటే...

"అంతా అమ్మవారి దయ" అంటూ, మహా భక్తురాలి ఫోజులో, తను చేయబోయిన తప్పుడుపని తాలూకు పాపాన్ని అంతా అమరేశ్వరి ఎవరి మీద అయితే మోపబోయిందో ఆ అమ్మవారు! "భలే! నీ జాగ్రత్తతో నీ చీర కాపాడుకోవడమే కాక, చెడ్డవారికీ, చెడ్డపనులకూ నా తోడు ఉండదని ఆ మూర్ఖురాలికి తెలిసేలా చేశావ్" అని బామ్మను ప్రశంసిస్తూ, ఆ రూమ్‌లోని క్యాలెండర్లోని ఫోటోలో నుంచి చూస్తూ హాయిగా నవ్వుతున్నారు అమ్మవారు.

# ఎన్నాళ్ళిలా?

డా. మజ్జి భారతి
✆ 9440615206

***ప్రజలను పాలించేవాళ్లే ఎన్నికలలో నెగ్గడానికి యజ్ఞాలు, యాగాలు చేస్తుంటే వాటి మీదంతగా చర్చలుండవేమి? అవి చెయ్యడంలో పాలకులు, ప్రజలకిచ్చే సందేశమేమిటి? బాగా చదువుకున్న వాళ్ళే, బాబాల వెంట పడుతుంటే, సమాజమెటు పోతుంది? ఎన్నాళ్ళిలా? కాస్సేపవన్నీ కూడా పక్కన పెడదాం... ప్రజలకు మీరేమి చెప్పాలనుకుంటున్నారో, అదే ఈ ఊరి పోలేరమ్మ చెప్తుందేమో!***

“ఎందుకమ్మా వర్రీ అవుతావు? నేనలా వెళ్లి, ఇలా వచ్చేస్తాను కదా! ఏదోలే... నాన్న నమ్మకాలు నాన్నవి. కాదనడమెందుకూ? ప్రతిదానికీ నీకేమి తెలుసు? పల్లెటూరి బుద్ధులు పోనిచ్చుకున్నావు కావంటే, నాన్న బాధపడతాడు. కొంచెమర్థం చేసుకో!” అని తెల్లవారకుండానే తండ్రితో, ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊరికి బయలుదేరి వెళ్లి, సాయంకాలానికి శవమై వచ్చిన కొడుకుని చూసి గుండెలవిసేలా ఏడుస్తూనే ఉంది కాంతమ్మ. వద్దంటున్నా తీసుకెళ్లిన భర్తని, తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతూనే ఉంది. ఎన్ని మాటలన్నా, మారుమాట్లాడకుండా కుమిలిపోతున్న భర్తను చూస్తే, ఇంకా కోపమొస్తుంది.

“నీ మూర్ఖత్వంతో, ఎంతో భవిష్యత్తున్న బిడ్డను పొట్టన పెట్టుకున్నావు కదయ్యా? నీ భ్రమగాని మంత్రాలకు చింతకాయలు రాల్తాయా? బాగా చదువుకుంటున్న బిడ్డ. మంచి మార్కులు తెచ్చుకుంటున్నాడు. అటువంటి వాడిని, ఎవడిదో పాదధూళి పడితే, వాడికిక తిరుగుండదని, వాడెక్కడికో వెళ్లిపోతాడని తీసుకెళ్లావు? ఏమైందిప్పుడు? వెళ్లిపోయాడు... వాడెక్కడికో వెళ్లిపోయాడు. మనకందనంత దూరాలకు వెళ్లిపోయాడు. తిరిగిరాని లోకాలకెళ్లిపోయాడు” అని గుండెలు బాదుకుంటూ, ఏడుస్తున్న కాంతమ్మ ఒక్కసారి, దెబ్బతిన్న వృక్షంలా నేలకొరిగింది.

ఏమైందేమైందని అందరూ, ఆత్రుతగా చూస్తుంటే, ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటంలా లేచి, పూనకమొచ్చినట్టు ఊగిపోసాగింది. భయంకరంగా కనుగుడ్లు తిప్పుతూ చూడసాగింది. ఆ చూపెవరి మీద పడితే వాళ్లు కాంతమ్మ కళ్ళల్లో, కళ్ళుపెట్టి చూడాలంటేనే భయపడిపోతున్నారు. కళ్ళల్లోనుండి నిప్పులు కారుతున్నాయా... రక్తం కారుతుందా అన్నంతగా జ్వలిస్తున్నాయా కళ్ళు.

ఇంతలో ఆమె చూపు దూరంగా ఉన్న ఓ కుర్రాడి మీద పడింది. “ఇలా రా” పిలిచింది.

వాడు భయపడి, ముందున్న వాళ్ళ వెనక నక్కాడు. “నేనమ్మనురా... పోలేరమ్మను. భయమెందుకు? సూర్యుడు పోయాడురా. ఇంక చందమామే వెలుగవ్వాలి” అంది శాంతంగా.

దాంతో మరీ బెంబేలెత్తిపోయాడు ఆ పిల్లాడు.

చనిపోయిన వాడి పేరు సూర్యప్రకాష్, ఈ పిల్లాడి పేరు చంద్రకాంత్ మరి. వాడితో వచ్చిన, సూర్యప్రకాష్ క్లాసుమేట్స్ కూడా బిక్కచచ్చిపోయారు. ఆ ఊరికి, పది కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్లో చదువుతున్నాడు సూర్యప్రకాష్. దూరమైనా అక్కడ బాగా చదువు చెప్తారని ఆ స్కూల్లో జాయిన్ చేయించింది కాంతమ్మ. చుట్టూ మూగిన వాళ్ళందరూ ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు, ఆ పిల్లాడి పేరు, కాంతమ్మకెలా తెలుసని?

ఈ ఊరి కుర్రాళ్ళకీ ఆశ్చర్యమే! ఎందుకంటే చందూ ఎప్పుడూ ఈ ఊరు రాలేదు. సూర్య వాళ్ళమ్మెప్పుడూ, వాళ్ల స్కూలుకెళ్లలేదు. పోనీ వాళ్ళిద్దరూ ఫ్రెండ్సేమోననుకుంటే... అదీ కాదు. చందూకి, సూర్యంటే అస్సలు పడదు... చదువులో తనకి పోటీ సూర్యేనని! ఇదెలా సాధ్యం. నిజంగా పోలేరమ్మ ఉందా అన్న అయోమయంలోనే, "చందూ వెళ్ళరా" అని ముందుకు తోసారు వాడిని.



హఠాత్తుగా ఆడవాళ్ళల్లో సందడి మొదలైంది. "చూస్తారేమ్రా! ముర్రాటలు (పసుపునీళ్లు) పట్రండి. పోలేరమ్మ... మనూరి పోలేరమ్మ. లేకపోతే ఆ పిల్లాడి పేరెలా తెలుస్తాది" అంది ఊర్లో పెద్దదైన ఆదెమ్మ. పసుపునీళ్లు పోయించుకున్నాక, "స్కూలుఫస్టే కాదు. జిల్లాకు కూడా ఫస్టొస్తావు. నా మాట పొల్లుపోదురా" అన్న కాంతమ్మతో, "అమ్మా! పోలేరమ్మ తల్లీ! ఊరికేటి, సెప్తావో సెప్పు" అన్న ఆదెమ్మతో "ఏమ్రా! నేను లేనా! మీ బాధలు నాతో చెప్పుకుంటే తీర్చనా! నా మీద నమ్మకం లేదా! వాడెవడి దగ్గరకో వెళ్లారు. ఏమైందో చూశారు కదా! ఇంకోసారి ఇలాంటి తప్పు చెయ్యకండి" అని ఊగిపోతూ, ఊగిపోతూ దబ్బున పడిపోయింది. మరి తెలివి లేదు.

★★★

జిల్లా జనవిజ్ఞాన వేదిక వారి సమావేశము వాడిగా, వేడిగా జరుగుతుంది. దేవుళ్ళు, దెయ్యాలనేవి సైన్సుపరంగా చూస్తే బూటకమని, పూనకం రావడమనేది ఒక మానసిక సమస్యని, దానికి చికిత్స తప్పనిసరిగా తీసుకోవాలని... లేని పక్షంలో ఆ సమస్య జటిలమై, ప్రమాద హేతువు కావచ్చని.. ఆ సమావేశంలో చర్చిస్తున్నారు. అసలీ సమావేశం జరగడానికి ముఖ్యకారణం, జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరానున్న ఊరిలో ఈ మధ్యకాలంలో జరుగుతున్న సంఘటనలు!

ఆరునెలల క్రింద ఆ ఊరి గ్రామదేవత పోలేరమ్మొకరిపై పూని, "బిడ్డా, స్కూలుఫస్టే కాదు జిల్లాకి కూడా ఫస్టొస్తావని" చెప్పిన పిల్లవాడికి రాష్ట్రస్థాయిలో కూడా మూడవ ర్యాంకు రావడం... "నాకు మంచి మార్కులు రావడానికి కారణం పోలేరమ్మ తల్లి మాటలే... ఆరునెలల క్రితం, దొంగబాబా పాద ధూళికి జరిగిన తొక్కిసలాటలో చనిపోయిన నా క్లాస్మేట్, ఎప్పుడూ నా వెన్నంటే ఉండి నాకు ప్రోత్సాహమిస్తున్నాడని చెప్పడం... దానికి మీడియా డిబేట్ల మీద డిబేట్లు పెడుతూ, సైకాలజిస్టుల అభిప్రాయాన్ని తీసుకొని 'మీ ఉద్దేశం ప్రకారం ఆ అబ్బాయికి మానసిక సమస్య ఉన్నట్టా?' అని వారిని ప్రశ్నిస్తూనే, జనాభిప్రాయం ప్రకారం దైవాంశ ఉండొచ్చంటూ... ప్రతి సంవత్సరం జరిగే ఆ ఊరి గ్రామదేవత పండుగకు చాలా ప్రాముఖ్యతనిచ్చి... "ఊర్లో నేనుంటుండగా, ఆ సోములోరు, ఈ సోములోరని పూజిస్తే సహించను. ఏయేటికాయేడు ఆడంబరం పెరుగుతుంది గాని, భక్తి పెరగడం లేదు. ఆడంబరాలు, బలులూ కాదురా, నేను కోరేది. భక్తిరా భక్తి... భక్తితో పెట్టిన పరమాన్నమే నేను తింటాను. వచ్చే ఏడుకల్లా ఈ ఊర్లో స్కూలుండాలని చెప్పిందని," ఆ ఊరి పోలేరమ్మ మామూలు దేవత కాదు, ఆమె చెప్పిన ప్రతిమాటా అక్షరాలా జరుగుతుందనే భావాన్ని, ప్రజలలోకి పరోక్షంగా తీసుకెళ్లడం... జన విజ్ఞాన వేదిక సభ్యులను వ్యాకులతకు, కోపానికి గురిచేస్తోంది బాధ్యతగల మీడియానే, వాటి రేటింగ్ కోసం... ప్రజలకు, మరీ ముఖ్యంగా చదువుకున్న పిల్లలకిటువంటి తప్పుడు సంకేతాలనిస్తే ఎలా అని? చర్చలనంతరం, ఆ ఊరెళ్ళి పోలేరమ్మ పూనిందని చెప్తున్నా వాళ్ళని కలవాలని నిర్ణయానికొచ్చి, ఒక బృందం బయలుదేరింది.

★★★

ఎన్నిసార్లు, ఎన్ని రకాలుగా ప్రశ్నించినా "ఏమో నాకేమీ తెలియదు. ఆ సమయంలో పోలేరమ్మ నా చేతేమి చెప్పిస్తుందో నాకు గుర్తుండదు. వాళ్లు, వీళ్లు అనుకున్నదాన్ని బట్టి, తర్వాత నాకు తెలుస్తుందన్నదే" ఆవిడ మాట. ఆరునెలల క్రితం జరిగిన తొక్కిసలాటలో, తెలివైన ఆమె బిడ్డ చనిపోయాడని ముందే తెలుసు. కాని, ఆవిడ పదవ తరగతి వరకు చదివి మానేసిందని, తెలివైందని, పిల్లాడిని దగ్గర కూర్చోబెట్టి చదివించుకునేదని, బిడ్డ శవముంటుండగానే పోలేరమ్మ పూనిందని, ఇప్పుడా ఊర్లో ఎవరికే సమస్య వచ్చినా, ముగ్గురాటలు పోస్తే పోలేరమ్మ వస్తుందని, పోలేరమ్మ మాట దాటితే, కలలోకొచ్చి మరీ చెప్తుందని... ఇరుగుపొరుగులని అడిగిన సమాచారంతో తెలిసింది.

ఆమె తెలివైనది, బాగా చదివే ఆమె బిడ్డ చనిపోవడం, బలులివ్వొద్దని చెప్పడం, దొంగస్వాములను నమ్మొద్దనడం, స్కూలు కట్టించమనడం... వీటన్నిటినీ, లింకు చేస్తే, ఆమె మానసిక సంఘర్షణకు లోనైందనే విషయం, జరిగిన సంఘటనలకు కారణమనీ తెలిసింది. ఇక చెయ్యాల్సింది ఆమెకు ఆ నిజం చెప్పడం, మూఢనమ్మకాల్లో మునిగిపోయిన ప్రజలకు, ఆమె చేతే ఆ నిజాన్ని చెప్పించడం!

★★★

ఈసారి ఎవరూ లేకుండా, ఆమె ఇంటికి వెళ్లారు. జరుగుతున్న వాటికి ఆమె పడుతున్న మానసిక సంఘర్షణే కారణమని, చికిత్స తీసుకుంటే మంచిదని ఆమెకు చెప్పి ఒప్పించడం, వాళ్ళ ఉద్దేశం! ఎంత చెప్పినా ఆమెదొకటే మాట 'నాకేమీ తెలియదు, నేను బాగానే ఉన్నాను' అని!

మూఢనమ్మకాల ఊబిలో నుండి, ప్రజలను లాగలేకపోతున్నామన్న నిస్పృహ వాళ్ళ కళ్ళల్లో...

వాళ్లను చూస్తుంటే.. ఆరునెలల క్రితం జరిగిన విషయం ఇప్పటికీ కళ్ళకు కట్టినట్టే కనిపిస్తుంది కాంతమ్మకు! ఎప్పటికైనా మర్చిపోగలదా? భర్తకున్న ఆ మూఢనమ్మకంనుండే కదా, బిడ్డను కోల్పోయింది. బిడ్డలనో, భర్తలనో, అయినవారినో పోగొట్టుకున్న తనలాంటి వాళ్ళెంతమందో!

పేదరికం కారణంగా తన చదువాగిపోయింది. ఆశలన్నీ కొడుకు మీద పెట్టుకొని చదివించుకుంటుంది. వాడు కూడా బాగా చదువుతాడు. వాడి క్లాసుకి వాడు, ఇంకొకడే మొదటి రెండు స్థానాల్లో ఉంటారట. "అమ్మా! పేరుకు తగ్గట్టు వాడు చందమామలాగే ఉంటాడు. వాడితో ఫ్రెండ్షిప్ చేసుకుందామనుంది గాని, నేను పోటీ అని, వాడికి నా మీద కోపం! వాడు, నేను ఫ్రెండ్సైతే, ఎంత బాగుంటుందో" అని కొడుకు తనకెన్నిసార్లు చెప్పలేదు?

'పోనీలేరా! పోటీ అనేది చదువు వరకే కాని, మనుషుల మధ్య కాదని పెద్దయ్యాక వాడికే తెలుస్తుంది. అప్పుడు నీతో స్నేహం చేస్తాడంటే' ఎంత మురిసిపోయేవాడో!

ఇప్పుడు వీడిని చూసి, వాడి ముఖంలో ఒక పశ్చాత్తాపభావం... ఇన్నాళ్ళూ వీడిని దూరంగా పెట్టానని. అది చూసి, వాడే చందూ అని గుర్తు పట్టింది తాను. తన అంచనా తప్పవ్వలేదు. ఇక పోటీ లేదని వాడనుకుంటే ఫర్వాలేదు. కాని, ఒకవేళ వాడు చదువుకుంటున్నప్పుడు, సూర్య గుర్తుకొస్తే? ఆ పిల్లాడి ముఖం చూస్తే, రెండోదే నిజమయ్యేటట్టు ఉంది. అప్పుడు పరిస్థితేమిటి? అందుకే, బిడ్డ పోయిన దుఃఖాన్ని దిగమింగుకొని ఆరోజలా చెప్పింది.

రిజల్ట్స్ వచ్చాక వాడు తిన్నగా తన దగ్గరకొచ్చి, "అమ్మా! ఇది సూర్యకి రావలసింది!" అని వాడు వెక్కి వెక్కి ఏడుస్తుంటే, తన దుఃఖాన్ని ఆపుకొని వాడికి సర్ది చెప్పడానికి, ఎంత కష్టపడవలసి వచ్చిందో తనకే తెలుసు. తలుచుకుంటే ఇప్పటికీ కన్నీళ్లు ఏరులై పారుతాయి. బయటకు రాబోతున్న కన్నీటిని బలవంతంగా లోపలే అదిమేసింది. సొంతంగా ఆలోచించే తెలివితేటలు లేని వారికి, మూఢనమ్మకం ద్వారానైనా, కొంత మేలు జరిగితే... అందుకే పోలేరమ్మ అవతారం ఎత్తవలసి వచ్చింది. అవన్నీ వీళ్లకు, వివరించవలసిన పనిలేదు.

★★★

వాళ్లను సాగనంపుతూ ఆమె అన్న మాటలు, "చదువులేని నా బోటివాళ్లకు మంచేదో, చెడేదో చెప్పాలనుకోవడం బాగుంది. చదువుంటే ఆలోచనా పరిధి పెరుగుతుందని, ఆర్థిక పరిస్థితులు బాగా లేనప్పుడు, వాటినుండి తప్పించుకోవడానికి, మూఢనమ్మకాల వైపు జనాలు మొగ్గు చూపుతారని మీ బోటి పెద్దలకు తెలుసు. అందరికీ విద్య అనేది మన విద్యావ్యవస్థలో ఎప్పటినుండో పొందుపరచబడివున్నా, ఎంతవరకు అమలవుతుందనేది మీలాంటి వాళ్లకు తెలుసు. పేదరికం రూపుమాపడానికి అమలు జేసే స్కీముల్లో, ఎన్ని స్కాములో తెలిసిందే.

అదలా పక్కన పెడితే, ప్రజలను పాలించేవాళ్లే ఎన్నికలలో నెగ్గడానికి యజ్ఞాలు, యాగాలు చేస్తుంటే వాటి మీదంతగా చర్చలుండవేమి? అవి చెయ్యడంలో పాలకులు, ప్రజలకిచ్చే సందేశమేమిటి? బాగా చదువుకున్న వాళ్ళే, బాబాల వెంట పడుతుంటే, సమాజమెటు పోతుంది? ఎన్నాళ్ళిలా? కాస్సేపవన్నీ కూడా పక్కన పెడదాం... ప్రజలకు మీరేమి చెప్పాలనుకుంటున్నారో, అదే ఈ ఊరి పోలేరమ్మ చెప్తుందేమో!" ఆ మాటలు అంటున్నప్పుడు, ఓ బాధా వీచిక ఆమె ముఖంలో కనబడింది.

ఏనాటికి తర్కబద్ధంగా ఆలోచించాలనే యోచన ప్రజలలో కలుగుతుంది? ఎన్నాళ్ళిలా? అనే ఆమె ప్రశ్నలు ఇంటికొచ్చినా జన విజ్ఞాన వేదిక సభ్యులను వెంటాడుతూనే ఉంది.

నిజమే... ఎన్నాళ్ళిలా?

# తగిన శాస్తి

సంగనభట్ల చిన్న రామకిష్టయ్య, ధర్మపురి
✆ 9908554535

కథామంజరి బాలకథ

***"ఓ జిత్తుల మారీ! నీవు మరొక అడవి నుండి వచ్చి ఇక్కడ ఉంటానంటే నిన్ను దయతో ఉండమన్నాను. కానీ నీవు ఈ చిన్న జంతువులను భయపెట్టి వినోదిస్తున్నావు. నీవు బుజ్జి కుందేలు, పిల్ల జింక, బుజ్జి కోతి, ఎలుగు పిల్ల మొదలు వాటిని భయపెట్టావు. నీవు వెంటనే నీ అడవికి వెళ్ళిపో ! కొత్తగా వచ్చిన వారిని నమ్మరాదని ఊరకే అనలేదు పెద్దలు! అది నీ పట్ల నిజమైంది!"***

సుందరవనం అనే అడవిలో కేసరి అనే సింహం జంతువులను చక్కగా పాలించేది. దాని పాలనలో అడవిలో ఉన్న అన్ని జంతువులు ఎంతో కలిసిమెలిసి ఉండేవి. ఇలా ఉండగా ఆ అడవికి, ప్రక్క అడవినుండి కొత్తగా ఒక నక్క వచ్చింది. అది సింహాన్ని కలిసి, ఈ అడవిలో తనని ఉండడానికి అనుమతించమని వేడుకుంది. అందుకు సింహం అంగీకరించింది. ఇలా కొన్ని రోజులు గడిచాయి.

ఒకరోజు ఆ నక్కకు దుర్బుద్ధి పుట్టింది. అది అప్పుడే బొరియనుండి బయటకు వచ్చిన ఒక బుజ్జి కుందేలును "అదిగో! చిరుతపులి" అని భయపెట్టింది. వెంటనే ఆ బుజ్జి కుందేలు బొరియలోకి పరిగెత్తింది. నక్క దాని భయాన్ని చూసి పకపక నవ్వింది. ఆ తర్వాత మరొక రోజు, ఆ నక్క ఒక పిల్లజింకను "అదిగో! పెద్దపులి" అని భయపెట్టింది. వెంటనే ఆ పిల్లజింక అక్కడ నుండి భయంతో పరుగులంకించుకుంది. దాన్ని చూసిన నక్క విరగబడి నవ్వింది. ఆ తర్వాత అది ఒక బుజ్జికోతిని "అదిగో! సింహం" అని భయపెట్టింది. ఆ కోతి పరుగున చెట్టుపైకి వెళ్లి తల్లి ఒడిలో దూరింది. మరొక రోజు ఈ నక్క... అక్కడే నీరు త్రాగుతున్న ఓ ఎలుగుబంటి పిల్లను "బుజ్జీ! ఈ నీటిలో మొసలి ఉంది"అని భయపెట్టి, దానిని నీరు త్రాగకుండా చేసింది. అది భయపడి పరిగెత్తుకొని వెళ్లి, తన తల్లికి ఈ విషయం చెప్పింది. నిజానికి ఆ మడుగులో మొసలి లేదన్న సంగతి అన్ని జంతువులకు తెలుసు. అప్పటి నుండి అన్ని జంతువులు ఈ నక్కను చూస్తే చాలు గజగజ వణికేవి. అది అన్నింటినీ ముఖ్యంగా జంతువుల పిల్లలను చాలా భయపెట్టేది. ఈ సంగతి ఆ జంతువుల తల్లులకు తెలిసినప్పటికిని, సింహమే దాన్ని ఇక్కడ ఉండమన్నది కనుక... అవి ఏమీ మాట్లాడకుండా మిన్నకుండిపోయాయి.

ఇలా ఉండగా ఒకసారి సింహం బిడ్డ యువరాజు పుట్టినరోజు వేడుక జరిగింది. సింహం ఆ వేడుకకు అన్ని జంతువులను ఆహ్వానించింది. అన్నింటితో పాటు ఆ విందుకు నక్క కూడా హాజరైంది. అన్ని జంతువులు యువరాజు సింహానికి ఇవ్వడానికి, తమ తమ విలువైన కానుకలను పట్టుకెళ్ళాయి. నక్క కూడా చాలా గొప్పగా ఒక బంగారు కడియాన్ని తీసుకొని

వెళ్లి సింహం బిడ్డకు బహూకరించబోయింది. అది చూసిన మృగరాజు దానిని తీసుకోవద్దని, ఆ నక్కకే తిరిగి ఇచ్చివేయమని తన బిడ్డతో చెప్పింది. ఈ మాటకు జంతువులన్నీ ఆశ్చర్యపోయాయి.

అప్పుడు సింహం "ఓ నక్కా! ఈ బంగారు కడియం ఎక్కడ నుండి దొంగతనంగా తెచ్చావు? ఇటువంటి దొంగసొమ్ము నా బిడ్డకు నీవు బహూకరిస్తావా! దొంగతనం తప్పు అని నీకు తెలియదా! ఎక్కడనుండి తెచ్చావో నిజం చెప్పు!" అని దాన్ని నిలదీసింది.



అప్పుడు నక్క ఆశ్చర్యపోయి "మృగరాజా! నన్ను మన్నించండి. నా తప్పును క్షమించండి. మరొకసారి ఇటువంటి చెడ్డపని చేయను" అని వేడుకొంది. తాను దొంగతనం చేసిన సంగతి సింహానికి ఎలా తెలిసిందని నక్క ఆశ్చర్యపోయింది.

అప్పుడే అక్కడికి వచ్చిన ఒక ముసలికోతి సింహంతో "మృగరాజా! నేను వృద్ధురాలినయ్యాను. మీరు నన్ను గతంలో ఎన్నోసార్లు కాపాడారు. మన యువరాజుకు తగిన కానుకను నేను తేలేక పోయాను. మీకు ఇష్టమైన ఈ వెదురు పిల్లనగ్రోవిని తెచ్చాను. ఏదో పేదరాలను!" అని అంది.

అప్పుడు జంతువులన్నీ అది తెచ్చిన కానుకను చూసి నవ్వాయి. సింహం వాటిని వారించి, ఆ కోతితో "ఓ వానరమా! నీవు చాలా మంచిదానివి. నీవు దొంగలను తరిమినందుకు ఒక దయాశాలి సంతోషంతో నీకు బహుమతిగా ఇచ్చిన ఈ బంగారు కడియాన్ని, ఈ నక్క దొంగతనంగా ఎత్తుకొని వచ్చిందని నాకు తెలుసు. నీకు కండ్లు సరిగా కనబడవని కూడా నాకు తెలుసు. అందుకే ఈ నక్క కానుకను తిరస్కరించాను. నీవు తెచ్చిన పిల్లనగ్రోవి అంటే నాకు చాలా ఇష్టం. నాకు దాని సంగీతం వినడం అంటే కూడా చాలా ఇష్టమని నీకు తప్ప మరెవ్వరికి తెలియదు. నేను నీవు ఆ పిల్లనగ్రోవి వాయించేటప్పుడు అది విని తన్మయత్వం చెందాను. తర్వాత నాకు కూడా ఈ విద్యను నేర్పమని నీతో చెప్పాను. గుర్తుందా! నా బిడ్డ కోసం నీవు దీనిని పట్టుకుని వచ్చావు. చాలా సంతోషం!" అని అంది.

తర్వాత అది నక్కతో "ఓ జిత్తుల మారీ! నీవు మరొక అడవినుండి వచ్చి ఇక్కడ ఉంటాననంటే నిన్ను దయతో ఉండమన్నాను. కానీ నీవు ఈ చిన్న జంతువులను భయపెట్టి వినోదిస్తున్నావు. నీవు బుజ్జికుందేలు, పిల్లజింక, బుజ్జికోతి, ఎలుగుపిల్ల మొదలు వాటిని భయపెట్టావు. నీవు వెంటనే నీ అడవికి వెళ్ళిపో! కొత్తగా వచ్చిన వారిని నమ్మరాదని ఊరకే అనలేదు పెద్దలు! అది నీ పట్ల నిజమైంది!" అని అంది.

అప్పుడు నక్క తలవంచుకొని తన అడవికి తిరిగి వెళ్ళిపోయింది.

తర్వాత జంతువులన్నీ "మృగరాజా! మీకు ఈ సంగతి ఎలా తెలుసు?" అని ప్రశ్నించాయి.

అప్పుడు సింహం నవ్వి " నేను ఆ నక్కను నమ్మకుండా, రహస్యంగా దానిని ఒక కంట కనిపెట్టమని ఆకాశంలో ఎగిరే ఒక కాకి, నీటిలో ఉండే ఒక కప్ప, నేలపైన తిరిగే జింకలను రహస్యంగా నియమించాను. ఆ సంగతి ఎవ్వరికీ తెలియదు. అవి నా వద్దకు వచ్చి ఈ సంగతులన్నీ తెలిపాయి. ఈ కోతి బంగారు కడియాన్ని దొంగతనం చేసినట్లు నాకు ఆ కాకి చెప్పింది" అని అంది.

దాని మాటలకు జంతువులన్నీ ఆశ్చర్యపోయి ఆ నక్కకు తగిన శాస్తి అయిందని సంతోషించాయి.

# ధర్మయుద్ధం

అద్వైత్ షణ్ముఖ్ ఊటుకూరు (7 వ తరగతి)
అమెరికాలోని కాలిఫోనగరం

కథామంజరి బాలకథ

***సమర శంఖం పూరించారు. యుద్ధం ప్రారంభం అయింది, ఇరువైపు సైనికులు చాలా గాయాల పాలవుతున్నారు. ఎక్కడ చూసినా రక్తం. కళ్ళు పెద్దగా చేసి కోట లోపలికి పరిగెత్తాడు, కానీ భయంతో కాదు! యువుడు వంటగది లోపలికి వెళ్లి, ఒక పెద్ద నీళ్ళ కూజా నింపి, యుద్ధరంగంలోనికి పరుగులు పెట్టాడు. మూడు రోజుల సుదీర్ఘ యుద్ధం అయ్యాక, యువుడు అటూ ఇటూ గమనిస్తూ ఉన్నాడు. రాజా వీరశక్తిని గమనించాడు. అతను రథంలో పడిపోయి ఉన్నాడు.***

"యువా, యువా!" అని యువుడి అమ్మ అనసూయాదేవి పిలిచింది.

"ఇక్కడే ఉన్నాను అమ్మా! నేను నీకు నీళ్ళు కడవలో నింపి, ఆ తరవాత అడవికి వెళ్లి శివయ్యకు పూజ చేసి వస్తాను" అని యువుడు అన్నాడు.

"సరే! సరే, జాగ్రతగా వెళ్ళు" అని అనసూయాదేవి అన్నది.

"ఆ శివయ్య ఉండగా నాకు ఏమి భయం లేదు అమ్మా!" అని, యువుడు అడవికి బయలుదేరాడు.

యువుడి చిన్నప్పుడు, అతని తండ్రి ఊరిలోని జమీందారు దగ్గర అప్పు తీసుకుని, చెల్లించక ముందే చనిపోయాడు. దీనితో యువుడి తల్లికి ఆ అప్పు తీర్చవలసిన పరిస్థితి వచ్చింది. 'ఇవ్వకపోతే యువుడిని చంపేస్తాము అని భయపెట్టారు కూడా! దానితో అనసూయాదేవి, రాజా శ్యామశక్తి రాజ్యం వైలెంపాలెంకి పారిపోయింది. రాజుగారికి యువుడు అంటే చాలా ఇష్టం. తనకి రాజ్యంలో ఎవరూ లేరని, అప్పుడప్పుడు యువుడినే రాజుని చేస్తాను అని, మాటవరసకు అనే వారు. రాజుగారి తండ్రి చనిపోతూ తనకి, తన అన్నయ్య వీరశక్తికి, రాజ్యాన్ని పంచాడు. తనకి తక్కువ భూమి వచ్చిందని వీరశక్తికీ అసూయతో రక్తం ఉడికింది. దీనితో ఆ రెండు రాజ్యాల మధ్య యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి.

యువుడి తల్లి అనసూయాదేవి చాలా భయస్తురాలు! చిన్న చీమకే భయపడే ఆవిడ... యుద్ధం అనేసరికి చాలా భయపడిపోయింది. అందుకనే శ్యామశక్తి రాజుగారు, అనసూయాదేవికి అడవిలో ఒక చిన్న గుడిసె ఇచ్చి, అక్కడే ఉండమన్నారు. అనసూయాదేవి అప్పటి నుంచి అక్కడే కొడుకుతో ఉంటుంది.

ఒకరోజు యువుడు ఎప్పటిలాగా అడవికి వెళ్లి పూజ చేసుకుంటుంటే, ఒక పులి గర్జన వినిపించింది. అది విని యువుడు వణికిపోయాడు "శివయ్యా! నీపై నమ్మకంతో ఈ అడవికి వచ్చాను. నన్ను కాపాడు." అని దండం పెట్టుకున్నాడు. వెంటనే

ఆ గర్జన ఆగిపోయింది. "శివయ్యా, నన్ను కాపాడావా?" అని యువుడు తనలో తాను అనుకున్నాడు. ఉన్నట్లుండి పొదలనుంచి చారలపులి యువుడు మీదకి దూకబోయింది. దీనితో యువుడు గుండె ఆగిపోయినట్లు అనిపించింది. కళ్ళు మూసుకుని చేతులు అడ్డంపెట్టాడు. ఒక మూడు క్షణాలు ఆగి, కళ్ళు తెరిచాడు. పక్కన చూస్తే పులి దెబ్బతిని, రక్తంతో పడివుంది. యువుడు శివయ్యకి దండం పెట్టుకొని అటూ, ఇటూ చూశాడు. అక్కడనుండి వీరశక్తిరాజు, రెండు చెట్ల మధ్య నుంచి వచ్చాడు. తన దగ్గర, నగలు మరియు ఒక కత్తి ఉంది. దానితో పాటు ఒక బాణము కూడా ఉంది.

రాజును చూసి యువుడు ఉలిక్కిపడ్డాడు. యువుడు వణుకుతూ, "మీరు ఎవరో నాకు బాగా తెలుసు." అంటూ మెల్లిగా వెనకకు జరిగాడు. వీరశక్తి రాజు నవ్వి, "మిత్రమా! భయపడకు! నీకు నా గురించి, నా తమ్ముడు ఏమి చెప్పాడో నేను ఊహించగలను!" అన్నాడు.



దానికి యువుడు 'అవును' అని తల ఊపాడు.

వీరశక్తి రాజు నవ్వి, "నీకు ఒకటి చూపిస్తా రా!" అని యువుడికి చెయ్యి అందించి, అడవి బయటకు తీసుకు వెళ్ళాడు. కొంతదూరం నడిచాక యువుడికి ఎక్కడికి వెళుతున్నారో అర్థమయ్యింది.

"శ్యామశక్తి రాజు గారి కోటలో ఏమి చేయబోతున్నాము?" అని యువుడు అడిగాడు.

"చూపిస్తాను కదా" అని వీరశక్తిరాజు అన్నాడు.

అప్పుడు వీరశక్తి యువుడికి ఒక దూత వేషం వేసి శ్యామశక్తి కోటలోనికి తీసుకొని వెళ్ళాడు. ఆ బయట ఉన్న సైనికులు వీరశక్తిరాజుని చూసి, "రాజా శ్యామశక్తి, మీ తోబుట్టువు, తన దూతతో వచ్చారు!" అని చెప్పాడు.

యువుడి అమాయకపు చూపులకి "ఏమిటీ, నీ దూతకి రాజ్యసభ కొత్తనా? అటూ ఇటూ చూస్తున్నాడు" అని శ్యామశక్తి అన్నాడు.

వీరశక్తి చిరునవ్వుతో, "నీ రాజ్య ప్రజలకి, అబద్ధాలు చెప్పి, నీతో యుద్ధంలో పోరాడమంటావా?" అని అడిగాడు. "అవును, నాన్నగారు నాకిచ్చిన భూమితో పాటు నీ భూమి కలిపితే, నేను చాలా బలవంతుడిని అవుతాను. ఎదుటివాళ్ళు నన్ను చూసి భయపడతారు" శ్యామశక్తి అన్నాడు.

దీనితో యువుడికి నిజమైన రంగు అర్థం అయ్యింది. యువుడు తన వేషం తీసి చూపించాడు.

రాజా శ్యామశక్తి మొహం ఎర్రబడింది. "ఏమి యువా? వీడితో నువ్వు పనిచేస్తున్నావా?"

యువుడు చాలా బాధగా శ్యామశక్తిని చూసాడు "రాజా, మీరు నాకు విద్య నేర్పించారు, ఇల్లు ఇచ్చారు, తిండి పెట్టారు, కానీ నేను అధర్మానికి పోరాడలేను, నన్ను మన్నించండి. మీకు నా చివరి ఊపిరి దాకా నేను ఋణపడి వుంటాను. క్షమించండి రాజా!" అని వెనక్కి చూడకుండా వీరశక్తితో బయటకి నడిచాడు.

అలా రాజ కోట నుంచి బయటికి వచ్చాక, యువుడు వీరశక్తి ముందు మోకాళ్ల మీద పడి, "రాజా వీరశక్తి, నేను ఇప్పటిదాకా రాక్షసుడి భూమిలో బతుకుతున్నాను కానీ, మీరు నాకు నిజాన్ని చూపించారు. నన్ను పులినుంచి కాపాడారు, చెప్పండి నన్ను ఇప్పుడు ఏమి చేయమంటారు?" అన్నాడు.

"యువా, విన్నావు కదా! శ్యామశక్తి, నాతో నా ప్రజలతో పోరాటం చేస్తాడు. నువ్వు కూడా పోరాడు. ఒక మంచి సైనికుడివి అవ్వు!" అని వీరశక్తి అన్నాడు.

"రాజా! నేను యుద్ధంలో పోరాడలేను. నేను ఎప్పుడు కత్తి పట్టుకోలేదు. అదీకాక మా అమ్మని చూసుకోవాలి" అని యువుడు అంటాడు.

వీరశక్తి ఒక నిమిషం ఆలోచించాడు. "యువ! నాకు సైనికులు ఉన్నారు, కానీ వీరులు అంటే యుద్ధంలో కత్తి మాత్రమే కాదు, యుద్ధరంగంలో అవసరం అయినప్పుడు, దెబ్బతిన్న సైనికులకు మంచి నీళ్ళు ఇచ్చేవారు కూడా మంచి యోధులే!" అన్నాడు.

దానికి యువుడు సరేనని ఒప్పుకున్నాడు.

మూడు రోజులు గడిచాయి, యువుడు ఇంటికి వెళ్ళి, "అమ్మా! మన్నించండి, నేను మూడు రోజులనుండి ఇంటికి రాలేదు. రాజా వీరశక్తి రాజ్యంలో ఇప్పటిదాకా ఉన్నాను."

అనసూయాదేవి కంగారుతో కళ్ళు పెద్దగా చేసి, "ఏమిటీ? ఆ రాక్షసుడితో ఉన్నావా?" అని గట్టిగా అడిగింది. యువుడు అనసూయాదేవికి జరిగిందంతా చెప్పాడు.

దీనితో అనసూయాదేవి భయపడింది. "యువా! నువ్వు యుద్ధంలో పోరాడలేవు, కానీ ధర్మానికి కదా ఈ యుద్ధం! సరే, జాగ్రత్తగా వెళ్ళిరా." అంది.

"అమ్మా! నువ్వు కూడా నాతో రా! రాజా శ్యామశక్తి దగ్గర ఉండటం నీకు ప్రమాదం." అని అన్నాడు. అనసూయాదేవి తన వస్తువులు అన్ని పెట్టెలో పెట్టుకుని యువుడితో బయలుదేరింది.

రాజుగారు యుద్ధం మొదలయ్యే ముందు అందరిని ఒక చెట్టు దగ్గరకు పిలిచారు. "సైనికులారా! యుద్ధం అంటే ఏమిటి?" అని అడిగారు.

"కత్తులతో పొడిచి చంపడము కదా?" అని ఒకడు అన్నాడు.

రాజా వీరశక్తి నవ్వి, "కాదు ఇంకెవరైనా చెపుతారా?" అని అడిగాడు.

"వేరే రాజ్యాలని లాక్కోవడం?" అని ఒకరు చెప్పారు.

రాజా వీరశక్తి, "మీకెవ్వరికీ యుద్ధం అంటే ఏమిటో తెలీదు! పోరాటం అంటే ఏమిటో అసలుకే తెలియదు!" అని గట్టిగా అన్నాడు. అందరూ ఒకరిని ఒకరు చూసుకున్నారు. "యుద్ధం అంటే ధర్మం కోసం పోరాడడం. పోరాటం అంటే మంచి మనసుతో అందరికి సహాయం చేస్తూ చెడ్డవాళ్ళని ఓడించడం." అని రాజా వీరశక్తి అన్నాడు. అందరూ తప్పుని తెలుసుకుని కిందకి బాధతో చూసారు. అందరూ ఒక్కసారిగా, "రాజా వీరశక్తికి జయహో," అని అరిచారు.

సమరశంఖం పూరించారు. యుద్ధం ప్రారంభం అయింది, ఇరువైపుల సైనికులు చాలా గాయాల పాలవుతున్నారు. ఎక్కడ చూసినా రక్తం. కళ్ళు పెద్దగా చేసి కోట లోపలికి పరిగెత్తాడు, కానీ భయంతో కాదు! యువుడు వంటగది లోపలికి వెళ్లి, ఒక పెద్ద నీళ్ళ కూజా నింపి, యుద్ధరంగంలోనికి పరుగులు పెట్టాడు. మూడురోజుల సుదీర్ఘయుద్ధం అయ్యాక, యువుడు అటూ ఇటూ గమనిస్తూ ఉన్నాడు. రాజా వీరశక్తిని గమనించాడు. అతను రథంలో పడిపోయి ఉన్నాడు. యువుడు ఏమి ఆలోచించకుండా దగ్గరకి పరిగెత్తాడు. తన మొహం మీద నీళ్ళు పోసి రాజుగారి రథం ఎక్కాడు.

ఇది రాజా శ్యామశక్తి చూసి, "వాడు నాకు వెన్నుపోటు పొడిచాడు, ఇక వాడిని బంధించండి." అన్నాడు.

అందరూ బాణాలతో యువుడి మీద దాడి చేసారు. యువుడు తప్పించుకుని, కోట లోపలికి వెళ్ళాడు రాజా వీరశక్తిని భుజం మీద ఎక్కించుకుని, వైద్యుడి దగ్గరికి తీసుకువెళ్ళాడు.

వీరశక్తి, శ్యామశక్తి మధ్య చాలా రోజులు యుద్ధం జరిగింది. రాజా వీరశక్తి ధర్మబద్ధంగా యుద్ధం గెలిచాడు. ఆ యుద్ధంలో ఎంతో మంది వీరమరణం పొందారు. రాజా వీరశక్తి తన రాజ్యంలో ప్రజలకి అన్నీ మంచి పనులు చేపట్టాడు.

రాజా వీరశక్తి తన సైనికులు అందరిని కోట లోపలకి పిలిచి "వీరులారా, సైనికులారా యుద్ధంలో మీరు చూపిన ధైర్యం నేను మెచ్చుకుంటున్నాను. మీ శక్తిసామర్థ్యాలతో మనము ఈ కొత్త రాజ్యాన్ని స్థాపించుకున్నాము." అని అన్నాడు. దానికి చాలా ఉత్సాహముగా అందరు "వీరశక్తికి, జై" అని అరిచారు. వీరశక్తి "నా ప్రజల కోసం, నా చివరి ఊపిరి దాకా పోరాడుతాను. మీ శ్రేయస్సు కోసం పాకులాడుతాను. మన రాజ్యం నీతి, నిజాయితీకి, ధర్మానికి పెట్టిందే పేరు అని అనిపించుకుందాము! యుద్ధంలో మంచి ధర్మాన్ని పాటించిన యువుడిని, నేను మన రాజ్యానికి ఆంతరంగిక సలహాదారుడిని చేస్తున్నాను" అని ప్రకటించాడు.

# వెన్నెల కురిసిన రాత్రి

అక్కినాపల్లి సుబ్బారావు
✆ 9490679574

**విశిష్ట అతిథి కథ**

***మన మనసులో ఉన్నదానికి ఏదైనా వ్యతిరేకంగా జరిగితే మనం అది నిజమైనా నమ్మడానికి ఇష్టపడం. ఫ్రెంచ్ యువతి. రాత్రి అనగానే.. ఒకటే మన మనసులోనికి వెళ్తుంది. ఆమె గురించి మనకి ఏమీ వివరంగా తెలియకపోయినా, వాళ్ల నైతిక విలువల మీద మనకి చిన్న చూపు, ప్రతి స్త్రీ అలాంటిదే అని నమ్మకం!***

'దాని సంగతేం గాని తెలుపురంగు పిల్ల ఎంత బాగుందో చెప్పు గురూ!' అన్నాడు రాజు.

'అంతేనా? నేను చెప్పినది నమ్మవా?' అని తిరిగి ప్రశ్నించాడు రావ్.

'అఫ్‌కోర్స్ నేను నమ్మను' అని రాజు అంటుండగా అమీర్, దాసు లోపలికి వచ్చి సర్దుకున్నారు.

'ఏమిటి నమ్మవు రాజూ?' అని అడిగాడు అమీర్.

రాజు, రావు వైపు చూశాడు – సమాధానం చెప్పనా? వద్దా? అని. సమాధానం చెప్పకుండా రావు పేకముక్కలు తీసి పంచనారంభించాడు. ముక్కలు చేతిలోనికి తీసుకుంటూ 'రావు ఒక రమ్యమైన సంఘటన చెప్పాడులే, దానిని నమ్మమంటాడు' అన్నాడు రాజు తిరిగి.

'నోబిడ్' అన్నాడు రావు.

'నోబిడ్' అన్నాడు రాజు.

'నోబిడ్' అన్నాడు అమీర్.

'నోబిడ్' అని దాసు ముక్కల్ని కింద పడేసి రావు వైపు తిరిగి, 'చెప్పండి రావు గారూ, మేమూ వింటాం' అన్నాడు. దాసుకి తతిమ్మా ముగ్గురితో ఈ మధ్యనే పరిచయం అయింది.

'తప్పుతుందా మరి కానీయ్' అన్నాడు అమీర్ చిరునవ్వు చిందిస్తూ.

'ఒకసారి ఇటలీకి కాన్ఫరెన్స్‌కి వెళ్లేటప్పుడు పారిస్‌లో దిగేను. అక్కడ నుంచి నీస్ వచ్చి మిలాన్ చేరుకుందామని ప్లాన్. ట్రైన్‌లో ప్రయాణం చేయాలని నిశ్చయించుకున్నాను. మీకు తెలిసే ఉంటుంది, పేరిస్ నుంచి లియెన్‌కు ఒక అత్యద్భుతమైన సూపర్‌ఫాస్ట్ ట్రెయిన్ ఉందని. అది సాయంత్రం నాలుగు గంటలకి పేరిస్‌లో బయలుదేరి, రాత్రి పది గంటలకి లియెన్ చేరుతుంది. ఆ ట్రెయిన్‌లో ప్రయాణం చేస్తుంటే నా ప్రక్క సీట్లో ఒక ఫ్రెంచ్ యువతి కూర్చుని ఉంది' అని ఆగాడు రావు.




'ఏమాత్రం వయస్సు ఉంటుందేమిటి? బాగుందా? బాగుండకపోవడమేమిటిలే? లోకల్ డ్రస్‌లో ఉందా?' అనడిగాడు అమీర్.

'నన్ను చెప్పనిస్తే అవన్నీ తెలుస్తాయి. ఆమె వయస్సు దాదాపు ముప్ఫయి – ముప్పై రెండు ఉంటుంది. యూరోపియన్ల తెలుపు. డ్రెస్ మీద కోటు వేసుకుంది. బాగుందా? లేదా? అన్నది ఒక్కొక్క మనిషిని బట్టీ మారుతూ ఉంటుంది కదా. బాగుందనే చెప్పాలి. ట్రెయిన్ కదలిన దగ్గరనుంచి ఏదో థీసిస్ తీసి తప్పుల్ని దిద్దుతోంది. బయట ఉన్న సీనరీని, బోగీలో ఉన్న మిగతా జనాభాని మార్చి మార్చి చూస్తూ రెండుగంటలు గడిపేను. బయట చీకటి పడింది. ఇహ బయటకి చూడటానికి ఏమీ కనిపించకపోవడంతో, ఆమె చేస్తున్న పనిని పరీక్షించసాగాను. ఇంతలో బేరర్ వచ్చి 'డిన్నర్ కావాలా?' అనడిగితే, ఆమె వైన్ మాత్రం ఆర్డరిచ్చి, చేతి సంచిలోంచి సాండ్విచ్ తీసి భోజనం కానిచ్చింది. నేను తినడం పూర్తయ్యేసరికి ఏడున్నర అయింది. ఆమెతో మాట్లాడదామని ఉంది, కాని ఆమె అవకాశం ఇవ్వడం లేదు. తన పనిని తను చకచకా చేసుకుని ఆఖరికి ఎనిమిదిన్నరకి కాబోలు పుస్తకాన్ని లోపలికి పెట్టింది' అని కథని ఆపి లోపలికి వెళ్ళాడు రావు.

'గురూ, మనవాడు గ్రంథసాంగుడే, ఇదివరలో దీనిగురించి మనకి చెప్పలేదే...' అన్నాడు అమీర్.

'మీరు సాంతం వినకుండా అలా అనడం ఏం బాగాలేదు' అన్నాడు రావు తీవ్రంగా.

'కోపం తెచ్చుకోకు, ఊ! కానీయ్' అన్నాడు అమీర్, రావుని శాంతపరుస్తూ.

'మెల్లిగా సంభాషణ లోనికి దింపేను. ఆమె కెనడాలో ఎమ్. ఎస్. చేసి వచ్చేక లయెన్‌లో ఇంజనీరుగా పనిచేస్తోందని చెప్పింది. నేనూహించినట్టుగా అదొక ఎమ్. ఎస్. థీసిస్. ఫ్రాన్స్‌లో ఆచార వ్యవహారాలు, ఉద్యోగవేతనాలు వగైరా వగైరా గురించి చాలా చెప్పేక నా గురించి అడిగితే చెప్పాను నీస్ వెళ్తున్నానని.'

'ఈ ట్రయిన్ లయెన్‌కి రాత్రి పది గంటలకి చేరుతుంది. మీకు తెల్లవారుఝామున రెండుకి గాని బండి లేదు' అందామె.

'అవును' అని సమాధానం చెప్పేను నేను.

'లయెన్‌లో చూడడానికి చాలా ఉన్నాయి. ఇంతవరకూ వచ్చేరు కాబట్టి ఒక పూట లయెన్‌లో ఆగి, ముఖ్యమైనవి చూసి రేపు సాయంకాలం నీస్ వెళ్ళండి' అంది ఆమె.

'లాభం లేదు. నా ప్రోగ్రాం అంతా నిశ్చయమైపోయింది. అక్కడ కాన్ఫరెన్స్‌కి అందుకోవాలంటే ఇది కుదరదు' అన్నాను.

'అయ్యో!' అని కాస్సేపు విచారపడి ట్రైన్ లయెన్ స్టేషన్ లోనికి చేరబోతుంటే, 'మీకు అభ్యంతరం లేకపోతే రెండు గంటల్లో లయెన్‌లో ఉన్న ముఖ్యమైన ప్రదేశాలు మీకు చూపిస్తాను. మీకు పెద్ద లగేజీ లేదు కదా?' అని అడిగింది — రావ్ అందరి వంక చూసేడు.

'నీ రొట్టె విరిగి నేతిలో పడిందనుకుని సరే, అని ఉంటావు వెంటనే' అన్నాడు అమీర్.

'అక్కడే నువ్వు పొరపడ్డావు. ఆ క్షణంలో నాలో ఉదయించిన ప్రశ్నలు – ఈమె నేనంటే ఇంట్రెస్ట్ ఎందుకు చూపిస్తోంది? ఊరు చూపిస్తానని నన్ను ఎక్కడికైనా తీసుకెళ్ళి తెలిసిన వాళ్ళతో చితకబాదిస్తుందా? అయినా మేకపోతు గాంభీర్యాన్ని వలకపోసి, 'అబ్బే! ఎందుకు, అనవసరంగా మీకాశ్రమ?' అన్నాను.'

'నువ్వు ఒట్టి అర్భకుడివి గురూ, లేకపోతే అలా ఎవరైనా ఆలోచిస్తారేమిటి?' అన్నాడు రాజు.

'మరెలా ఆలోచిస్తారేమిటి?' అని అడిగాడు రావ్.

'అంతకన్నా ఏ యువతైనా ఏం ఆహ్వానిస్తుంది? అందులో ఫ్రెంచ్ యువతి! పరిస్థితులని ఉపయోగించుకోకుండా పిరికి ఆలోచనలేమిటి?' అనడిగాడు రాజు.

'దీనిలో శ్రమేముంది?' అని స్టేషన్‌లో పార్క్ చేసిన కారు తీసుకొచ్చింది. నేను పెట్రోల్ పోయిస్తానన్నా ఒప్పుకోలేదు. కారుని చాకచక్యంగా నడుపుతూ, రెండు మూడు ప్రదేశాలు చూపించేక, కారుని ఒకచోట ఆపి, 'ఇక్కడ రోడ్లు ఇరుకుగా ఉంటాయి, నడుద్దాం' అంది. అనుకున్నంతా జరగబోతుందనుకుని, దిగి ఆమెతో బెరుకుగా నడక ప్రారంభించేను. సందుల్లోంచి నడుస్తుంటే కనిపిస్తున్న చర్చిలని, ఇతర ముఖ్య ప్రదేశాలు చూపిస్తోంది. రోడ్డుమీద యువతీయువకులు, జంటలు జంటలుగా చెట్టాపట్టాలేసుకుని, అప్పుడప్పుడు ఆగి ముద్దులు పెట్టుకుంటూ కదిలి వెళ్తున్నారు. 'క్యాబరే — క్యాబరే' వగైరా బోర్డులు ఉన్నాయి. మేము రోడ్డు మీద నడుస్తుంటే ఒక కారు వెనకాతలనుంచి వేగంగా రావడం చూసి ఆమె నన్ను పేమెంట్ మీదకి లాగింది.

'థాంక్స్' అన్నాను సిగ్గుపడి. అదొక పౌర్ణమి రాత్రి. పున్నమివెన్నెలలో ఆమె జామపండు రంగులా మిలమిల మెరుస్తోంది. విచ్చుకున్న మందారంలా నవ్వింది ఆమె. మనసు వశం తప్పబోతుంటే తమాయించుకుని, 'మనం ఒక కప్పు కాఫీ తాగుదామా?' అని అడిగాను ధైర్యం చేసి.

'ష్యూర్' అంది. రోడ్డు మీద నిలబడి కాఫీ త్రాగాం. నేను డబ్బు ఇవ్వబోతే, నా చేయిని పట్టుకుని 'నువ్వు నా అతిథివి' అని తనే డబ్బు తీసి ఇచ్చింది. మరొక అరగంట తిరిగేక స్టేషన్‌లో నన్ను వదిలి, కరచాలనం చేస్తూ, 'మీ యాత్ర సఫలంగా జరగాలి' అని వెళ్ళిపోయింది ఆమె. ఆమె పేరుగాని, ఎడ్రస్ గాని నాకు తెలియదు. నా పేరైనా ఆమె అడగలేదు. స్టేషన్‌లోకి నడిచి, రెస్ట్‌రూమ్ లోనికి వెళ్లి అద్దంలో చూసుకుంటే, నా ప్రతిబింబం నాకే పరమవికృతంగా కనిపించింది. ఆమె గురించి చెడుగా ఊహించినందుకు నన్ను నేనే చంపేసుకోవాలనిపించింది' అని కథ ముగించాడు రావ్.

'రావు నిజం చెప్పడం లేదు. దీనిలో ఏదో తిరకాసుంది. ఆమె ఎందుకు అలా సహాయం చేస్తుంది? అసంభవం! నువ్వు ఆమెకు డబ్బు ఇచ్చి ఆ రెండు గంటలు జల్సా చేసి ఉంటావు. మేము ఏమైనా అనుకుంటామని అలా మార్చావు. నేన్నమ్మను' అన్నాడు అమీర్.

'అదే నేను అన్నది' అన్నాడు రాజు వంత పలుకుతూ.

'ఏదైనా అలా జరిగి ఉంటే ఈ సంఘటన గురించి మీకు ఎందుకు చెబుతాను?' అని అడిగాడు రావ్.

'మరి ఎందుకు ఆమె నువ్వంటే అంత ఇంటరెస్ట్ తీసుకుంది?' అని ఊరించాడు రాజు.

'మన మనసులో ఉన్నదానికి ఏదైనా వ్యతిరేకంగా జరిగితే మనం అది నిజమైనా నమ్మడానికి ఇష్టపడం. ఫ్రెంచ్ యువతి. రాత్రి అనగానే ఒకటే మన మనసులోనికి వెళ్తుంది. ఆమె గురించి మనకి ఏమీ వివరంగా తెలియకపోయినా వాళ్ల నైతికవిలువల మీద మనకి చిన్న చూపు – ప్రతి స్త్రీ అలాంటిదే అని నమ్మకం. మనకి ఏదో లాభం ఉంటే కానీ ఏ పనైనా చేయని దశలో ఉన్న మనకి, ఆమె నిస్వార్థంగా నాకు సహాయం చేసిందంటే నమ్మలేకుండా ఉన్నారు. ఆమె దేశం చూడడానికి వచ్చిన నాకు, నాలుగు ప్రదేశాలు చూపించాలని, ఫ్రాన్స్ అంటే నా మనసులో మంచి భావన ఉండిపోవాలని ఆమె అలా చేసింది' అని సమాధానం చెప్పాడు రావ్.

'గురూ, ఆమె నిన్ను పేవ్మెంట్ మీదకి లాగినప్పుడు ఎలాంటి అనుభూతి కలిగింది?' అనడిగాడు అమీర్.

'ఒక మనిషి ఇంకొక మనిషిని అపాయం నుంచి రక్షిస్తే ఎలాంటి అనుభూతి కలుగుతుందో అలాంటి అనుభూతే కలిగింది. నేను ఒకవేళ అసభ్యంగా ప్రవర్తించి ఉంటే, ఆమె ఊహలో నేను, నా దేశం ఎంత క్రిందకి దిగజారుతాయో!' అన్నాడు రావ్ విచారంగా.

రెండు రబ్బర్లు పూర్తయ్యాయి. రావ్, దాసులు లేచి ఇంటికి నడక ప్రారంభించారు. పౌర్ణమి రోజు చంద్రుడు ఎప్పటిలా వెలిగిపోతున్నాడు.

ఆకాశం వైపు తనివి తీరా చూసేక, 'దాసూ నువ్వేమీ మాట్లాడడం లేదు. నీ ఉద్దేశ్యమేమిటి?' అనడిగాడు రావ్.

'ఇలాగే ఉందా పిండారబోసిన వెన్నెల ఆనాడూ? నమ్ముతాను మాస్టారూ. 'ఎదుటి మనిషిని నమ్ము' అని మన పిల్లలకి చెప్పం సరికదా, 'ఎదుటి వ్యక్తి మోసం చేస్తాడు జాగ్రత్త' అని వాళ్ళని పెడదారిన పెడతాం మనం. అది విచారకరం' అని సమాధానం చెప్పాడు దాసు.

చంద్రుడు వెన్నెలని కురిపిస్తూనే ఉన్నాడు.

# ఏమి అదృష్టం!

ఆచంట శారదాదేవి

**కథా మార్గదర్శి కథ**

***మీకు తీరిక లేని పని. అందునించి విసుక్కుంటున్నారు. నాకు రోజంతా ఏమీ తోచదండీ. ఇంక మా బాబు, నేరమ్మని కబురు చేస్తేనే గాని నాదగ్గరకు రాడు. వచ్చినా, పదినిమిషాలు కూడా వుండడు. వాడికి నా దగ్గర కంటె 'ఆయా' దగ్గరే ఎక్కువ చనువు! నేను లేకపోయినా ఏమీ బాధపడడు కాని 'ఆయా'ను విడిచి ఒక్క నిమిషం కూడా ఉండలేడు!" అని గట్టిగా నవ్వింది. ఆ నవ్వులో విషాదం ప్రతిధ్వనించింది.***

"జమీందారు గారి భార్య నిన్ను చూడాలన్నది. మధ్యాహ్నం వెళదామా ఒకసారి?" అన్నాడు సంజీవరావు, ఇంటికి రాగానే,

"నన్నా? ఎందుకూ?" విమల వంచిన తల ఎత్తకుండా అంది, పిల్లవాడికి పాలు కలుపుతూ...

సంజీవరావు, తిరిగి తిరిగి, ఎక్కడా వుద్యోగం దొరకదని నిస్పృహ చేసుకొన్న వారంరోజులకు, జమీందారు గారబ్బాయికొక ట్యూటరు కావాలని తెలియవచ్చింది. ఆశతో జమీందారు దర్శనం చేసుకున్నాడు. కోరిక ఫలించింది. చిన్నదొర కూడా కూడా తిరగటం, అతనికి బుద్ధిపుట్టినప్పుడు రెండుముక్కలు చెప్పటంకంటే వేరే పని యేమీ లేదు. జీతానికి లోపం లేదు. ప్రాణం కుదుటబడ్డది. రాణీ అప్పుడప్పుడు సంజీవరావుకు కబురు చేసి పిల్లవాడి యోగక్షేమాలు కనుక్కునేది. అల్లాగే సంజీవరావు కష్టసుఖాలు కూడా విచారించేది. క్రమేణా సంజీవరావుకు ఆమెయందు చాలా గౌరవం ఏర్పడ్డది. విమల రాణీగారిని చూడటానికి ఉత్సాహపడటం బదులు అడ్డుప్రశ్నలు వెయ్యటం చూసి సంజీవరావుకు చిరాకు వేసింది.

"ఎందుకేమిటీ, నీ మొహం! ఆవిడ అంతగా నిన్ను చూడాలని అంటూ ఉంటే నువ్వు..." అన్నాడు విసుగుతో.

"అది కాదండీ, నాకు మంచిచీర ఒక్కటి అయినా లేదుగదా, ఎలాగ అనీ..."

విమలకు ఎక్కడికైనా వెళ్లాలన్నప్పుడల్లా తనకు మంచిచీరెలు లేవని జ్ఞాపకం వస్తూ వుంటుంది. అందుకనే సంజీవరావు ఆమెను ఎక్కడికీ తీసుకుపోనేపోడు.

“నీ పెళ్లినాటి పట్టుచీరె వున్నదిగదా, అది చాల్లెద్దూ” అన్నాడు సమదాయిస్తూ.


“అదేమి చీరండీ! అంతా వెలిసిపోయింది! చినిగింది కూడానూ” అన్నది మారాము పెడుతూ.

“ఫరవాలేదులే. ఏ చీర కట్టుకున్నా ఆవిడకంటే అందంగానే వుంటావు.” అన్నాడు సంజీవరావు, కొంటెగా నవ్వుతూ.

విమల ముఖము కలువపువ్వులాగ వికసించింది. ఆమె కళ్లల్లో సంతోషం ఉక్కిరిబిక్కిరయింది. కాని మరుక్షణమే విచార రేఖలు ముందుకు తోసుకువచ్చాయి. “ఏమోలెండి, ఎల్లా వుంటేనేం, ఆవిడ అదృష్టం నాకెల్లా వస్తుందీ” అంది...

“సరేలే, మూడుగంటలకు నువ్వూ పిల్లలూ సిద్ధంగా వుండండి. నేను వచ్చి తీసుకుపోతాను” అన్నాడతను, మళ్లీ కండువా పైన వేసుకుంటూ.

★★★



విమల పన్నెండింటికే మొదలు పెట్టింది ప్రయాణ సన్నాహం. అయినా, పిల్లలకు తలదువ్వి నీళ్ళు పోసి తనూ సింగారించుకునేప్పటికి మూడు కావచ్చింది. విమలకు విసుగూ, విచారం ముంచుకువచ్చాయి... ‘ఏమి జీవితం! పొద్దున లేచింది మొదలు రాత్రి పదిగంటల దాకా క్షణం తీరిక లేదు. ఎక్కడికి వెళ్ళాలన్నా విశ్వ ప్రయత్నం కావాలి. జీవితంలో విశ్రాంతి, శాంతి రెండూ లేవు. అన్నీ తీరని కోరికలే... ఇప్పుడు జమీందారుగారింటికి వెళ్ళకపోతేనేం? తను ఆమెకంటే అందంగా ఉంటుందట, అయితే మాత్రం ఆమెకూ తనకూ సామ్యం ఏమిటి? ఆమె లక్ష్మీప్రసన్నురాలు, తన వెలిసిన చీరె, తనూ...’ బండి ఆగిన చప్పుడు విని తలుపు తీసింది.

"రెడీగా ఉన్నారా? పోదామా?"

"ఊ! చూడండి! ఆవిడకు చాలా గర్వమా?"

"ఛీ, చాలా మంచి మనిషి."

తలవాల్చుకొని బండి ఎక్కింది విమల. పిల్లలిద్దరూ బండిచూసి మురిసిపొయ్యారు...

★★★

జమీందారిణిగారి పేరు గుణవతీదేవి. ఆమే, జమీందారు గారూ ఒకరినొకరు చూసుకొని కొన్ని సంవత్సరాలవుతుంది. గుణవతి ఇప్పుడు కేవలం విలువైన వస్తువులు కొనడంతోనే హృదయాన్ని తృప్తిపరచు కోవాలని చూస్తున్నది. చీరెలూ, నగలూ సంతోషాన్ని ఇవ్వడం మానేసి చాలా రోజులైనా కూడా అలవాటు చొప్పున ఇంకా కొంటూనే ఉంటుంది. పైగా ఆమెకు అదే వ్యాపకం కూడాను. ఇవ్వాళకూడా విమల వచ్చేసరికి ఆవిడ చీరల బేరంలోనే వున్నది.

"డబుల్ కలర్ చీరెలు ఇప్పుడు చాలామంది కడుతున్నారమ్మా. ఈ చీర చిత్తగించండి" అంటున్నాడు సెట్టి. విమల చీర చిరుగు కనపడకుండా కుచ్చెళ్లు సర్దుకుంటూ రాణీని సమీపించింది.

"రండి, కూర్చోండి" అన్నది సోఫా చూపిస్తూ గుణవతి. విమల బెదురుతూ కూర్చున్నది, చీరలను చూస్తూ. ఎంత మంచి చీరెలు! ఎంత చక్కని జరీపని! ఆ చీరెలన్నీ చూస్తూవుంటే, తన వంటిన వెలిసిపోయిన చీరె ముళ్లు గ్రుచ్చుకుంటున్నట్లున్నది.

గుణవతికి మాత్రం ఒక్క చీరా నచ్చలేదు. అసలు ఆమెకు కావలసినది చీరెలైతే గదా! "ఏమీ బాగా లేవు, రేపు ఇంకేమయినా రకాలు పట్టుకురా." అన్నది సెట్టితో,

"చిత్తం" అంటూ మూట కట్టుకొని వెళ్ళిపోయాడు సెట్టి... దాసీది టీ తెచ్చిపెట్టింది...

"టీ' పుచ్చుకొంటారా?" అన్నది గుణవతి. విమల గుణవతి కేసి తలెత్తి చూసింది. అందం లేకపోయినా, ఆమె ముఖంలో ఎంత ఠీవి వున్నది! ఏదో చెప్పలేని ఆకర్షణ! కళ్లల్లో మాత్రం విచారం కనబడుతుంది.

"వద్దండీ, నాకు అలవాటు లేదు" అన్నది వినపడీ వినపడకుండా.

గుణవతి, మాట్లాడకుండా, రెండు కప్పులలో టీ పోసి పిల్లలిద్దరికీ ఇచ్చింది. చిన్నవాడు వేడి టీ పట్టుకోలేక టీ అంతా కాశ్మీర తివాసీమీద కొంతా, తన చొక్కామీద కొంతా ఒలకబోసుకున్నాడు. ఖరీదయిన తివాసీ మరకైందన్న భయంతో పిల్లవాడి మీద కోపం వచ్చింది విమలకు. 'ఏమి సంతానం?' అని మనస్సులో విసుక్కున్నది. గుణవతి మాత్రం, నవ్వుతూ, పిల్ల వాడిని దగ్గరకు తీసుకొని పట్టు రుమాలుతో తుడిచి మళ్లీ టీ త్రాగించింది... విమలకు కొంచెం ఊపిరి సలిపింది.

"ఎప్పుడూ ఇంతే! ఎక్కడికెళ్లినా ఏదో ఒకటి. బయట అడుగుపెట్టడానికే భయం!" అన్నది విమల.

"ఫరవాలేదండీ! ఈ మాత్రానికే!!" అంటూ నవ్వింది గుణవతి.

"అదికాదండీ, నాకు వీళ్ళతో విసుగొస్తున్నది. ఒక్క నిమిషమైనా విరామం లేదు, ఎప్పుడూ నా కొంగు పట్టుకొని వదలరు" అన్నది విమల, సంసారం గొడవల్లోకి దిగుతూ, మామూలు ధోరణిలో.

"మంచిదేగదా, మీకు బాగా కాలక్షేపం అవుతుంది."

"సరిలేండి, వీళ్లతో ఒక్క పనీ తెమలదు."

గుణవతి అకారణంగా నవ్వింది. "అదీ! మీకు తీరిక లేని పని. అందునించి విసుక్కుంటున్నారు. నాకు రోజంతా ఏమీ తోచదండీ... ఇంక మాబాబు, నేరమ్మని కబురు చేస్తేనేగాని నాదగ్గరకు రాడు. వచ్చినా, పదినిమిషాలు కూడా వుండడు. వాడికి నాదగ్గర కంటె 'ఆయా' దగ్గరే ఎక్కువ చనువు ! నేను లేకపోయినా ఏమీ బాధపడడు కాని 'ఆయా'ను విడిచి ఒక్క నిమిషం కూడా ఉండలేడు!" అని గట్టిగా నవ్వింది. ఆ నవ్వులో విషాదం ప్రతిధ్వనించింది.

విమల విస్తుపోయి చూసింది "దాసీలూ! దాదులూ!! పనిలేక పొద్దుపోదట! ఎంత అదృష్టవంతురాలు!" అనుకున్నది.

"పంతులుగారు కూడా వచ్చారా?" అన్నది గుణవతి ప్రసంగం మారుస్తూ.

"ఆ! బయట వున్నారు... నేను వెళ్తాను చాలాసేపైంది." అంటూ లేచింది విమల. దాసీది పళ్లూ, తమలపాకులూ తెచ్చి పెట్టింది.

"తరుచు వస్తూవుండండి" అన్నది గుణవతి.

"అల్లాగే. కాని, నాకు ఇల్లు కదలడానికే వీలుండదండీ. పని అంతా పూర్తిచేసుకొనేసరికి ఆయన ఇంటికి వస్తారు. ఏవో కబుర్లతోటి గడిచిపోతుంది. నేను లేకపోతే ఆయనకేమీ తోచదు" అన్నది విమల సిగ్గుపడుతూ. గుణవతికి కళ్ళు చెమ్మగిల్లినవి.

పిల్లలు పళ్ళకోసరం ఎగబడ్డారు. ప్రతిదానికీ వాచిపోవటమే! విమల హృదయం అవమానంతో, దుఃఖంతో క్రుంగిపోయింది. కళ్లల్లో నీరు నిండింది.

గేటు దాటుతూ భర్తతో "ఎంత నిదానమైన మనిషి! ఏ కొరత లేదు గదా! ఏమి అదృష్టం!!" అన్నది కళ్లు తుడుచుకుంటూ

"ఎంత అందంగా వున్నది! చిలకా గోరువంకల లాగా వున్నారు. ఏమి అదృష్టం" అనుకున్నది గుణవతి కిటికీలోంచి చూస్తూ... కన్నీటిధార ఆపుకోలేకపోయింది.

# తెలుగు సాహిత్యము
## శతకములు

### మోచర్ల అనంత పద్మనాభరావు

(గత సంచిక తరువాయి)

తెలుగుభాషకు ఎనలేని సేవచేసిన ఆంగ్లేయుడు బ్రౌన్ మహాశయుడు. ఆయన వేమన పద్యములను ఆంగ్లభాషలోకి తర్జుమాచేసి విశ్వవ్యాప్తం చేసినారు.

శతకము యొక్క గొప్పతనం తెలుసుకొన వలెనన్న దానిని పఠించి తీరవలెను. సుమతీ శతకం ప్రస్తావనలో కొస్తే, కొన్ని శతాబ్దాలుగా పండిత పామరులు నిత్యజీవితంలో వాటినన్వయిస్తూ ఉదహరించడం జరుగుతోంది.

శ్రీరాముని దయ చేతను
నారూఢిగా సకల జనులు నౌరా యనగా
ధారాళమైన నీతులు
నోరూరగ జవుల పుట్ట నుడివెద సుమతీ ॥

'శ్రీరామచంద్రుని దయతో, సమస్త జనులు ఔరా అనునట్లుగా, నోటియందు చక్కని రసము లూరునట్లుగా, మంచి నీతులను చక్కగా చెపుతాను' అన్న పద్యముతో మొదలుపెట్టి సుమతీ శతకమును నీతిశతకముగా తీర్చిదిద్దిన బద్దెన కవి కృషి ప్రశంసనీయము. శతకములను విజ్ఞానఖనులుగా చెప్పుకొన వచ్చును. రాజనీతి, ప్రజానీతి, లోకనీతి, ప్రవృత్తి నీతి మరియు గృహనీతుల గురించి చిన్న పద్యములలో సులభముగా అర్థమయ్యేలా తెలియచెప్పడమైనది. ఎన్నో శతాబ్దముల క్రితం వ్రాయబడినా ఇందులోని పదములు మన భాషలో ఇప్పటికీ వాడుకలో నుండుట గమనార్హం. శతకములోని కొన్ని పద్యములను ఉదహరిస్తూ అర్థములను తెలిసికొనిన యెడల వాటిలో నిగూఢమైన భావం, నీతి ప్రస్ఫుటంగా విదితమౌతుంది.

అక్కరకు రాని చుట్టము,
మ్రొక్కిన వరమీని వేల్పు, మోహరమునఁ దా
నెక్కినఁ బారని గుర్రము
గ్రక్కున విడువంగ వలయుఁ గదరా సుమతీ ॥

అవసరమునకు పనికిరాని చుట్టమును, నమస్కరించి వేడిననూ కోరిక నెఱవేర్చని భగవంతుని, యుద్ధసమయమున ఎక్కినప్పుడు ముందుకు పరుగుతీయని గుఱ్ఱమును వెంటనే విడిచిపెట్టవలయును. దీనిలో దాగివున్న నీతేమిటంటే, పనికిరానివాటిని పట్టుకుని ప్రాకులాడే బదులు, వాటిని విస్మరించడం శ్రేయస్కరం. దానివలన సమయము, శ్రమ కలిసివస్తాయనేది భావన.

(సశేషం)